అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
ఆదివారం 3-9-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 244 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + సోపతి (వెబ్‌లో) | వెల : 8.00

జీ 20ని హైజాక్ చేయాలనుకుంటున్నారు !

రష్యా రాయబారి విమర్శ



న్యూఢిల్లీ : త్వరలో భారత్‌లో జరగబోయే జీ 20 సదస్సును హైజాక్ చేయడానికి కొన్ని దేశాలు ప్రయత్నిస్తున్నాయని రష్యా విమర్శించింది. అంతర్జాతీయ ఆర్థిక, ద్రవ్యపరమైన అంశాలపై దృష్టి కేంద్రీకరించడానికి బదులుగా ఉక్రెయిన్ సంక్షోభానికి సంబంధించిన ఎజెండాను అమలు చేయడానికి కొన్ని దేశాలు రాబోయే జీ 20 సదస్సును ఉపయోగించుకుంటాయని రష్యా భావిస్తోంది. వచ్చే వారం ఇక్కడ జరగనున్న సదస్సు నేపథ్యంలో న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రష్యా రాయబారి డెన్నిస్ అలిపొవ్ మాట్లాడుతూ, "దురదృష్టవశాత్తూ, జీ 20కి అధ్యక్షురాలిగా వున్న భారత్ కొన్ని దేశాల నుంచి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. వారు జీ 20 ఎజెండాను హైజాక్ చేస్తున్నారు. చర్చనీయాంశాల్లో ఉక్రెయిన్ సంక్షోభాన్ని ...13లో



శ్రీహరికోట షార్ నుంచి నింగిలోకి ఆదిత్య ఎల్1

ఆదిత్య ఆల్ ది బెస్ట్

పీఎస్ఎల్‌వీ సీ-57 ప్రయోగం విజయవంతం

సూళ్లూరుపేట : సూర్యుని చుట్టూ వాతావరణ పరిస్థితులపై పరిశోధనలు చేసేందుకు రూపొందించిన 'ఆదిత్య ఎల్ 1' శ్రీహరికోట షార్ నుంచి శనివారం ఉదయం 11.50 నిమిషాలకు నిప్పులు చిమ్ముతూ అంతరిక్షం వైపు దూసుకెళ్లింది. ప్రయోగం అనంతరం 63 నిమిషాల 30 సెకండ్ల తరువాత ఆదిత్య ఎల్1 మిషన్‌ను నిర్దిష్ట కక్షలో పీఎస్ఎల్‌వీ సీ-57 రాకెట్ వదిలిపెట్టింది. సూర్యునిపై పరిశోధనలు జరపడమే ఆదిత్య-ఎల్1 మిషన్ ప్రయోగ ముఖ్య లక్ష్యం.

దీనికోసం ఈ మిషన్‌లో ఏడు సైంటిఫిక్ పరికరాలను అమర్చారు. 1475 కిలోల బరువు కలిగిన మిషన్ సూర్యుని సమీపానికి చేరుకోడానికి 1.5 మిలియన్ల కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. ఇందుకు 125 రోజుల సమయం పడుతుంది. ఆదిత్య లాంటి మిషన్లను ఇప్పటికే అమెరికా, జర్మనీ, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీలు పంపి ఉన్నాయి. ఆదిత్య ఎల్1లోని ఏడు పేలోడ్స్‌లో నాలుగు నేరుగా సూర్యునిపై పరిశోధనలు చేస్తాయి. మిగిలిన మూడు సౌర రేణువులు, అయ స్కాంత ...13లో

ఈ సంవత్సరం చివరలో రాజస్థాన్, ఛత్తీస్‌ఘర్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ రాష్ట్రాలలో బీజేపీ పరిస్థితి ఏమంత బాగా లేదు. ఇలాంటి పరిస్థితులలో ప్రతిపక్ష కూటమి ముందుకు వచ్చింది. దీనిని దృష్టిలో పెట్టుకొనే ఎన్నికల నిర్వహణపై కేంద్రం గందరగోళం సృష్టిస్తోంది. ప్రతిపక్షాలు పూర్తిగా బలపడకముందే లోక్‌సభకు ఎన్నికలు నిర్వహించాలని మోడీ ప్రభుత్వం 'దూరాలోచన' చేస్తోంది. ఏదేమైనా రాబోయే రోజులు ఉత్కంఠగా సాగబోతున్నాయి. జీ-20 సదస్సు నుండి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల ఏర్పాటు వెనుక ఉన్న అసలైన ఉద్దేశం వరకూ పరిణామాలన్నీ భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించబోతున్నాయి. అలాగే ప్రజాస్వామ్య రక్షణ, కార్పొరేట్ దోపిడీ, ఇండియా సమావేశం వంటి అంశాలు ప్రజాస్వామ్య భవిష్యత్తును నిర్దేశించబోతున్నాయి.



దురాలోచన!

'జమిలి'పై మోడీ సర్కార్ అత్యుత్సాహం

= ప్రతిపక్షాలు బలం పుంజుకోకూడదని ఎత్తుగడ = అదానీ వ్యవహారం నుండి ప్రజల దృష్టిని మళ్లించే యత్నం

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలకు ముందు నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏదో అతి పెద్ద, అనూహ్య నిర్ణయమే తీసుకోబోతోంది. అయితే అదేమిటో ఊహించడం కష్టంగానే ఉంది. ఒకటి మాత్రం నిజం. సార్వత్రిక ఎన్నికలు అషామాషీగా జరగబోవడం లేదు. ప్రభుత్వ అధికారుల నుండి సామాన్య కార్మికుల వరకూ అందరి దృష్టీ రాబోయే ఎన్నికల పైనే. ఈ ఎన్నికలలో మోడీ ప్రభంజనం ఉండబోదని మాత్రం అందరూ చెబుతున్న మాట.

గత నెల 30-ఈ నెల 1 మధ్యకాలంలో దేశంలో రెండు ముఖ్యమైన ఘటనలు జరిగాయి. ఒకటి ముంబయిలో రెండు రోజుల పాటు జరిగిన



ప్రతిపక్ష ఇండియా కూటమి సమావేశం. బీజేపీపై పోరుకు కలసికట్టుగా ముందుకు సాగాలని, ఉమ్మడి అభ్యర్థులను నిలపాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇక మరో ముఖ్యమైన ఘటన ఏమంటే ఈ నెల 18 నుండి ఐదు రోజుల పాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నట్లు నరేంద్ర మోడీ ప్రభుత్వం చేసిన ...13లో

8 మందితో జమిలి ఎన్నికల కమిటీ..

= న్యాయశాఖ నోటిఫికేషన్
= అమిత్ షా, అధిర్ రంజన్ చౌదరి, గులాం నబీ ఆజాద్, తదితరులకు చోటు 6లో..

ఇదొక విడ్డూరం

ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయమేమంటే మోడీకి అత్యంత సన్నిహితుడిగా చెబుతున్న పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై తాజాగా వచ్చిన ఆరోపణలు. వీటివల్ల మోడీ ప్రతిష్టకు వాటిల్లిన నష్టాన్ని పూడ్చడం ప్రభుత్వానికి కష్టమవుతోంది. ఇక చేసేదేముంది? ప్రజల దృష్టిని మళ్లించడమే మిగిలింది. అందులో భాగంగానే జమిలి ఎన్నికలను తెర పైకి తెచ్చారు. 'ఒకే దేశం...ఒకే ఎన్నిక'పై దేశవ్యాప్తంగా వాడి వేడి రాజకీయ చర్చకు తెరతీశారు. అంతేకాదు...మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఓ కమిటీని కూడా వేశారు. ఒక మాజీ రాష్ట్రపతి ఈ తరహా కమిటీలకు నాయకత్వం వహించిన దాఖలాలు ఇప్పటి వరకూ లేవు.

నిరసనలు, ఆందోళనల మధ్యే..

డబుల్ ఇండ్ల పంపిణీ

మేయర్ కాళ్లుపట్టుకొని వేడుకున్న మహిళ

= పలు ప్రాంతాల్లో దరఖాస్తు పత్రాలతో నిరసన
= గ్రేటర్ పరిధిలో ఏడు లక్షల దరఖాస్తులు = ఆందోళన వద్దు: మంత్రులు





నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సొంతిల్లు లేని పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పంపిణీ కార్యక్రమం ఆందోళనలు, నిరసనల మధ్యే ప్రారంభమైంది. శనివారం పలు ప్రాంతాల్లో మొదటి విడతలో భాగంగా లబ్దిదారులకు మంత్రులు, ఎమ్మెల్యేలు, మేయర్ ఇండ్ల పత్రాలు అందించారు. అయితే, ఒకవైపు ఇండ్ల పంపిణీ జరుగుతుండగా.. మరోవైపు ఇండ్లు రానివారు దరఖాస్తులు పట్టుకుని నిరసనకు దిగారు. ప్రతిపక్ష నాయకులు, స్థానికుల ఆందోళనలు, నిరసనల మధ్యే ఇండ్ల పంపిణీ కార్యాక్రమాన్ని కొనసాగించారు.పటాన్‌చెరు నియోజకవర్గంలోని కొల్లూర్-1లో మంత్రి హరీశ్‌రావు లబ్దిదారులకు ఇండ్లు అందించగా, మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ...2లో

కాంగ్రెస్ దరఖాస్తుల పరిశీలన

నేడు ఎలక్షన్ కమిటీ భేటీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ఆశావాహుల దరఖాస్తులను పరిశీలించేందుకు ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ (పీఈసీ) ఆదివారం సమావేశం కానుంది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు వెయ్యి మంది ఆసక్తి చూపించారు. వాటన్నింటిని పూర్తిగా పరిశీలించిన తర్వాత నియోజకవర్గానికి మూడు పేర్ల చొప్పున ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీకి పీఈసీ పంపనుంది. ఏఐసీసీ నియమించిన రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ ఆ దరఖాస్తులను సోమ, మంగళ, బుధవారాల్లో లోతుగా పరిశీలించనుంది. దరఖాస్తుదారులు పార్టీలో ఎప్పుడు చేరారు? ఆ నాయకుడు చేసిన కార్యక్రమాలేంటి? ఐదేండ్ల కాలంలో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలు, ఆందోళనలు, ప్రజల్లో ఆయనకు ఉన్న ప్రజాదరణ, బీఆర్ఎస్‌ను ఓడించే సామర్థ్యం ఉందా? ఇలా అనేక అంశాలను పీఈసీ



నిశితంగా పరిశీలించనుంది. దరఖాస్తుల పరిశీలనకు సమగ్ర సమాచారం పొందుపరచలేదంటూ పీఈసీ తొలి సమావేశంలో ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతోపాటు ఒకే కుటుంబంలో రెండు సీట్లు కేటాయింపుపై నేతల మధ్య వాదోపవాదాలు జరిగాయి. దీంతో మరోసారి భేటీ కావాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే.

ఏఎన్ఎంల సమస్యల అధ్యయనానికి కమిటీ ఏర్పాటు

ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంల సమస్యలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించేందుకు వైద్యారోగ్యశాఖ ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు శనివారం వైద్యారోగ్యశాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం.రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. టీశాక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చైర్‌పర్సన్‌గా, రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు సభ్య కార్యదర్శిగా, రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు సభ్యునిగా ముగ్గురితో కూడిన ఈ కమిటీ ఏఎన్ఎంల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నది. నివేదికను అతి త్వరగా సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



జీ 20 సదస్సుకు

జో బైడెన్

రెండు రోజుల ముందే భారత్‌కు..



వాషింగ్టన్ : సెప్టెంబర్ 9-10 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న జీ 20 సదస్సుకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ హాజరుకున్నారు. అయితే ఈ సదస్సు జరగబోయే రెండురోజుల ముందే జో బైడెన్ భారత్‌కు చేరుకోనున్నట్టు వైట్ హైస్ శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటన వెల్లడించింది. సెప్టెంబర్ 8వ తేదీ శుక్రవారం అమెరికా అధ్యక్షుడు బైడెన్, భారత ప్రధాని మోడీతో ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొనున్నారని శ్వేతసౌథ ప్రకటన వెల్లడించింది. ఇక సెప్టెంబర్ 9-10 తేదీల్లో జరగనున్న జీ - 20 సదస్సులో బైడెన్ పాల్గొనునున్నట్టు వైట్ హౌస్ ప్రకటన తెలిపింది.కాగా, జీ20 శిఖరాగ్ర సమావేశంలో స్వచ్ఛమైన ఇంధన పరివర్తన, వాతావరణ మార్పులతో సహా ప్రపంచ సమస్యల్ని పరిష్కరించడానికి జీ 20 దేశాల భాగస్వాములతో కలిసి బైడెన్ చర్చించనున్నట్టు వైట్ హౌస్ ప్రకటన తెలిపింది.



13లో

మా పార్టీ కార్యకర్తలకే పథకాలు..

= మాకు ఓటు వేయని వాళ్లకి ఇచ్చేది లేదు
= ఎమ్మెల్యే రెడ్యా నాయక్ వివాదాస్పద వ్యాఖ్యలు

పేదల గుడిసెలు ధ్వంసం

సుమారు 200 మంది రౌడీలు, ట్రాక్టర్లు, పెట్రోల్ సీసాలతో దాడి



వారికి స్థానిక కౌన్సిలర్ల అండ!

= దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
= సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య డిమాండ్

నవతెలంగాణ-చెన్నూర్

మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణ శివారు బావురావుపేట సర్వే నెం.8లో గుడిసెవాసులపై భూకబ్జాదారులు దాడి చేశారు. శనివారం సుమారు 200 మంది రౌడీలతో వచ్చి బీభత్సం సృష్టించారు. గుడిసెలను ట్రాక్టర్లతో కూల్చి పెట్రోల్ పోసి దహనం చేశారు. అడ్డొచ్చిన మహిళలపై కూడా దాడి చేసి కులం పేరుతో దూషించారు. ఐదు నెలలుగా పేదలు ప్రభుత్వ భూములను కాపాడాలని పోరాటం చేస్తున్నా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు. పేదల గోడు పట్టించుకోకుండా కబ్జాదారులకు వంత పాడుతున్నారు. గుడిసెలను ధ్వంసం చేయడంలో అధికార బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా ...13లో



దుర్మార్గం

= దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి
= గుడిసెవాసులందరికీ పట్టాలివ్వాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్

వివరాలు 13లో

గజ్వేల్‌లో ఈటల.. కామారెడ్డిలో విజయశాంతి

బీజేపీ అధిష్టానం ప్లాన్ ..?



= కేసీఆర్‌ను ఓడిస్తానంటూ సవాల్ చేసిన ఈటల
= ఇంత వరకు గజ్వేల్‌పై కేంద్రీకరించి పని చేసిందిలేదు
= కామారెడ్డిలోనూ అదే పరిస్థితి
= రెండు చోట్లా బీజేపీకి కనీస ఓటు బ్యాంకులేని దుస్థితి 2లో..
= ఎందుకోసం పోటీ అంటూ చర్చలు

అక్కాచెల్లెళ్లపై సామూహిక లైంగికదాడి

బీజేపీ నేత కొడుకు సహా 10 మంది అరెస్ట్

డెహ్రాడూన్ : ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో దారుణ ఘటన వెలుగు చూసింది. ఇద్దరు అక్కాచెల్లెళ్లు రక్షాబంధన్ జరుపుకుని తిరిగి వస్తుండగా సామూహిక లైంగికదాడికి గురయ్యారు. ఈ ఘోరానికి పాల్పడిన పదిమంది దుండగుల్లో ఇటీవల బెయిల్‌పై విడుదలైన స్థానిక బీజేపీ నాయకుడు కుమారుడు ఉండటం గమనార్హం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కా చెల్లెళ్లు, యువతికి కాబోయే భర్త ముగ్గురు కలిసి తిరిగి వస్తుండగా వారిని నిందితులలో ముగ్గురు మొదట అడ్డగించారు. ఆ ముగ్గురూ నగదు, మొబైల్ ఫోన్లు దోచుకెళ్లారు. మిగిలిన ఏడుగురు నిందితులు నాలుగు ద్విచక్ర వాహనాలపై సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈలోగా నిందితులు ఇద్దరు అక్కాచెల్లెళ్లను ప్రధాన రహదారికి దూరంగా నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డారు. ఇద్దరు బాలికలతోపాటు వచ్చిన యువకుడిని కూడా తీవ్రంగా కొట్టారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడైన స్థానిక బీజేపీ నాయకుడు లక్ష్మీ నారాయణ్ సింగ్ కుమారుడు పూనమ్ ఠాకూర్ సహా పది మందిని పోలీసులు అరెస్టు చేశారు.



పార్టీ విలీనంపై కాంగ్రెస్‌తో

తుది దశకు చర్చలు

వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు షర్మిల



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్టీ విలీనంపై కాంగ్రెస్‌తో చర్చలు తుది దశకు వచ్చాయని వైఎస్సార్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడారు. తన తండ్రి రాజశేఖరరెడ్డిని అపారంగా గౌరవిస్తున్నారు కాబట్టే.. సోనియా, రాహుల్‌తో చర్చలు వరకూ వెళ్లానన్నారు. వైఎస్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చటం సోనియాకు తెలియక చేసిన పొరపాటే కానీ.. తెలిసి చేసిన తప్పు కాదని తెలిపారు. రాజీవ్ గాంధీ చనిపోయిన తర్వాత ...13లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, అజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 60,220	▲	170
22 క్యారెట్లు	- 55,200	▲	150
కిలో వెండి	- 80,000	▼	200



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 129
రిటైల్ (లైవ్)	రూ. 151
స్కిన్‌తో	రూ. 219
స్కిన్‌లెస్	రూ. 249

ఎందుకీ సస్పెన్స్ ?

ప్రత్యేక సమావేశాల అజెండా ఏది?

- రాజ్యాంగ నిబంధనలకు తూట్లు
- ప్రజాస్వామ్యం చట్టసభల అపహాస్యం



న్యూఢిల్లీ : పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఈ నెల 18 నుండి 22వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు జరగబోతున్నాయి. అయితే ఇంత అకస్మాత్తుగా ఎందుకు జరుగుతున్నాయో ఎవరికీ తెలియడం లేదు. ప్రత్యేక సమావేశాల గురించి 'ఎక్స్'లో ట్వీట్ చేసిన కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ, వాటిని ఎందుకు ఏర్పాటు చేస్తున్నారో మాత్రం వెల్లడించలేదు. దీంతో మీడియా, రాజకీయ నాయకులు ఎవరికి తోచిన ఊహాగానాలు వారు చేస్తున్నారు. జమిలి ఎన్నికల పైన చర్చించేందుకే పార్లమెంటును సమావేశపరుస్తున్నారని కొన్ని ప్రతిపక్ష పార్టీలు చెబుతున్నాయి. కొందరేమో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)పై చర్చించడానికని అంటుంటే మరి కొందరు చట్టసభలలో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లుకు చట్టరూపం కల్పించడానికంటూ ఊహిస్తున్నారు.

ఒకవేళ తాము ప్రభుత్వ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా సమావేశాలను స్తంభింపచేస్తే నరేంద్ర మోడీ, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ వెంటనే రంగంలోకి దిగుతాయని, తమను లక్ష్యంగా చేసుకొని ప్రజలలో దురభిప్రాయం కలిగించేందుకు ప్రయత్నిస్తాయని ప్రతిపక్ష పార్టీ ఎంపీ ఒకరు తెలిపారు. కాగా సమావేశాలపై మోడీ ప్రభుత్వ ప్రకటనలో నాటకీయత శృతి మించిందని కాంగ్రెస్ నేత అభిషేక్ మనుసింఘ్వీ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఉద్దేశాన్ని రహస్యంగా ఉంచుతూ, బయటకు లీకులు అందిస్తున్నారని విమర్శించారు.

నిబంధనలకు నీళ్లు

ప్రభుత్వ ఉద్దేశం ఏదైనప్పటికీ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను, గతంలో అనుసరించిన సంప్రదాయాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగంలోని 85వ అధికరణలో పార్లమెంట్ సమావేశాల నిర్వహణ, ప్రొరేగ్, రద్దు గురించిన వివరాలను పొందుపరిచారు. పార్లమెంట్ సమావేశాలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేయాల్సింది రాష్ట్రపతి. సమావేశాల మధ్య ఆరు నెలలకు మించి వ్యవధి ఉండకూడదు. రాజ్యాంగం ప్రకారం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను రాష్ట్రపతి ఏర్పాటు చేయాల్సి ఉండగా అందుకు భిన్నంగా ప్రభుత్వమే ప్రకటన చేయడం గమనార్హం.

అసలు రాజ్యాంగంలోని 85వ అధికరణలో 'ప్రత్యేక' సమావేశాల ప్రస్తావనే లేదు. అయితే సభా వ్యవహారాలకు సంబంధించిన రూల్ 3 ప్రకారం సమావేశాలకు హాజరు కావాల్సిందిగా సభ్యులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ అత్యవసరంగా, తక్కువ వ్యవధిలో సమావేశాలు నిర్వహించాల్సి వస్తే ప్రతి ఒక్క సభ్యుడికీ విడివిడిగా సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదు. కానీ ఎప్పుడు, ఎక్కడ నిర్వహించాలన్న దానిపై గెజిట్‌లోనూ, పత్రికలలోనూ ప్రకటించాలి. ప్రహ్లాద్ జోషీ చేసిన ట్వీట్‌ను పరిశీలిస్తే సమావేశాలను తక్కువ వ్యవధిలో, అత్యవసరంగా నిర్వహిస్తున్నట్లు అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

ప్రత్యేక సందర్భాలలో మాత్రమే...


ప్రభుత్వాలు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయడానికి సంబంధించి రాజ్యాంగంలో ఎక్కడా ప్రస్తావన లేనప్పటికీ కొన్ని మినహాయింపులు ఉన్నాయి. ఉదాహరణకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 1998లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరిచారు. ముఖ్యమంత్రి పదవిని చేపట్టడానికి కల్యాణ్ సింగ్, జగదాంబికా పాల్‌లలో ఎవరికి మెజారిటీ ఉన్నదో తేల్చడానికి ప్రత్యేక సమావేశం నిర్వహించాలని అప్పుడు సుప్రీంకోర్టు ఆదేశించింది.

భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని 1997 ఆగస్ట్ 26 నుండి సెప్టెంబర్ 1వ తేదీ వరకూ పార్లమెంట్ ఉభయ సభలు ప్రత్యేకంగా సమావేశమయ్యాయి. 1975 జూన్ 21న పార్లమెంట్ ప్రత్యేక సమా వేశాన్ని నిర్వహించారు. ఆ సమావేశంలో ఇతర కార్యకలా పాలన్నింటినీ పక్కనపెట్టి కేవలం ప్రభుత్వ వ్యవహారాలను మాత్రమే చేపట్టారు. ఆ తర్వాత 1976 అక్టోబర్ 25న మరోసారి లోక్‌సభ ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు.

ఆ సమావేశంలో రాజ్యాంగానికి 42వ సవరణ బిల్లును ప్రతిపాదించారు. ఈ పరిణామా లన్నీ దేశంలో అత్యవసర పరిస్థితి అమలులో ఉన్న 19 నెలల కాలంలో జరిగినవే.ఇప్పుడు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఎందుకు నిర్వహిస్తున్నదీ ప్రభుత్వం ప్రకటించి ఉంటే సభ్యులు ఆయా అంశాలపై ముందుగానే అవగాహనకు వచ్చే అవకాశం ఉండేది. తద్వారా సభలో అర్థవంతమైన చర్చకు వీలు కలిగేది. కానీ ప్రభుత్వానికి ఆ ఉద్దేశమే ఉన్నట్టు కన్పించడం లేదు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి ఎంతమాత్రం మంచివి కావు. ఇది కచ్చితంగా చట్టసభను, రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే అవుతుంది.

సింగపూర్ అధ్యక్షుడిగా షణ్ముగరత్నం

- భారత సంతతి వ్యక్తి గెలుపు



సింగపూర్ : సింగపూర్ అధ్యక్ష ఎన్నికల్లో భారత సంతతి వ్యక్తి విజయం సాధించారు. మాజీ ఉపప్రధానమంత్రి ధర్మన్ షణ్ముగరత్నం శుక్రవారం సింగపూర్ అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. 66 ఏళ్ల షణ్ముగరత్నం విజయాన్ని ఎన్నికల కమిటీ ధ్రువీకరించింది. 2011 తర్వాత సింగపూర్‌లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో ఇద్దరు చైనా సంతతికి చెందిన అభ్యర్థులను ఓడించి షణ్ముగరత్నం నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2011 నుంచి 2019 వరకు సింగపూర్ ఉప ప్రధానిగా పనిచేసిన షణ్ముగరత్నానికి 70.4శాతం ఓట్లు రాగా.. ఆయన ప్రత్యర్థులు ఎంగ్ కోక్‌సోంగ్, టాన్ కిన్ లియాన్‌లకు వరుసగా 15.7 శాతం, 13.88శాతం ఓట్లు వచ్చినట్టు ఎన్నికల కమిటీ అధికార ప్రతినిధి వెల్లడించారు. అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన ధర్మన్‌కు సింగపూర్ ప్రధాని లీ సీన్ లూంగ్ అభినందనలు తెలిపారు. సింగపూర్ ప్రస్తుత అధ్యక్షురాలు హలీమా యాకూబ్ పదవీకాలం ఈనెల 13న ముగియనుంది. షణ్ముగరత్నం సింగపూర్‌లో 2011 నుంచి 2019 మధ్యకాలంలో ఆర్థిక, విద్యాశాఖ మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా సేవలందించారు. రాజకీయాల్లోకి రాకముందు ఆర్థికవేత్తగా, పౌర సేవకుడిగా ఉండేవారు.

'జెట్ ఎయిర్‌వేస్' వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్ అరెస్ట్

ముంబయి : జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్(74)ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు శుక్రవారం రాత్రి ముంబైలో అరెస్టు చేశారు. ఆయనను అక్రమ నగదు లావాదేవీల నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఈడీ అరెస్టు చేసింది. నరేశ్ గోయల్ జెట్ ఎయిర్‌వేస్ కోసం కెనరా బ్యాంక్ నుంచి 848.86 కోట్ల రుణాలను తీసుకున్నారని, అందులో 538.62 కోట్లను బ్యాంక్‌కి చెల్లించలేదని కెనరా బ్యాంక్ ఫిర్యాదు మేరకు గోయల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. బ్యాంక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ గోయల్ డబ్బుల్ని స్వాహా చేసినట్టు నిర్ధారించింది. ఎఫ్ఐఆర్ ఆధారంగానే ఈడీ గోయల్‌ని ప్రశ్నించి అరెస్టు చేసింది. గోయల్‌ని శనివారం ముంబయిలోని పీఎంఎల్‌ఏ కోర్టు ముందు ప్రవేశపెట్టి.. ఇడి అధికారులు ఆయనను కస్టడీ కోరే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

కాగా, మోసం, నేరపూరిత కుట్ర, నేరపూరిత విశ్వాస ఉల్లంఘన, నేరపూరిత దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని పేర్కొంటూ నరేశ్ గోయల్, అనితా గోయల్, గౌరంగ్ ఆనంద శెట్టి తదితరులపై గతేడాది నవంబర్ 11న సీబీఐకి కెనరా బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ పీ సంతోష్ ఫిర్యాదు చేశారు. దీనివల్ల బ్యాంకుకు రూ.538.62 కోట్ల నష్టం వాటిల్లిందని ఆయన ఆరోపించారు.

నిరసనలు, ఆందోళన మధ్యే.. డబుల్ ఇండ్ల పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

బహదూర్‌పల్లిలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇండ్లు పంపిణీ చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలోని అహ్మద్‌గూడలో మంత్రి మల్లారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం మంఖాల్‌లో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో మేయర్ గద్వాల విజయలక్ష్మితోపాటు వివిధ ప్రాంతాల్లో డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, మహమూద్ అలీ, మంత్రి మహేందర్ రెడ్డి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 24 నియోజకవర్గాల్లో 8 లొకేషన్లలో 11,700 ఇండ్లను లబ్దిదారులకు అందజేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 7 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 95 వేల మందిని అధికారులు అర్హులుగా ఎంపిక చేశారు. మొదటి దఫాలో 11,700 మందికి ఇండ్లను కేటాయించారు.

డబుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్రాల్లో ఇలాంటి ఇండ్లు ఉన్నాయా.. :మంత్రి హరీశ్‌రావు

రాష్ట్రంలో కొంత మంది నాయకులు డబుల్ ఇంజిన్ సర్కార్ గురించి మాట్లాడుతున్నారు.. అసలు డబుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్రాల్లో ఇలాంటి డబుల్ బెడ్రూం ఇండ్లు ఉన్నాయా అని ఆర్థిక మంత్రి హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు.

కొల్లూరులో ఇండ్ల పంపి ణీ కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు ప్రసంగిం చారు. ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా పార దర్శకంగా లబ్దిదారులను ఎంపిక చేసినట్టు చెప్పారు.

పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే..:తలసాని

పేదలు గొప్పగా, ఆత్మగౌరవంతో బతకాలనే సీఎం కేసీఆర్ లక్ష్యం మేరకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి అర్హులకు ఉచితంగా అందజేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. బహదూర్ పల్లిలో ఇండ్లను ఎమ్మెల్యేలు వివేక్, మాధవరం కృష్ణారావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. బహదూర్‌పల్లిలో రూ.76.50 కోట్లతో 900 ఇండ్లు, డీ పోచంపల్లిలో రూ.140 కోట్లతో 1620, గాజుల రామారంలో రూ.11 కోట్లతో 144 ఇండ్ల సముదాయాలు నిర్మించారు. సనత్ నగర్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, కంటోన్మెంట్ నియోజకవర్గాలకు చెందిన 1700 మంది లబ్దిదారులకు ఇండ్లను కేటాయిస్తూ మంత్రి పత్రాలు పంపిణీ చేశారు.

ఆందోళన వద్దు: మేయర్

జీహెచ్‌ఎంసీ పరిధిలో నిరుపేదల కోసం నిర్మించిన డబుల్ ఇండ్ల కేటాయింపులో (డిగ్నిటీ ఇండ్లు) మొదటి విడత లాటరీలో పేరు రానివారు ఆందోళన చెందొద్దని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గం శ్రీరామ్‌నగర్ కాలనీలో ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డితో కలిసి మేయర్ 500 మంది లబ్దిదారులకు పట్టా సర్టిఫికేట్లు అందజేశారు.

ఇంటి కోసం మేయర్ కాళ్లపై పడిన మహిళ

మేడ్చల్ జిల్లా కాప్రా శ్రీరాంనగర్‌లో డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో తనకు ఇల్లు రాలేదని ఓ మహిళ మేయర్ గద్వాల విజయలక్ష్మి కాళ్లపై పడింది. సొంతింటి కోసం మేయర్ కాళ్ల మీద పడి కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడున్న వారందరినీ కలచివేసింది. తాను నిరుపేదనని, కుటుంబానికి ఇల్లు కేటాయించాలని వేడుకుంది. ఇందుకు మేయర్ సానుకూలంగా స్పందించారు.

దరఖాస్తు పత్రాలు చూపుతూ ఆందోళన

కుత్బుల్లాపూర్, కాప్రా, మేడ్చల్, మహేశ్వరం, పటాన్ చెరు నియోజకవర్గాల పరిధిలో ఇండ్ల పంపిణీ కార్యక్రమాల్లో పేదలు ఆందోళన చేశారు. నిరసనల మధ్యే మొదటి విడత డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీ కొనసాగింది. పటాన్‌చెరు పరిధిలో కర్దనూర్‌లో 10 శాతం ఇండ్లను తమకే కేటాయించాలని మంత్రి మహేం దర్‌రెడ్డి సమక్షంలోనే గ్రామస్తులు ఆందోళనకు దిగారు.

కుత్బుల్లాపూర్ పరిధిలోని బహదూర్‌పల్లిలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను అడుగడుగునా అడ్డు కున్నారు. ఇండ్ల పంపిణీ వద్ద ఒక వైపు సభ జరుగుతుండగా.. మరోవైపు ఇండ్లు రానివారు నిరసనకు దిగారు. తమ దరఖాస్తు పత్రాలను మంత్రికి చూపుతూ ఇండ్లు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. తమకు ఇండ్లు ఇస్తామని ఫోన్ చేస్తేనే ఇక్కడికొచ్చామని, తీరా చూస్తే ఎవరెవరికో ఇస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరు ప్రజాప్రతినిధుల కాళ్లపై పడి బతిమలాడారు. కన్నీళ్లు పెట్టుకు న్నారు. మాకో ఇల్లు ఇవ్వండంటూ ప్రాధేయపడ్డారు.

మేడ్చల్ నియోజక వర్గ పరిధి లోని అహ్మద్‌గూడలో మంత్రి మల్లారెడ్డి సమక్షంలో స్థానికులు ఆందోళన చేపట్టా రు. ఎక్కడో ఉండే వారికి ఇక్కడ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చిన చేతకాని మంత్రి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటా యింపులో పారదర్శకత పాటించలేదని విమర్శించారు. ఇండ్ల కేటాయింపును పారదర్శకంగా నిర్వహించి, నిజమైన అర్హులకే ఇండ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అమెరికాలో హైదరాబాదీ మహిళ ఆత్మహత్య

న్యూయార్క్ : అమెరికాలో ఉంటున్న ఓ హైదరాబాదీ మహిళ అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలానికి చెందిన ఏనుగు మల్లారెడ్డి, అనసూయ దంపతులు ఏల్బీనగర్‌లో కామినేని ఆస్పత్రి వెనుక ఉన్న సూర్యోదయ కాలనీలో ఉంటున్నారు.

ఆ దంపతుల కుమారుడు ఏనుగు శ్రీనివాస్ రెడ్డి అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రంలో సిర్థపడ్డారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన ఆయనకు 18 ఏళ్ల క్రితం కవితతో వివాహమైంది.

కాగా, కొంతకాలంగా అనారోగ్యంతో అవస్థలు పడుతున్న కవిత గురువారం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది.

గజ్వేల్‌లో ఈటల.. కామారెడ్డిలో విజయశాంతి

గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ అన్నట్టుగా వ్యవహరిస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం ఘాటుగానే సాగుతోంది. హ్యాట్రిక్ విజయం సాధిస్తామని బీఆర్‌ఎస్ ధీమా వ్యక్తం చేస్తుండగా.. అధికారం మాదేనంటూ బీజేపీ గాంభీర్యం ప్రదర్శిస్తోంది. కేసీఆర్ పోటీ చేసే నియోజకవర్గాల్లో బీజేపీ నుంచి ధీటైన అభ్యర్థుల్ని బరిలోకి దించుతామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. కేసీఆర్‌తో కలిసి నడిచిన ఈటల రాజేందర్, విజయశాంతిని వచ్చే ఎన్నికల్లో ఆయనపైకి పోటీ పెట్టేలా బీజేపీ పెద్దలు ప్లాన్ చేస్తున్నట్టు తెలిసింది. గజ్వేల్‌లో ఈటల రాజేందర్‌ను.. కామారెడ్డిలో విజయశాంతిని పోటీ చేయించే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వీరిద్దరూ గతంలో కేసీఆర్‌తో కలిసి పని చేసిన నాయకులు కావడమే కాకుండా తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా ఉన్నారు. అయితే, ఆ రెండు నియోజకవర్గాల్లో బీజేపీకి నామమాత్రం ఓటు బ్యాంకు కూడా లేకపోయినా బలమైన అభ్యర్థులనే భావనతో చేస్తున్న కసరత్తు నిలుస్తుందా..? తుస్‌మంటుందా..? చూడాలి. ఇంతదానికి ఎందుకు పోటీ అన్న చర్చ కూడారాజకీయ వర్గాల్లో నడుస్తోంది.





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

వచ్చే ఎన్నికల కోసం సీఎం కేసీఆర్.. అందరి కంటే ముందే 115 మంది అభ్యర్థుల్ని ప్రకటించిన విషయం తెలిసిందే. సీఎం తొలిసారిగా రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నట్టు ప్రకటించారు. రెండు సార్లు గెలిచిన గజ్వేల్‌తో పాటు తొలిసారిగా కామారెడ్డి నియోజకవర్గంలోనూ పోటీ చేస్తానని చెప్పారు. అయితే, ఇప్పటికే వచ్చిన లీకేజీలతో జరుగుతున్న ప్రచారం ప్రకారం గజ్వేల్‌లో ఈటల రాజేందర్, కామారెడ్డిలో విజయశాంతిని బరిలో దింపాలని బీజేపీ అధిష్టానం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. బీజేపీలో చేరిన ఈటల కేసీఆర్ కుటుంబంపై అనేక ఆరోపణలు చేస్తున్నారు. సీఎం కేసీఆర్‌పై తాను పోటీ చేస్తానని గతంలోనే ప్రకటించారు. గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఓడిస్తానని విసిరిన సవాల్‌కు కట్టుబడి ఇక్కడి నుంచే పోటీ చేస్తారా..? లేక ప్రత్యామ్నాయం చూసుకుంటారా వేచి చూడాలి. అదే విధంగా కేసీఆర్ పోటీ చేసే రెండో నియోజకవర్గమైన కామారెడ్డిలో బీజేపీ నుంచి విజయశాంతి పోటీ చేస్తారని సమాచారం. ఆమె కూడా కేసీఆర్ వెంట పనిచేసి ఎంపీగా కూడా గెలిచారు. ఆ తర్వాత దూరమయ్యారు. వీరిద్దరు కేసీఆర్‌పై పోటీ చేస్తే ఆసక్తిగా మారుతుందనే చర్చ ఉంది. కానీ..! పార్టీల బలాబలాలు, వ్యక్తుల ఇమేజీని పరిశీలిస్తే గజ్వేల్ నియోజకవర్గంలో బీజేపీకి పట్టులేదు. 2014 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆకుల విజయకు కొద్దిపాటి ఓట్లే వచ్చాయి. 2018 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి నల్లగాను శ్రీనుకు 1581 ఓట్లే వచ్చాయి.

పోలైన ఓట్లల్లో బీజేపీకి ఒక్క శాతం కూడా రాలేదు. సీఎం కేసీఆర్‌కు 2018లో 125444 ఓట్లు (60.45 శాతం) ఓట్లు వచ్చాయి. కామారెడ్డిలో కూడా గత ఎన్నికల్లో బీజేపీకి చెప్పుకోదగ్గ ఓట్లు రాలేదు. అక్కడ గంప గోవర్ధన్ రెండు సార్లు గులాబీ పార్టీ నుంచి గెలిచారు. దీన్ని బట్టి బీఆర్‌ఎస్, బీజేపీకి ఓటు బ్యాంకులో ఎంత తేడా ఉందో అర్థమవుతోంది. పార్టీలకున్న బలం, ప్రజల్లో ఉన్న ఆదరణ కాకుండా కేవలం ఇతర పార్టీలో కీలక నాయకులుగా పనిచేసి వచ్చిన వ్యక్తుల వ్యక్తిగత ఇమేజీపైనే ఆధారపడి కేసీఆర్‌ను ఓడించడం సాధ్యమవుతుందా? అన్నది విశ్లేషకుల ప్రశ్న.

ఉలుకూ పలుకులేని బీజేపీ

మీడియాలో మాటల ఆర్భాటం తప్ప క్షేత్ర స్థాయిలో బీజేపీ ఉలుకూ పలుకు లేదు. రాష్ట్రంలో అధికారం మాదే అంటూ బీరాలు పలికే కమలం పార్టీలో ఉమ్మడి మెదక్ జిల్లాలో అరువు అభ్యర్థులు తప్ప గట్టి అభ్యర్థులు లేరు. గతంలో బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన రఘునందన్‌రావు బీజేపీ నుంచి గెలిచినా ఆయన వ్యక్తిగతం తప్ప పార్టీ బలమేమీ పనిచేయలేదని విశ్లేషకులు అంటున్నారు. ఈటల రాజేందర్, విజయశాంతి ఇద్దరూ పోటీ చేయాలనుకుంటున్న నియోజకవర్గాల్లో పని చేసిందిలేదు. ప్రజల్ని కలిసింది కూడా లేదు. ఎన్నికల వేళ వచ్చి హడావుడి చేసి కేసీఆర్‌ను ఢీ కొట్టడం బీజేపీకి సాధ్యమా..?

సాగర్ నీటిని విడుదల చేయాలి

ఎండిపోయిన పొలాలను పరిశీలించిన జూలకంటి



నవతెలంగాణ-దామరచర్ల

సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపితే భూగర్భజలాలు పెరగడంతోపాటు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం దిలావర్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలో బోర్లు, బావుల కింద ఎండిపోయిన వరి పొలాలను శనివారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఆలస్యమైనా సాగర్ నీరు వస్తుందని, వర్షాలు వస్తాయని భావించిన ఎంతో మంది రైతులు బోర్లు, బావుల కింద వరి నాట్లు వేసినట్టు చెప్పారు. వర్షాలు పడకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి బోర్లలో చుక్క నీరు లేక పైరు ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వరి పొలాలను కాపాడుకునేందుకు వేలాది రూపాయలు అప్పులు తెచ్చి ఎన్ని బోర్లు వేసినా చుక్క నీరు పడకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నట్టు చెప్పారు. సాగర్ కాలువ నీరైనా వచ్చి ఆదుకుంటుందని భావించిన రైతులకు నిరాశే మిగిలిందన్నారు. కండ్ల ముందే ఎండిపోతున్న పైర్లను చూసి రైతులు విలపిస్తున్నారన్నారు. గతంలో సాగర్ డ్యాంలో 505 అడుగుల నీరు ఉన్నప్పుడే ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసేవారని చెప్పారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 523 అడుగుల నీరు నిల్వ ఉన్నట్టు తెలిపారు. 15 రోజుల నుంచి నీరు విడుదల చేసి పంటలను ఆదుకోవాలని రైతులు కోరుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నీటి విడుదలకు షెడ్యూల్ ప్రకటించాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ప్రత్యక్ష ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో ఆయన వెంట సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మాలోతు వినోద్, పార్టీ సీనియర్ నాయకులు మంగారెడ్డి, వెంకటిరెడ్డి, శ్రీహరి రైతులు సైదులు, శేఖర్‌రెడ్డి, బిక్షం, మట్టయ్య ఉన్నారు.



పల్లా ఖబర్దార్..

తెలంగాణ ఉద్యమంలో ఎక్కడున్నావ్..?

పల్లాపై ముత్తిరెడ్డి ఆగ్రహం

- జనగామలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి అర్ధనగ్నంగా నిరసన

నవతెలంగాణ-జనగామ

పల్లా రాజేశ్వర్ రెడ్డి ఖబర్దార్.. తెలంగాణ ఉద్యమంలో ఎక్కడున్నావ్..? ప్రజాకోర్టులో దోషిగా నిలబడటం తప్పదంటూ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ఫైర్ అయ్యారు. జనగామలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి వ్యవహారంపై ముత్తిరెడ్డి అనుచరులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. రాఖీ పండుగ సందర్భంగా ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై ముత్తిరెడ్డి అనుచరులు చేసిన వ్యాఖ్యలపై పల్లా అనుచరులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో రాజకీయం మరింత వేడెక్కింది. పల్లాకు వ్యతిరేకంగా జనగామ ఆర్టీసీ చౌరస్తాలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, అనుచరులు, దళితులు నిరసన తెలిపారు. పల్లా రాజేశ్వర్ రెడ్డికి జ్ఞానోదయం కలగాలంటూ.. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వినతిపత్రం అందజేశారు. అనంతరం చౌరస్తా వద్ద ముత్తిరెడ్డి చొక్కా విప్పి అర్ధనగ్నంగా నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి మాట్లాడుతూ.. పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో ఎక్కడ ఉన్నారో తెలియదని విమర్శించారు. దళిత నాయకుల మీద కేసులు పెట్టడం సరైంది కాదన్నారు. బీఆర్ఎస్ పార్టీని విచ్ఛిన్నం చేసే కుట్రలు పన్నుతున్న పల్లా రాజేశ్వర్ రెడ్డి కబర్దార్ అని హెచ్చరించారు. బీబీ నగర్‌లో 256 మంది ప్లాట్లను కబ్జా చేసి పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన కొడుకు మీద రిజిస్ట్రేషన్ చేసుకున్నరని ఆరోపించారు.

సీఎం కేసీఆర్ పల్లాపై విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. పల్లా దళితులపై కేసులు పెట్టడంపై పార్టీ పక్షాన వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. డబ్బు సంచులతో ప్రజలను కొనలేరన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఆక్రమించుకున్న ప్లాట్లను వారికి అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ బి.సిద్ధి లింగం, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పసుల ఏబెల్, ఆనందం, తిప్పారపు విజయ్, మున్సిపల్ కౌన్సిలర్ పాండు తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్ బైపీసీ కౌన్సెలింగ్ ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి బీ ఫార్మసీ, ఫార్మా-డీ, బయోటెక్నాలజీ, ఫార్మాసూటికల్ ఇంజినీరింగ్, బయోమెడికల్ ఇంజినీరింగ్, బయో టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎంసెట్ బైపీసీ విద్యార్థులకు శనివారం నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం నుంచి ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుంది. ప్రాసెసింగ్ ఫీజు చెల్లించడంతోపాటు హెల్ప్‌లైన్ సెంటర్లలో ధ్రువపత్రాల పరిశీలనకు వెళ్లేందుకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. ఈనెల నాలుగు, ఐదు తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. ఈనెల నాలుగు నుంచి ఏడు వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముంటుంది. ఇతర వివరాల కోసం https://tseamcetb.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి. బీఫార్మసీలో 114 కాలేజీల్లో 6,910 సీట్లు, ఫార్మా-డీలో 61 కాలేజీల్లో 1,191 సీట్లు, బయోటెక్నాలజీలో మూడు కాలేజీల్లో 94 సీట్లు, బయో మెడికల్ ఇంజినీరింగ్‌లో రెండు కాలేజీల్లో 36 సీట్లు, ఫార్మాసూటికల్ ఇంజినీరింగ్‌లో రెండు కాలేజీల్లో 81 సీట్లు కలిపి మొత్తం 8,312 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ప్రభుత్వ విద్యను పరిరక్షించాలి

తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరముందని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ తెలిపింది. శనివారం హైదరాబాద్‌లోని టీపీటీఎఫ్ కార్యాలయంలో ఆ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి కెఎస్ ప్రదీప్, నాయకులు రవికుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్, కార్యదర్శి పి నాగిరెడ్డి, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పి మహేశ్, పాల్గొన్నారు. విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పాలకుల తీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

ఎంఈఓల భర్తీ సంగతేంది..?

15 మండలాలకు లేని రెగ్యులర్ ఎంఈఓలు

ప్రభుత్వ స్కూళ్లలో సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యాబోధన కుంటుపడుతుండగా.. మరోవైపు ఎంఈఓలూ లేక పర్యవేక్షణ కరువైంది. ఇప్పుడు టీచర్ పోస్టులను భర్తీ చేస్తామంటున్నా.. రెగ్యులర్ ఎంఈఓల భర్తీపై స్పందన లేదు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కనీసం ఒక్కరైనా రెగ్యులర్ ఎంఈఓ లేరు. ఉన్న ముగ్గురూ గెజిటెడ్ హెడ్‌మాస్టర్లే. వారికే ఇన్‌చార్జి ఎంఈఓ బాధ్యతలను అప్పగించడంతో పర్యవేక్షణ కొరవడుతోంది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సర్కార్ రెగ్యులర్ ఎంఈఓలను ఎప్పుడు బర్తీ చేస్తారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 15 మండలాలు ఉన్నాయి. ఇందులో 8 పాతవి, 7 కొత్తవి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 160 ప్రభుత్వ హైస్కూల్స్, 370 మండల పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. దాదాపు 2వేల వరకు ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయి. 90వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. 15 మండలాలకు స్కూల్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్లే ఇన్‌చార్జి ఎంఈఓలుగా వ్యవహరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ముగ్గురు ఇన్‌చార్జి ఎంఈఓలు ఉండగా.. వీరిలో ఒకరికి ఏడు మండలాలు, మరొకరికి మూడు మండలాలు, ఇంకొకరికి ఐదు మండలాలను అప్పగించారు. వీరందరూ ఓ వైపు హెచ్ఎంగా తమ స్కూల్ బాధ్యతలు చూసుకుంటూనే మరోవైపు ఇతర స్కూళ్లను పర్యవేక్షించాల్సి ఉంది.

78 టీచర్ పోస్టులు భర్తీ

రాష్ట్ర వ్యాప్తంగా టీచర్ పోస్టుల భర్తీకి సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో దాదాపు 78 పోస్టులను భర్తీ చేయడానికి కసరత్తు ప్రారంభమైంది. ఇందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 45, ఎల్పీ పోస్టులు 7, పీఈటీ పోస్టు ఒక్కటి ఉందని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఒక్క ఇన్‌చార్జి ఎంఈఓ.. ఏడు మండలాలు..

కీసరలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పని చేస్తున్న గెజిటెడ్ హెడ్ మాస్టరే ఇన్‌చార్జి ఎంఈఓగా వ్యవహరిస్తున్నారు. ఈయన కీసర, మేడిపల్లి, ఘట్‌కేసర్, అల్వాల్, ఉప్పల్, కాప్రా, మల్కాజిగిరి మండలాలను పర్యవేక్షిస్తున్నారు. కీసర మండలం నుంచి కాప్రా, ఘట్‌కేసర్ మండలం నుంచి మేడిపల్లి, మల్కాజిగిరి మండలం నుంచి అల్వాల్ విడిపోయి కొత్త మండలాలుగా ఏర్పడ్డాయి. ఘట్‌కేసర్, ఉప్పల్ ఎంఈఓలు రిటైర్ అయ్యాక రెగ్యులర్ ఎంఈఓలను నియమించలేదు. గెజిటెడ్ హెడ్ మాస్టర్‌నే ఇన్‌చార్జి ఎంఈఓగా నియమించి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

పర్యవేక్షణ ఏదీ..?

ఎంఈఓలు ఆయా మండలాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను పరిశీలించి అక్కడ బోధన సవ్యంగా జరిగేలా చూడాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడూ వారి పరిధిలో పరిష్కారం కాగల సమస్యలను పరిష్కరించాలి. లేదంటే జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూసే బాధ్యత వీరిపై ఉంటుంది. కానీ ఇన్‌చార్జి ఎంఈఓలు వారి పాఠశాల నిర్వహణ చూసుకుంటూనే.. మండల విద్యాధికారి బాధ్యతలనూ నిర్వర్తించాల్సి వస్తోంది. కీలకమైన విద్యా సంబంధిత కార్యక్రమాలు (అకాడమిక్ యాక్టివిటీ) ఎలా అమలవుతున్నాయో పర్యవేక్షించే వారే లేకుండా పోయారు. ఆయా ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ ఉండటం లేదు. విద్యార్థులకు సరైన భోజనం అందుతుందా అని తనిఖీ చేసేవారు లేరు.

పుట్టగొడుగుల్లా ప్రయివేటు స్కూల్స్

ప్రయివేటు స్కూళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు ఫీజులను ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నా.. పట్టించుకునే వారు, పర్యవేక్షణ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు ఏడాది కిందట నగరంలోని ఓ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులను ఒక క్లాస్ నుంచి మరో క్లాస్‌కు ప్రమోట్ చేయడానికి హెచ్ఎం లంచం డిమాండ్ చేశారని వార్తలు వచ్చాయి. ఇది గ్రహించిన విద్యార్థి సంఘం నాయకులు కలెక్టర్, డీఈఓకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టి సదరు హెచ్ఎంను సస్పెండ్ చేశారు. రెగ్యులర్ ఎంఈఓలు ఉంటే పర్యవేక్షణ ఉంటుందని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని మండలాలకు రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

ఇతర మండలాలదీ అదే పరిస్థితి..

తూంకుంట జెడ్పీహెచ్ఎస్ స్కూల్ గెజిటెడ్ హెడ్‌మాస్టరే శామీర్‌పేట, మూడుచింతలపల్లి, మేడ్చల్ మండలాలకు ఇన్‌చార్జి ఎంఈఓగా కొనసాగుతున్నారు. ఇక్కడ శామీర్‌పేట మండలం నుంచి మూడుచింతలపల్లి విడిపోయి కొత్త మండలంగా అవతరించింది. ప్రస్తుతం బబ్బుగూడ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల గెజిటెడ్ హెడ్‌మాస్టరే కుత్బుల్లాపూర్, బాలానగర్, కూకట్‌పల్లి, దుండిగల్, బాచుపల్లి మండలాలకు ఇన్‌చార్జి ఎంఈఓగా వ్యవహరిస్తున్నారు.

ఈఓ ఇంట్లో 'ఏడుపాయల' బంగారం



2 కిలోల బంగారం, 100 కిలోల వెండి

- సెక్యూరిటీ లేకుండా తరలింపుపై అనుమానాలు
- పాలకమండలి సభ్యులకు సమాచారం ఇవ్వని వైనం
- బ్యాంకును తనిఖీ చేసిన దేవాదాయ శాఖ అధికారులు

నవతెలంగాణ - మెదక్

బ్యాంకులో భద్రపర్చాల్సిన ఏడుపాయల వనదుర్గకు చెందిన బంగారం, వెండిని ఈఓ ఇంట్లో పెట్టుకున్నారు. ఆలయంలో సందర్శకులు కానుకలుగా సమర్పించిన బంగారం, వెండిని నిబంధనలకు విరుద్ధంగా ఆలయ ఈఓ తన ఇంటికి తరలించడం వివాదాస్పదమైంది. దేవాదాయ శాఖ అధికారులు బ్యాంకులో తనిఖీ నిర్వహించారు. ఇదే క్రమంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు నిరసన వ్యక్తం చేస్తూ కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు.

మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా మతా ఆలయంలో ముడుపుల రూపంలో వచ్చిన బంగారం, వెండి ఆభరణాలను హైదరాబాద్ చర్లపల్లి ప్రాంతంలోని మింట్ కాంపౌండ్ దేవాదాయ శాఖకు అందజేస్తారు. అక్కడ కరిగించి కడ్డీలుగా మార్చి ఆలయ ఖాతాలో బ్యాంకు లాకర్‌లో భద్రపరుస్తారు. అలా బంగారం, వెండిని 2020లో మింట్ కాంపౌండ్‌లో ఆలయ ఈఓ అందజేశారు. దాన్ని కడ్డీల రూపంలోకి మార్చగా.. సుమారు 2 కిలోల బంగారం, 100 కిలోల వెండిని ఆలయ ఈఓ సారా శ్రీనివాస్ శుక్రవారం రాత్రి తన ఇంటికి తీసుకెళ్లారు. ఏడుపాయల ఆలయ పాలకమండలికి ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండా రూ.2 కోట్ల విలువైన బంగారం, వెండిని ఈఓ తన ఇంటికి తీసుకురావడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి. విషయం బయటకు పొక్కడంతో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 7:10 గంటలకు గుట్టుచప్పుడు కాకుండా పోలీసు అధికారుల సహకారంతో మెదక్ ఇండియన్ బ్యాంక్ లాకర్‌లో భద్రపరిచారు.

రంగంలోకి దేవాదాయశాఖ అధికారులు

దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ రామకృష్ణా రావు, ఆభరణాల తనిఖీ అధికారి అంజనాదేవి, మెదక్ జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శివకుమార్, ఇతర అధికారులు మెదక్ ఇండియన్ బ్యాంక్‌ను సందర్శించారు. ఏడుపాయల దుర్గామాతకు సంబంధించిన లాకర్ తెరిచి పరిశీలించారు. బంగారం, వెండిని తూకం వేసి లెక్కలు వేశారు. దేవాదాయ శాఖ నుంచి రెండు కిలోల 940 గ్రాముల బంగారం, 72 కిలోల 513 గ్రాముల వెండి తీసుకురాగా.. ఇందులో వెండి 133 గ్రాములు తక్కువ ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా ఆర్జెడి రామకృష్ణారావు మాట్లాడుతూ.. ఏడుపాయలకు చెందిన బంగారం, వెండి ఆభరణాలను కరిగించి కడ్డిలుగా మార్చేందుకు జూన్ 4, 2020లో మింట్‌లో ఆలయ ఈఓ అప్పగించారని చెప్పారు. ఆ బంగారం, వెండి కడ్డీలను శుక్రవారం సాయంత్రం ఆలయ ఈవో సారా శ్రీనివాస్ పాలకమండలికి సమాచారం ఇవ్వకుండా మెదక్‌కు తీసుకొచ్చారన్నారు. పూర్తి వివరాలను కమిషనర్‌కు నివేదిక అందించనున్నట్టు వెల్లడించారు.

ఇష్టారీతిన వ్యవహరిస్తున్న ఈఓ : చైర్మెన్

ఆలయ ఈఓ శ్రీనివాస్ ఇష్టారీత్యా వ్యవహరిస్తున్నట్టు ఏడుపాయల చైర్మెన్ బాలాగౌడ్ అన్నారు. కొన్నేళ్లుగా ఏడుపాయల దుర్గామాతా బ్యాంక్ లావాదేవీలన్నీ మెదక్ ఇండియన్ బ్యాంకులో జరుగుతున్నట్టు తెలిపారు. ఈవో ఒక్కరికే చెక్ పవర్ ఉండటం వల్ల ఎన్నో అక్రమాలు జరుగుతున్నాయని, ప్రతి చెక్కు విషయంపై విచారణ చేపట్టాలని అధికారులను కోరారు. డైరెక్టర్స్‌తో కలిసి ఈఓ తీరుపై కలెక్టర్‌కు, కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయ బదిలీల దరఖాస్తులు


- ఆన్‌లైన్‌లో స్వీకరణ గడువు 5
- 15న జీహెచ్ఎంల బదిలీలు
- వెంటనే పాఠశాలల్లో రిపోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఆదివారం నుంచి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం కానుంది. అదేరోజు నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది. దరఖాస్తుల సమర్పణకు గడువు ఈనెల ఐదో తేదీ వరకు ఉన్నది. వచ్చేనెల మూడో తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు, మాన్యువల్‌గా పదోన్నతుల ప్రక్రియను చేపడతారు. బదిలీ అయిన పాఠశాలల్లో వెంటనే రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఒకే పాఠశాలలో సెప్టెంబర్ ఒకటి నాటికి కనీసం రెండేండ్ల సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసేందుకు అర్హులు. ఒకే పాఠశాలలో గెజిటెడ్ హెచ్ఎంలు ఐదేండ్లపాటు మిగతా ఉపాధ్యాయులు ఎనిమిదేండ్లు పనిచేస్తే తప్పనిసరిగా బదిలీ అవుతారు. ఉద్యోగ విరమణకు మూడేండ్లలోపు సర్వీసు ఉన్న వారికి బదిలీ నుంచి మినహాయింపు ఉంటుంది. ఒకవేళ వారి ఇష్ట ప్రకారం బదిలీ ఉంటుంది. తొలుత ఈనెల 15న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల (జీహెచ్ఎం)కు బదిలీలుంటాయి. ఆ తర్వాత స్కూల్ అసిస్టెంట్లకు హెచ్ఎంలుగా పదోన్నతులు కల్పిస్తారు. అనంతరం స్కూల్ అసిస్టెంట్లకు బదిలీలు చేపడతారు. ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తారు. ఆ తర్వాత ఎస్జీటీలకు బదిలీలు నిర్వహిస్తారు. వచ్చేనెల మూడున ఎస్జీటీలకు స్థానచలనం ఉంటుంది. అదేనెల ఐదు నుంచి 19 వరకు అభ్యంతరాలపై అప్పీళు చేసుకునేందుకు అవకాశమున్నది.

ఎన్జీటీ ప్రమాణాలను ఏపీ పాటించడం లేదు

- కేఆర్ఎంబీకి తెలంగాణ ఫిర్యాదు
- ఎస్ఆర్ఎంసీ లైనింగ్ పనులు ఆపాలంటూ ఈఎన్సీ లేఖ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల విషయంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ జారీచేసిన మార్గదర్శకాలను పాటించడం లేదని తెలంగాణ సాగునీటి పారుదల అభివృద్ధి, ఆయకట్టు శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళీధర్ కృష్ణా యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేఆర్ఎంబి చైర్మెన్‌కు లేఖ రాశారు. అనేక అంశాలను ఈ లేఖలో వివరించారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా అదనపు నీటిని తరలించేందుకు శ్రీశైలం కుడి ప్రధాన కాలువ(కేఆర్ఎంసీ) లైనింగ్ పనులు జరుగుతున్నాయంటూ తప్పుబట్టారు. కేఆర్ఎంసీ ద్వారా నీళ్లు తీసుకుపోవద్దంటే 2021లోనే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు ఇచ్చిందని పేర్కొన్నారు. ఆ పనులను ఆపాలని గతంలో ఎన్జీటీ ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయాన్ని లేఖలో గుర్తు చేశారు. కృష్ణా నీటిని శ్రీశైలం రిజర్వాయర్ ద్వారా తరలిస్తున్నారని చెప్పారు.1977లో చేసుకున్న అంత:రాష్ట్ర ఒప్పందం ప్రకారం 1500 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం రిజర్వాయర్ ద్వారా తరలించే అధికారం లేదని చెప్పారు. రిజర్వాయర్‌లో ఉన్న నిల్వల ప్రకారమే తరలింపుల ఉంటుందన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను సైతం పర్యావరణ అనుమతులు తీసుకున్నాకే చేపట్టాలనే సంగతిని ఎన్జీటీ గతంలోనే చెప్పిందన్నారు. ఏపీ ప్రభుత్వంపై చర్యలు తీసుకుంటూనే కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రజల న్యాయమైన ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.



టీటీడీ పాలక మండలి సభ్యురాలిగా గడ్డం సీతా రంజిత్ రెడ్డి ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీటీడీ పాలక మండలి సభ్యురాలుగా గడ్డం సీతా రంజిత్ రెడ్డి శనివారం శ్రీవారి ఆలయంలో జేఈవో వీరబ్రహ్మం ప్రమాణ స్వీకారం చేయించారు. టీటీడీ పాలక మండలి సభ్యులుగా అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సామాన్య భక్తులకు సేవలందించేందుకు కృషి చేయనున్నట్టు తెలిపారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.50కోట్ల డ్రగ్స్



- 5 కిలోల కొకైన్ పట్టివేత
- నలుగురు మహిళల అరెస్ట్

నవతెలంగాణ-శంషాబాద్

శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం భారీ ఎత్తున కొకైన్ పట్టుబడింది. సుమారు రూ.50కోట్ల విలువ చేసే కొకైన్‌ను అధికారులు పట్టుకున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. లావోస్ నుంచి సింగపూర్ మీదుగా హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు నలుగురు మహిళలు వచ్చారు. ఇక్కడి నుంచి ఢిల్లీకి వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఎయిర్‌పోర్టు చెక్ ఇన్ బ్యాగ్‌లో భాగంగా నలుగురు మహిళల హ్యాండ్ బ్యాగులను అధికారులు తనిఖీ చేసి కొకైన్‌ను గుర్తించారు. కొకైన్‌కు బ్రౌన్ కలర్ టేపు చుట్టుకుని రహస్యంగా తరలించడానికి మహిళలు ప్రయత్నించారు. డీఆర్ఐ అధికారులు ఐదు కిలోల కొకైన్‌ను పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ.50 కోట్లు ఉంటుందని అంచనా. కొకైన్‌ను స్వాధీనం చేసుకుని, ఆ నలుగురు మహిళలను ఎన్‌డీపీఎస్ 1985 చట్టం ప్రకారం అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

మెరుగైన వ్యవసాయ ఉత్పత్తుల కోసం కృషి చేయాలి

- మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మెరుగైన వ్యవసాయ ఉత్పత్తుల కోసం కృషి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కోరారు. మంత్రి అమెరికా పర్యటనలో భాగంగా ఐదో రోజు మేరీ ల్యాండ్ విశ్వవిద్యాలయంను సందర్శించారు. వాషింగ్టన్ డీసీలోని ఐఎఫ్‌పీఆర్ఐ ప్రధాన కార్యాలయంలో సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ శాఖ సెక్రెటరీ రఘునందన్ రావు, , తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ కేశవులు పాల్గొన్నారు.



కాలుష్య కలవరం...

డబ్ల్యుహెచ్‌ఓ గణాంకాల ప్రకారం దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా వంటి వాటి కారణంగా చోటుచేసుకుంటున్న మరణాల సంఖ్య మన దేశంలోనే అత్యధికం. వాయు కాలుష్యం కారణంగా ఢిల్లీలో 50 శాతం మంది చిన్నారుల ఊపిరితిత్తులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నాయి. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంది కాబట్టే 2019 నవంబర్‌లో అత్యున్నత న్యాయస్థానం 'నరకానికన్నా అధ్వానంగా ఢిల్లీ నగరం తయారైంది' అని వ్యాఖ్యానించింది. ఆ సమయంలోనే సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరుణ్‌మిశ్రా 'పేలుడు పదార్థాలు అమర్చి ప్రతి ఒక్కరినీ చంపేయడం మంచిది.' అని అన్నారంటే అప్పటికే పరిస్థితి ఏ స్థాయికి దిగజారిందో అర్థం చేసుకోవచ్చు.

రాజధాని నగరం ఢిల్లీతో పాటు, దేశవ్యాప్తంగా పెరుగుతున్న వాయు కాలుష్యంపై తాజాగా విడుదలైన నివేదిక కలవరపాటుకు గురిచేస్తోంది. చికాగో విశ్వవిద్యాలయానికి చెందిన ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ రూపొందించిన ఈ నివేదిక ప్రకారం ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ నిలిచింది. కాలుష్య స్థాయి ఇదే మాదిరి కొనసాగితే ఢిల్లీ ప్రజానీకం తమ జీవితకాలంలో 11.9 సంవత్సరాలు కోల్పోతారంటూ చేసిన హెచ్చరిక దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. ఆ నివేదిక ప్రకారం ప్రపంచ ఆరోగ్య సంస్థ జారీ చేసిన మార్గదర్శకాలను మించిన కాలుష్యంలో దేశంలోని మొత్తం జనాభా మగ్గుతోంది. ప్రతి క్యూబిక్ మీటర్‌కు 40 మైక్రోగ్రాముల కాలుష్యానికి అనుమతి ఇస్తూ మన దేశం రూపొందించుకున్న సొంత నాణ్యతా ప్రమాణాలు సైతం ఆచరణలో వెలవెలబోతున్నాయి. జాతీయ పరిమితి కన్నా అధికంగా కాలుష్యం ఉన్న ప్రాంతాల్లో దేశంలోని 67.4 శాతం జనాభా జీవనం సాగిస్తోంది. మన మహానగరాలన్నీ వాయు కాలుష్యంతో అతలాకుతలమౌతు న్నాయి. తామెంత ప్రమాదకర పరిస్థితుల్లో మనుగడ సాగిస్తున్నామో ఆ ప్రాంతాలలో నివసించే ప్రజానీకంలో అత్యధిక మందికి కనీస అవగాహన కూడా లేకపోవడం దురదష్టకరం.


ప్రజానీకానికి పెను ప్రమాదంగా మారుతున్న వాయుకాలుష్యంపై ఈ తరహా హెచ్చరికలు రావడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది ఆగస్టులో ప్రపంచవ్యాప్తంగా 1650 నగరాల్లో చేసిన అధ్యయనం లోనూ, అదే నెలలో అమెరికాకు చెందిన హెల్త్ ఎఫెక్ట్స్ ఇన్‌స్టిట్యూట్ ప్రపంచంలోని ఏడు వేల నగరాల్లో చేసిన పరిశీలనలోనూ వాయు కాలుష్యంలో ఢిల్లీ నగరమే అగ్రస్థానంలో ఉన్నట్లు తేలింది. దేశంలోని మిగిలిన నగరాల్లోనూ కొంచెం అటుఇటూగా తాజా నివేదికలోని పరిస్థితులే ఉన్నట్లు ఆ ఏడాది, అంతకు ముందు రెండు మూడు సంవత్సరాల్లో చేసిన అధ్యయనాల్లో తేలింది. ఒక అధ్యయనం ప్రకారం ప్రతి ఏటా 20లక్షల మంది ప్రజానీకం వాయు కాలుష్యం కారణంగా వచ్చే వివిధ రకాల వ్యాధుల బారిన పడి మరణిస్తున్నారు. దేశ వ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమవుతున్న వాటిలో వాయు కాలుష్యం ఐదవ స్థానంలో నిలుస్తోంది. డబ్ల్యుహెచ్‌ఓ గణాంకాల ప్రకారం దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా వంటి వాటి కారణంగా చోటుచేసుకుంటున్న మరణాల సంఖ్య మన దేశంలోనే అత్యధికం. వాయు కాలుష్యం కారణంగా ఢిల్లీలో 50శాతం మంది చిన్నారుల ఊపిరితిత్తులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నాయి. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంది కాబట్టే 2019 నవంబర్‌లో అత్యున్నత న్యాయస్థానం 'నరకానికన్నా అధ్వానంగా ఢిల్లీ నగరం తయారైంది' అని వ్యాఖ్యానించింది. ఆ సమయంలోనే సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరుణ్ మిశ్రా 'పేలుడు పదార్థాలు అమర్చి ప్రతి ఒక్కరినీ చంపేయడం మంచిది.' అని అన్నారంటే అప్పటికే పరిస్థితి ఏ స్థాయికి దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. అయినా, పాలకులలో పెద్దగా స్పందన రాలేదనడానికి ఆ తరువాత కూడా ఢిల్లీతో పాటు దేశమంతా వాయుకాలుష్యం పెరుగుతుండటమే నిదర్శనం.

వ్యక్తిగత వాహనాల వినియోగం దేశ వ్యాప్తంగా ఏడాదికేడాదికి పెరుగు తోంది. ఫలితంగా వాయు కాలుష్యం పెద్దఎత్తున పెరుగుతోంది. దీనిని అరి కట్టడానికి సరి,బేసి నంబర్ల వాహనాలను రోజువిడిచి రోజు రోడ్లమీదకు అనుమ తించాలన్న ఢిల్లీ ప్రభుత్వ ప్రయత్నం ఫలించలేదు. ఢిల్లీ నగరానికి చుట్టుపక్కల చెట్లు కొట్టి వేయడం, పెద్ద ఎత్తున ఏర్పాటవుతున్న పరిశ్రమలు కాలుష్యానికి కారణమౌతున్నాయి. పరిశ్రమల్లో కాలుష్యానికి తీసుకోవాల్సిన చర్యలు అమలు కాకపోవడంతో వాయు కాలుష్యంతో పాటు యమునా నది కూడా పెద్దఎత్తున కాలుష్యం బారిన పడుతోంది. దేశ వ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి రైతాంగాన్ని, వారు తగలబెడుతున్న గడ్డిని ఈ దుస్థితికి కారణంగా చిత్రీకరించడానికి ప్రభుత్వం ప్రయత్నించడం దారుణం. కోవిడ్ కారణంగా లాక్‌డౌన్ విధించిన సంవత్సరా లలో వ్యవసాయం మినహా మిగిలిన అన్ని రంగాలు మూతపడిన సంగతి తెలిసిందే, ఆ సమయంలో ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా కాలుష్యం తగ్గినట్టు నిర్ధారణ కావడం గమనార్హం. ప్రభుత్వాలకు ప్రజారోగ్యం పట్ల ఏ మాత్రం చిత్త శుద్ధి ఉన్నా ప్రజా రవాణా వ్యవస్థను గణనీయంగా మెరుగు పరచాలి. పరిశ్రమ ల్లోనూ, నిర్మాణ పనుల వద్ద కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాలి. అడవు లను పరిరక్షించడంతో పాటు, వీలైన అన్ని ప్రాంతాల్లోనూ చెట్లను పెంచాలి. ఈ తరహా చర్యలే వాయు, జలకాలుష్యాల నుండి ప్రజానీకాన్ని కాపాడుతాయి.

సంపాదకీయం

సమైక్య వ్యూహంతో ఇండియా-జమిలి ఆత్రంలో మోడీ

2023 జులైలో బెంగళూరులో ప్రతిపక్షాల కూటమి సమావేశమై ఇండియాగా ముందుకు వస్తున్న తరుణంలోనే కేంద్ర పాలకపక్షమైన బీజేపీ హడావుడిగా ఎన్‌డిఎను పునరుద్ధరించి విస్తరించి ఢిల్లీలో సమావేశపర్చింది. 26 పార్టీలు ఇక్కడ కలుస్తుంటే అక్కడ ఏకంగా 38 పార్టీలు హాజరయ్యాయి గాని వాటి సీట్లబలం నామకార్థమని మీడియా విశ్లేషించింది. తాజాగా ముంబాయిలో ఇండియా సమావేశమవుతుందంటే ఎన్‌డిఎ సమావేశం కాకుండా ఏకంగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాలనే పిలవాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించింది, లౌకిక ప్రతిపక్షాల ఐక్యవేదిక ఏర్పాటు పట్ల ప్రధాని మోడీ ఎంతగా ఉలిక్కిపడుతున్నారో దీన్నిబట్టే చెప్పొచ్చు. నవంబరు, డిసెంబరులో అయిదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికలలో తన పరిస్థితి ప్రతికూలంగా వుంటుందని భయపడుతున్న బీజేపీ-ఆరెస్సెస్ పరివారం ముందస్తు ఎన్నికలకు వెళ్లవచ్చుననే సంకేతాలు గతం నుంచి వున్నాయి. కానీ ముంబాయి సమావేశ సన్నాహాలు, ప్రతిపక్షాల వ్యూహాల ఉధృతి చూసిన తర్వాత కేంద్రం దాదాపు ముందస్తును మరింత ముందుకు జరపాలని నిర్ణయించు కోవలసి వచ్చిందని ఇప్పుడు అందరూ భావిస్తున్నారు. ఈ నెల 18 నుంచి 22 వరకూ లోక్‌సభ అమృతోత్సవ్ ప్రత్యేక సమావేశాలు జరిపి కీలకమైన బిల్లులు సవరణలు ఆమోదింపచేసు కోవాలని మోడీ ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు జాతీయ మీడియా ఏకకంఠంతో చెబుతున్నది. ఇందుకు తగినట్టే మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నాయకత్వం లో జమిలి ఎన్నికల గురించి అధ్యయనం చేసేందుకు ఒక కమిటీనే నియమించారు. 2018లో కోవింద్ ఆ పదవిలో వున్నప్పుడు ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో లోక్‌సభకూ శాసన సభలకూ ఒకేసారి ఎన్నికలు జరిగితే మంచిదన్న సూచన చేశారు. అంటే కేంద్రం ఆలోచనను వినిపిం చారు. ఆయన నాయకత్వంలో కమిటీ ఇక ఏమి చెబుతుందో వూహించడం కష్టమేమీకాదు. అసలు రాజ్యాంగ అధినేతగా పని చేసిన ఒక మాజీ రాష్ట్రపతిని ఈ విధంగా రాజకీయ బాధ్యత అప్పగించడం దేశ రాజకీయాలలో ఇదే తొలిసారి కావచ్చు.


తెలకపల్లి రవి

వాస్తవికత, విశాల వ్యూహం

ఇండియా సమావేశం జరుగుతుండగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాల ప్రకటన రావడంతో దాని నిర్వహణ కోణంలోనే కొంత మార్పు అవసరమైంది. బీజేపీ మత రాజకీయాలనూ కేంద్రం నిరంకుశత్వాన్ని ఓడించడానికి మరింత సమిష్టిగానూ సమర్థంగానూ సత్వర వ్యూహాలు రూపొందించు కోవాల్సిన ప్రతిపక్షాల నాయకులు గుర్తించారు. కీలక నేతలందరూ హాజరయ్యారు కూడా. దేశంలోని 450 నియోజక వర్గాలలో బీజేపీకి వ్యతిరేకంగా ఒకే అభ్య ర్థిని నిలబెట్టి ఓడించాలని అందుకే తొలి అంశంగా నిర్ణయించు

మోహన్‌భగవత్, మోడీల మాటల వెనక వున్న రాజకీయ దురుద్దేశాలు, మతతత్వ వ్యూహాల పట్ల అప్రమత్తత చాలా అవసరం. బాధాకరమైన విషయం ఏమిటంటే తెలుగు రాష్ట్రాలలో రెండు పాలక పార్టీలైన వైసీపీ, బీఆర్‌ఎస్, తెలుగుదేశం ఏపీ ఈ పోరాటంలో పాలు పంచుకోవడం లేదు. బీజేపీకే వత్తాసుగా నిలవడానికే పోటీ పడుతున్నాయి. ఇండియా ఈ నిరంకుశత్వాన్ని నిలవరించేందుకు పోరాడటమే గాక ఎన్నికలలోనూ బీజేపీ కూటమిని ఓడించడం ద్వారా ఈ కుటిల ప్రయత్నాలు శాశ్వతంగా అడ్డుకోవడం మరింత ముఖ్యం

కున్నారు. అయితే ఇది విశాల ప్రతిపక్ష వేదిక మాత్రమే గనక వీలైనంత వరకూ కలసి పోటీ చేస్తామని ప్రకటించాయి. అందుకే జాతీయస్థాయి సమావేశంలో గాక రాష్ట్రాల స్థాయిలోనే సమన్వయ

మోడీ హయాంలో రాష్ట్రాలు గుప్పిట పెట్టుకునే ధోరణి, సమాఖ్య విధానానికి తూట్లు పొడవడం ఈ ప్రాంతీయ పార్టీలలో చాలావాటికి కళ్లు తెరి పించిందని చెప్పాలి. తమ అస్తిత్వం కోసమైనా వారంతా ఇండియా వైపు మొగ్గడం అనివార్యమైన పరిస్థితి. ఇప్పటికీ వైసీపీ, టీడీపీ, బీజేడీ వంటి పార్టీలు బీజేపీకి అను కూలంగా వుండటం వాటిపై ఒత్తిళ్ల ఫలితమే. ఇక బీఆర్‌ఎస్, బీఎస్పీ వంటి పార్టీలు సమదూరమని అంటున్నా ఆచరణలో బీజేపీకే ప్రయోజనమనే భావన వుంది. ఎన్నికలు దగ్గరపడే కొద్ది అంతిమంగా ఎవరు ఎలాటి వైఖరి తీసుకుంటారో చూడాల్సిందే.

కమిటీల ద్వారా ఎవరు ఎలా పోటీ చేయాలన్నది ఖరారు చేయాలని నిర్ణయించారు. నిర్ణయం వాస్తవికతను ప్రతిబింబిస్తుంది. ఉదాహరణకు కేరళలో ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ కలిసి పోటీ చేయడం కుదిరేపని కాదు. బెంగాల్‌లో మమతా బెనర్జీని వామపక్షాలు కాంగ్రెస్ ఆమోదించడం అసాధ్యం. పంజాబ్, ఢిల్లీ, గుజరాత్‌లలో ఆప్, కాంగ్రెస్ పోటీ పడుతుంటాయి. అందుకే వీలైనంత వరకూ కలిసి అన్నారు. వాస్తవానికి మమతా బెనర్జీ ఈ విషయమై తొందరగా ఉమ్మడి పోటీ విషయం తేల్చాలని పట్టుపట్టినా మిగిలిన నేతలు ఇందుకోసం సర్ది చెప్పినట్టు కథనాలు వచ్చాయి. ఏమైనా అరడజను ముఖ్యమంత్రులు, నాలుగు జాతీయ, పలు ప్రాంతీయ పార్టీల నాయకులు ఈ వేదికలో వున్నారు గనక ఆయా చోట్ల కలసి అడుగేయడం సాధ్యమే అవుతుంది. 1977లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని ఓడించేందుకు ప్రతిపక్షాలు ఆ విధంగా కలిసిన విజయ వంతమైన అనుభవం వుంది. కనీసం మూడుసార్లు కేంద్రంలో కాంగ్రెస్, బీజేపీయేతర ప్రభుత్వాలు ఏర్పడిన వాస్తవం మర్చిపోరానిది. అవి విఫల ప్రయోగాలుగా చెబుతుంటారు గాని అందుకు నాటి కాంగ్రెస్ అనుసరించిన విధానమే ముఖ్య కారణం. ఇప్పుడు ఆ పార్టీయే ఇండియా కూటమిలో ఒక కీలక పాత్రధారి. ప్రాంతీయ పార్టీలకు అప్పటి కన్నా ఇప్పుడు నిర్ణయాత్మక పాత్ర వుంటుంది. ఈ పార్టీల ఊగిసలాటనే గతంలో బీజేపీ అధికారంలోకి రావడానికి ఒక ప్రధాన ఆధారమైంది. మోడీ హయాంలో రాష్ట్రాలు గుప్పిట పెట్టుకునే ధోరణి, సమాఖ్య విధానానికి తూట్లు పొడవడం ఈ ప్రాంతీయ పార్టీలలో చాలావాటికి కళ్లు తెరిపించిందని చెప్పాలి. తమ అస్తిత్వం కోసమైనా వారంతా ఇండియా వైపు మొగ్గడం అనివార్యమైన పరిస్థితి. ఇప్పటికీ వైసీపీ, టీడీపీ, బీజేడీ వంటి పార్టీలు బీజేపీకి అనుకూలంగా వుండటం వాటిపై ఒత్తిళ్ల ఫలితమే. ఇక బీఆర్‌ఎస్, బీఎస్పీ వంటి పార్టీలు సమదూరమని అంటున్నా ఆచరణలో బీజేపీకే ప్రయోజనమనే భావన వుంది. ఎన్నికలు దగ్గరపడే కొద్ది అంతిమంగా ఎవరు ఎలాంటి వైఖరి తీసుకుంటారో చూడాల్సిందే. అకాలీదళ్, బీఎస్పీ వంటి పార్టీలు ఇండియాలో చేరకపోయినా ఎన్‌డిఎలో చేరడం జరగదనే అభిప్రాయం ఎన్‌సిపి నాయకుడు శరద్‌పవార్ ముందే స్పష్టంగా ప్రకటిం చారు. ఒక కన్వీనర్ నియామకం కూడా ఇప్పుడే తేలక పోయినా నష్టంలేదని వాయిదా వేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కనీస ఉమ్మడి కార్యక్రమం అవసరమంటూ మరో కోణం జతచేశారు. దాన్ని అక్టోబరు 2వ తేదీన గాంధీ జయంతి రోజున రాజ్‌ఘాట్‌లో విడుదల చేయాలని మమత సూచిం చారు. 14 మంది సభ్యులతో ఏర్పడిన కమిటీలో సీపీఐ(ఎం) సభ్యులెవరో తర్వాత ప్రకటిస్తామన్నారు.

కోవింద్ కమిటీ,కోటి కౌటిల్యాలు

ఏమైనా ఈ సమావేశ ప్రభావం అప్పుడే బీజేపీపై పడిందని సీతారాం ఏచూరి చేసిన వ్యాఖ్య అర్థవంతమైంది. ముంబాయి సమావేశం ఒకవైపున ఇంకా జరుగుతుండగానే ఏకకాల ఎన్నికల ముచ్చట వూపందుకోవడంలో అది కనిపిస్తుంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ఆరెస్సెస్ అధినేత మోహన్‌భగవత్‌ను కలిశారు. ఇండియా అనే పేరు మార్చి భారత్‌నే వాడాలని భగవత్ రెండుచోట్ల వేర్వేరు సమావేశాల్లో ప్రవచించారు. ఈ దేశం



హిందూ రాష్ట్రమేనని, భా రతీయులందరూ హిందువులేనని మత భాష్యాన్ని మరింత తీవ్రంగా వినిపించారు. రామ్‌నాథ్ కోవింద్ కూడా కొంత కాలం కిందట భగవత్‌తో సమావేశమయ్యారని ఇక్కడ గుర్తు చేయాలి. అంటే మోడీ, అమిత్ షా ఒకవైపు ఎన్‌డిఎ విస్తరణ కోసం తంటాలు పడుతుంటే, మరోవైపు మోహన్ భగవత్ హిందూత్వ మతతత్వ సిద్ధాంతం వ్యాప్తికి బీజాలు వేస్తున్నారన్నమాట. కోవింద్ కమిటీ గురించి ప్రహ్లాద్ చెప్పడమే గాని ఇంతవరకూ అధికారిక ప్రకటన వెలువరించలేదు. పైగా రాజ్యాంగం గురించిన చర్చను అనధికార కమిటీ ఎలా చేస్తుంది? ఆ అధికారం పార్లమెంటుకు మాత్రమే వుంది. గతంలో వాజ్‌పేయి హయాంలోనూ రాజ్యాంగ సంస్కరణలకై జస్టిస్ వెంకట చలయ్య కమిటీని ఇలాగే ఏర్పాటు చేసి తర్వాత సూచనల కోసం అని వెనక్కు తగ్గారు. ఇప్పుడైనా ఏకపక్షంగా రాజ్యాంగ కమిటీని ఏర్పాటు చేయడం చెల్లదు. ఆ అంశాన్ని తెరపైకి తేవడం, ప్రజల్లో అనుకూలత పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు కనిపిస్తుంది. పార్టీలు వ్యక్తులు సంస్థలు ప్రభుత్వాలతో ఈ కమిటీ సంప్రదిస్తుందంటున్నారు. కానీ ఇతర పార్టీలు, ప్రభుత్వాలు ఒక అనధికార కమిటీకి సహకరిస్తాయని చెప్పడం కష్టం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయినా పదవీ విరమణ తర్వాత మామూలు పౌరుడేనని ఇటీవల జస్టిస్ డివై చంద్రచూడ్ స్పష్టంగా చెప్పారు. అధికార లాంఛనాలు కొన్ని వుండవచ్చు గాని మాజీ రాష్ట్రపతి అయినా ప్రత్యేక రాజ్యాంగ ప్రతిపత్తి ఏమీ వుండదు. ఈ కమిటీ సిఫార్సులు చేసినా వాటిని కేంద్ర క్యాబినెట్ తీర్మానం ముందుకు తెస్తారన్నమాట. ఎన్నికల సంఘం కూడా కేంద్రం ఒత్తిడితో గతంలోనే దీనిపై స్పందించింది. ఒకేసారి ఎన్నికలు జరపగల సత్తా వుందని కాకపోతే అదనంగా సహాయం అవసరమని వెల్లడించింది. తన వంతుగా అయిదు సూచనలు చేసింది. 1.కొత్త లోక్‌సభ ప్రారంభానికి తేదీ నిర్ణయించాలి. 2.అవిశ్వాస తీర్మానం తెచ్చేవారు ప్రత్యామ్నాయ ప్రభుత్వానికి నాయకత్వం వహించే వ్యక్తి పేరు అందులో సూచించాలి. 3.పదవీ కాలం కొద్దిగానే మిగిలివుండగా ప్రభుత్వం పడిపోతే రాష్ట్రపతి పాలన పెట్టాలి. ఎక్కువుంటేనే ఎన్నికలు 4.శాసనసభల విషయంలోనూ ఇదే జరగాలి. 5. లేదంటే అన్ని ఎన్నికలకూ నిర్ణీత తేదీలలో జరిగేలా నిర్ణయించాలి.

రాజ్యాంగానికే ఎసరు, దేశానికే ప్రమాదం

భారత రాజ్యాంగం ఏకకాల ఎన్నికలు జరగాలని చెప్పడం లేదు. లోక్‌సభ, శాసనసభల నియమ నిబంధనలు కాలపరిమితి అన్నీ వేర్వేరుగా వున్నాయి. మొదటి మూడు ఎన్నికలు కలిసే జరిగాయంటే కాంగ్రెస్ గుత్తాధిపత్యమే కారణం, 1967 నుంచి క్రమంగా ఈ పరిస్థితి మారుతూ వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టడం, రద్దు చేయడం, పడిపోవడం చాలా చూశాం. కేంద్రంలోనూ కనీసం మూడుసార్లు ప్రభుత్వాలు ముందేపడిపోయాయి. వాటిపై ఏవో కొత్త షరతులు రుద్దాలనేది ఇక్కడ అంతర్యం. అంటే పదవీకాలం ముగిసినా కొనసాగించడం, లేక ఇంకా వున్నా ఎన్నికలకు వెళ్లకుండా పరోక్ష పాలన సాగించడం వంటివి రాజ్యాంగ నిర్దేశానికి విరుద్ధం. అప్పుడు ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం అనే మౌలిక సూత్రమే మంటగలిసిపోతుంది. ఎమర్జెన్సీలో రాష్ట్రాల శాసనసభల కాల పరిమితిని ఆరేళ్లకు పెంచితే తర్వాత కత్తిరించాల్సి వచ్చింది. వాస్తవానికి శ్రీలంక, బంగ్లాదేశ్ వంటిచోట్ల కూడా గతంలో నిరంకుశ ప్రభుత్వాలు పాలనా వ్యవస్థను ఇష్టానుసారం మార్చినా తర్వాత అవి నిలబడలేదు. విపిసింగ్ ప్రభుత్వ కూల్చివేత తర్వాత అప్పటి రాష్ట్రపతి వెంకట్రామన్ జాతీయ ప్రభుత్వం అంటూ ఒక ప్రహసనం నడిపించి వెనక్కు తగ్గాల్సి వచ్చింది. బీజేపీ ఎప్పుడూ అధ్యక్ష తరహా పాలన కోరుకుంటుంది. దేశంలో రాజకీయ, సామాజిక బహుళత్వం కారణంగా అది చేయలేకపోయింది, మోడీ హయాంలో దాదాపు ప్రధాని కేంద్రంగా చేయడం అధ్యక్ష తరహా ప్రతిబింబమే. పెద్ద నోట్ల రద్దుతో సహా కీలక నిర్ణయాలు మోడీ ఒక్కరే తీసుకున్నారు. కాశ్మీర్ 370 రద్దు, పౌరసత్వ సవరణ చట్టం వంటివాటిని కూడా ఎవరితో చర్చించలేదు. ఈ నిర్ణయాలు సుప్రీం కోర్టు సమీక్షలో వుండటమే గాక తీవ్ర ప్రశ్నలకు కారణమవుతున్నాయి, లోక్‌సభ పదవీకాలానికి సంబంధించిన 83వ అధికరణం, రద్దుకు సంబంధించిన 85 అధికరణం, అసెంబ్లీల పదవీ కాలానికి సంబంధించిన 172, రద్దుపైన 174, రాష్ట్రపతి పాలనపై 356 అయిదు రాజ్యాంగ సవరణలు చేయవలసి వుంటుంది. శాశ్వత మార్పులైతే సగం శాసనసభల ఆమోదం కూడా అవసరమవుతుంది. లక్షల కోట్ల రూపాయలు బడాబాబుల పరం చేయడమే గాక రాయితీల రూపంలో మరిన్ని లక్షల కోట్లు కట్టబెడుతున్న ఈ సర్కారు ఎన్నికల ఖర్చు తగ్గించాలని పొదుపు కబుర్లు చెప్పడం హాస్యాస్పదం. ఇది వాస్తవానికి అధికార దాహం, అప్రజాస్వామిక రాజ్యాంగ కుట్ర. మోహన్‌భగవత్, మోడీల మాటల వెనక వున్న రాజకీయ దురుద్దేశాలు, మతతత్వ వ్యూహాల పట్ల అప్రమత్తత చాలా అవసరం. బాధాకరమైన విషయం ఏమిటంటే తెలుగు రాష్ట్రాలలో రెండు పాలక పార్టీలైన వైసీపీ, బీఆర్‌ఎస్, తెలుగు దేశం ఏపీ ఈ పోరాటంలో పాలు పంచుకోవడం లేదు. బీజేపీకే వత్తాసుగా నిలవడానికే పోటీ పడుతున్నాయి. ఇండియా ఈ నిరంకుశత్వాన్ని నిలవరించేందుకు పోరాడటమే గాక ఎన్నికలలోనూ బీజేపీ కూటమిని ఓడించడం ద్వారా ఈ కుటిల ప్రయత్నాలు శాశ్వతంగా అడ్డుకోవడం మరింత ముఖ్యం

అవార్డులు



పెద్దకొడుకు బంటిగాడు ఒక భుజంపైకి, ఇంకో భుజం కిందికి పెట్టుకుని ఇంట్లోంచి బయటకు వెళ్తున్నాడు. వాడిని అలా చూసేసరికి తల్లి వాణికి ఆందోళన కలిగింది.

'ఏమిట్రా బంటీ భుజానికి ఏమైందీ?' అన్నది వాణి ఆందోళనగా అడిగింది. బంటిగాడు సమాధానం ఇవ్వలేదు. పైగా గడ్డం కింద చేయి వేసి రుద్దుకుంటూ బయటకి వెళ్లిపోయాడు.

వాణికి ఆందోళన ఎక్కువైంది. హడావుడిగా ఇంట్లోకి వెళ్లింది. టీవీలో ఏదో అవార్డుల గురించి కార్యక్రమం చూస్తూ గట్టిగా చప్పట్లు కొడుతున్నాడు శేఖర్.

'ఏమండి బంటిగాడికి ఏమో అయ్యింది' అన్నది వాణి ఆదుర్దాగా

'ఏమైంది?' అన్నాడు శేఖర్ టీవీలో నుంచి పక్కకు చూడకుండానే.

'మీకు ఎప్పుడూ టీవీ గొడవేనా? ఇంట్లో పిల్లలు ఏమయ్యారో పట్టదా? బంటిగాడేమో భుజంపైకి పెట్టి నడుస్తున్నాడు. చింటుగాడు పొద్దున్నే వెళ్లాడు. ఎక్కడున్నాడో తెలియదు. పొద్దున టిఫిన్ ఏమి తిన్నాడో, ఎక్కడ ఆడుతున్నాడో తెలియదు!' అంటూ రిమోట్ లాక్కునే ప్రయత్నం చేసింది వాణి. ఈ క్రమంలో టీవీపై ఆమె దృష్టి పడింది! అందులో అల్లు అర్జున్ లాగే బంటిగాడు ప్రవర్తిస్తున్న విషయమూ అర్థమైంది! చేతిలో రిమోట్ వదిలేసింది!


'చూశావా మన తెలుగు నటుడికి మొట్టమొదటిసారి ఉత్తమ నటుడి అవార్డు వచ్చింది!' అంటూ శేఖర్ కూడా గడ్డం కింద చెయ్యివేసి రుద్దాడు శేఖర్.

వాణి నిస్సత్తువగా సోఫాలో కూలబడింది. భర్త చెప్పిన రెండు విషయాలు ఆమెకి షాక్‌నిచ్చాయి. ఒక దొంగ స్మగ్లర్ పాత్రకు ఉత్తమ నటుడి అవార్డు! రెండు మతాల మధ్య చిచ్చు పెట్టిన సినిమాకు జాతీయ సమైక్యతా అవార్డు?' ఏమిటీ దుస్థితి అనుకుంటున్నది వాణి.

'నీవు బాధపడ్డా సరే! అవార్డులు సరిగ్గానే ఇచ్చారు. విశ్వగురు పాలనంటే ఏమిటనుకున్నావు! తగ్గేదేలే' అన్నాడు శేఖర్.

'తగ్గు!తగ్గు! లేదంటే చాలా బాధపడాల్సి వస్తుంది'! అంటూ వచ్చాడు కిరణ్. ఆయనతో పాటు బంటీ, చింటూ కూడా వచ్చారు.

'రా బావా!' అంటూ కిరణ్‌ని అప్యాయంగా పిలిచాడు శేఖర్.



'వీళ్లెక్కడ దొరికారు అన్నా' అడిగింది వాణి.

'నీ చిన్నకొడుకు మసీదు వద్ద. పెద్దకొడుకు పోలీస్‌స్టేషన్‌లో దొరికారు'! అన్నాడు కిరణ్.

భార్యభర్తలు కంగారు పడ్డారు.

'వీళ్లెందుకు అక్కడికి వెళ్లారు?' అడిగారు ఏక కంఠంతో.

'నీ చిన్నకొడుకు మసీదు వద్దకు వెళ్లి మీరంతా ఇక్కడెందుకు ఉన్నారు పాకిస్తాన్‌కి పోండి లేదంటే చంపేస్తాను. అని బెదిరిస్తున్నాడు. వాడి క్లోజ్ ఫ్రెండ్ ఎదురొచ్చి మనిద్దరం క్లోజ్‌ఫ్రెండ్స్ కదరా! నన్ను కూడా చంపుతావా? అని అడిగితే ముందు నిన్నే చంపుతా అంటూ గొంతు పట్టుకున్నాడు. ఆరేళ్ల పిల్లవాడు చంపుతా అంటుంటే అందరూ కంగారుపడ్డారు. అటుగా వెళ్తున్న నన్ను గుర్తుపట్టి మీ మేనల్లుడిని తీసుకెళ్లండి.అంటూ నాకు అప్పగించారు' అన్నాడు కిరణ్.

వాణి కోపంగా భర్తను చూసింది. శేఖర్ తల దించుకున్నాడు. రాత్రి బలవంతంగా నిద్రపోతున్న చింటుగాడిని లేపి మరీ 'కాశ్మీర్‌ఫైల్స్' సినిమా చూపాడు. దాని ప్రభావం ఇంతలా ఉంటుందని ఊహించలేదు.

'వీడు పోలీస్‌స్టేషన్‌లో ఎందుకున్నాడు?' అడిగింది వాణి.

బంటిగాడిని పోలీసులు పట్టుకునిపోయి స్టేషన్‌లో ఉంచారు. వాడు ఎక్కడినుంచో గొడ్డలి తెచ్చుకుని చెట్టు మీదకి ఎక్కి ఒక కొమ్ముని నరుకుతుంటే, ఆ చెట్టు ఓనరు పోలీసులకు ఫోన్ చేశాడంట. పోలీసులు వచ్చి ఎందుకు చెట్టు కొట్టావంటే మంగళం శీనుకి అమ్ముతానంటూ గడ్డం కింద చేయివేసి రుద్దుకున్నాడంట! నీ మేనల్లుడు గంధం చెట్లు స్మగ్లింగ్ చేస్తున్నాడు రమ్మంటూ, ఆస్టేషన్ సీఐ నాకు ఫోన్ చేశాడు. అతడు నా ఫ్రెండ్ కాబట్టి సరిపోయింది! లేకపోతే వీడు బాల నేరస్తుడయ్యేవాడు' అన్నాడు కిరణ్.

'తగ్గేదేలే' అన్నాడు బంటిగాడు.

వాణికి కోపం నశాళానికంటింది! 'అక్కడే వదిలేసి రావాల్సింది. వెదవకి బడితె పూజ జరిగేది' అంటూ బంటిని కొట్టబోయింది.

'ఆగు వాణీ! దెబ్బలు పడాల్సింది పసిపిల్లలు కాదు'!అంటూ బావగారి మొహంలోకి చూశాడు కిరణ్.

అప్పటికే శేఖర్ ముఖం వాడిపోయింది.

'అవార్డులు, బహుమతులు గొప్పవాటికి ఇవ్వాలి. ఉత్తమ నటుడి అవార్డు గొప్ప మానవతా విలువలు చెప్పి ఆచరించే పాత్రకి ఇవ్వాలి. చట్టాన్ని ఎట్లా ఏ మార్పువచ్చే నేర్పే పాత్రకి కాదు! గొప్ప నటన ఉండవచ్చు. కాని అది దుష్ప్రభావాన్ని కలిగిస్తే దాని వల్ల ఇలాంటి ఫలితాలు వస్తాయి' అన్నాడు కిరణ్.

శేఖర్ తలదించుకున్నాడు.

'జాతీయ సమైక్యత అంటే ఏమిటి? చిన్నప్పుడు మనం స్కూళ్లో చదివిన ప్రతిజ్ఞ. భారతీయులందరూ నా సహోదరులే. అని నేర్పితే సమైక్యత సాధించుతాము. ముస్లిం, క్రైస్తవులు నా శత్రువులు, స్త్రీలు పురుషులకి బానిసలు అని నేర్పితే అది సమైక్యత కాదు! సర్వనాశనం అవుతుంది! కాశ్మీర్ ఫైల్స్ సినిమా నేర్పింది. సర్వనాశనమే. దానికి జాతీయ సమైక్యత అవార్డు ఇచ్చారు! అది నీవు గర్వంగా భావించావు. ఆ సినిమా చూసిన నీ కొడుక్కి హత్య చేయాలనే ఆలోచనలు వచ్చాయి. ఏమి జరుగుతుంతో అర్థం అవుతుందా? అడిగాడు కిరణ్.

శేఖర్ కండ్లలో నీళ్లు తిరిగాయి. విశ్వగురు పాలన అంటూ తాను విర్రవీగుతున్నారు. ఆ పాలన ప్రభావం తన పిల్లలనే స్మగ్లర్లుగా, హంతకులుగా మార్చుతున్నది.

'జై భీమ్ లాంటి గొప్ప సినిమాలు పక్కనపెట్టి, పనికిరాని సినిమాలకు అవార్డులు ఇవ్వడటం ద్వారా భావాలను దారి మళ్లించే ప్రయత్నం జరుగుతోంది. దీనికి ఎక్కువగా మధ్యతరగతి వర్గమే బలయ్యేది. ఇప్పటికైనా అందరం మేలుకుందాం!' అన్నాడు కిరణ్?

చంద్రయాన్... ఓట్లయాన్!


జంధ్యాల రఘుబాబు
9849753298

ఇప్పుడంతా చంద్రమయం. చంద్రయానమయం. ప్రతి ఒక్క అవకాశాన్నీ క్యాష్ చేసుకునే సమయం. ఓట్ల రూపంలో ఎలా మార్చుకోవాలో అన్న ఆశావహులమయం నేటి రాజకీయం. ఆ ఓట్లకు చంద్రుడైనా, సూర్యుడైనా, శని అయినా ఒకటే. అసలు గ్రహాలేవి, ఉపగ్రహాలేమి అన్న విషయం ఒదిలేసి కత్రిమ ఉపగ్రహాల వెంటపడే సమయం. ఎవరి పేరైతే ఎత్తకూడదో ఒకవేళ ఎత్తినా దూషించ డానికే పనికొచ్చే ఆ పేర్లను పక్కన పెట్టి, వారి సమ యంలో విరిసిన వైజ్ఞానిక విజయాలను తమవిగా చేసుకునే నిస్సిగ్గు మయం, నేటి రాజకీయం. అసలు మువ్వన్నెల జండా అంటేనే ఎగిరిపడే, ఛీదరించుకునే వాళ్ళే ఇప్పుడు ఆ జండా పట్టుకుని తమ అజెండాతో ముందుకు పోతున్న సమయం. అమావాస్య రోజున కూడా వెన్నెల కురిపిస్తున్న వారొక వైపు కండ్లున్నా కబోదుల మాదిరి ఒకపక్క మాత్రమే చూస్తున్న వాళ్ల ఇంకో వైపు. ఇప్పుడంతా కండ్లున్న కబోదులమయం, చెవు లున్న చెవిటివాళ్ల మయం, నోరున్న మూగవాళ్ల మయం, మెదడున్నా గుజ్జులేని పుర్రెలమయం. కోతుల నుండి మానవులు వచ్చారని చెబితే నమ్మరు కాని, మూడు కోతులను మాత్రం నమ్ముతారు. అవి కండ్లు మూసుకొమ్మంటే కండ్లు, నోరు మూసుకొమ్మంటే నోరు, చెవులు మూసుకొమ్మంటే చెవులు మూసుకొని తమభక్తి నిరూపిస్తారు. అదే జాతీయత అని పాఠాలు బోధిస్తారు.

ఇక ఉగాదినాటి పంచాంగ శ్రవణంలోనే వైజ్ఞానిక రంగంలో, అంతరిక్ష రంగంలో దేశఖ్యాతి పెరుగుతుందని ఉందని, కావలిస్తే చూడండి అని మిత్రుడొకాయన పోస్టు పెట్టాడు. మన సంఖ్యా శాస్త్రం, జ్యోతి శాస్త్రం ప్రకారం ముందే ఈ విజయాన్ని ఖరారు చేసుకున్నామన్నాడు. నాదొక్కటే ప్రశ్న, మరి మణిపూర్ గురించి ఆ పంచాంగ శ్రవణంలో ఎందుకు లేదు అని. సమాధానం ఎటూ ఉండదు. సమాధానాలు చెప్పవలసిన అవసరం తమకు లేదని, మా ఇష్ట మొచ్చినప్పుడు మాత్రమే మాట్లాడతామని, పెద్దోళు చెబుతుంటే వినాలే తప్ప మాట్లాడకూడదని భక్తుల ఉవాచ. అన్నమైతేనేమిరా సున్నమైతేనేమిరా అంటూనే అన్నాన్ని మాత్రమే కోరుకునే వాళ్ళే అసలైన సిసలైన దేశభక్తులు, భోక్తలు. ఇందాకే అనుకున్నట్టు చంద్రుడైతేనేమిరా అని కొత్తగా రాసుకోవాలి. రాహువు, కేతువు చంద్రుడిని మింగి నాయని ఎన్నో ఏండ్లు నమ్మించిన వాళ్ళే ఇప్పుడు చంద్రుడిని మింగేస్తున్నారు ఇంకో రకంగా. చంద్రుడితో పాటు జనుల జ్ఞానాన్ని పక్కదోవ పట్టించి మరీ ముందుకు పోతున్నారు. లక్ష్మీదేవిని రకరాల పేర్లతో మొక్కుతుంటారు. చంద్ర సహోదరి అని ఆమెను మొక్కేటప్పుడు కీర్తిస్తారు. ఇప్పుడు మ్యాటర్ రివర్సయింది. చంద్రుడిని లక్ష్మి సహోదర అని ఆ డబ్బుతో మాకు ఓట్లను కొనిపెట్టు అని చెబుతునట్టుగా లేదూ..? అందుకే ఆ చంద్రుడిని గట్టిగా పట్టుకున్నరు. అసలు చంద్రుడిపై అన్ని పేటెంట్ హక్కులూ మావేనని నమ్మబలుకుతున్నరు. నీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్ దిగింది అసలైన చంద్రుడి మీద కాదని చెబుతారు కూడా. మా చంద్రయాన్ దిగింది మాత్రమే



అసలైన చందమామ అంటారు. మా వాస్తు ప్రకారం చంద్రుడి దక్షిణ ధృవంపై దిగాలనుందని కూడా చెబుతారు.

వినాయక చవితి రాబోతోంది. చవితి చంద్రుడు ఇప్పుడు సవతి చంద్రుడు కాకుండా చూసుకుంటున్నారు. ఇతరులు ఏమాత్రం తమ చంద్రుడిని ముట్టుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తమ చంకలోనే ఎత్తుకుంటున్నారు. తమ భుజంపైనే మోస్తున్నారు. నువ్వే మా ఇంద్రుడివి అంటూ తమ సింహాసనాన్ని కాపాడుకునే పనిలో ఉన్నారు. శాస్త్ర విజ్ఞానాన్ని పెంచే పరిశోధనా సంస్థలు, ఉక్కు కర్మాగారాలు, డ్యాములు, పవర్ ప్లాంట్లు మొదలైనవే ఆధునిక దేవాలయాలన్న నెహ్రూ మాటలు వినబడకుండా చేసి దేవాలయాలే ఆధునిక ఓట్ల కర్మాగారాలు అన్న దిశగా అడుగులేస్తున్నారు. ఆ ఓట్లను రాబట్టుకునే విషయంలో తమకు అనుకూలమైన మిత్రులను మరవక పోవడం చూసి ఇంత స్నేహం ఎక్కడా

సురుకు

కనబడదని దాన్నీ ఎక్కువగా చేసే విశ్వవిద్యాలయాలూ ఉన్నాయి. వాళ్ళేమి చెబితే దాన్ని పాటించే వారూ సిద్ధంగా ఉంటారు.

ఇక రెండు రాష్ట్రాల్లోనూ ఇద్దరు చంద్రులున్నారు. ఈసారి కూడా నేనే వస్తానని ఒక చంద్రుడు, ఒకసారి పరీక్షలో తప్పినా ఈసారి బాగా రాసి, మంచి మార్కులు సంపాదించుకొని తప్పకుండా పాసైపోతానని, తిరిగి చక్రం తిప్పుతానని ఒక చంద్రుడు అంటూ ఉంటారు. మనం వింటూ ఉంటాం. చందమామ రావే, జాబిల్లి రావే అని పిలిచినట్టు ప్రజలు ఈసారీ నన్నే పిలుస్తారని, వెన్నెలలాంటి పాలన అందిస్తామనీ చెబుతారు. ఆ విధంగా ముందుకుపోతూ చంద్రప్రతాపాన్ని చూపిస్తున్నారు. అసలు సూర్యుడి గురించి మాత్రమే సూర్యప్రతాపమని అంటారు. ఆయన కాంతి పడితేనే చంద్రుడు ప్రకాశిస్తాడని సైన్సు చెబుతుంది. అదేవిధంగా మేము నిధులిస్తేనే మీరు ఏదైనా చేయగలరని చంద్రుల వెన్నెల చంద్రుడిది కాదని తమదేనని చెప్పే అవకాశమూ ఉంది.

మొత్తం పైన చంద్రుడు ఈ మధ్య వార్తల్లో ప్రముఖంగా కనిపిస్తున్నాడు. తాను కనిపించినా, తనపై మనుషులు దిగినా, ప్రయోగశాలలు దిగినా కూడా వార్తే. రష్యానే ఫెయిల్ అయింది, మనం పాస్ అయ్యామంటే నిజంగా గ్రేటే. ఎవ్వరూ కాదనరు. మనమూ పరీక్ష తప్పినరోజులున్నాయి. సరిచేసుకొని ఇప్పుడు మంచి మార్కులతో పాస్ అయ్యామంతే. అయితే ఆ మార్కులు ఎవ్వరివన్నదే అసలైన ప్రశ్న. విద్యార్థి మంచి మార్కులు తెచ్చుకుంటే ఆ ఖ్యాతి తలిదండ్రులదా, చదువు చెప్పిన ఉపాధ్యాయులదా, లేదా ఆ పాఠశాలదా అంటే అందరిదీనూ. అంతే తప్ప ఇదంతా నాగొప్పే అని జెండా ఊపితే అంతా ఐపోయినట్లేనా? ఐనుస్టీను, న్యూటను మొదలైన పెద్ద శాస్త్రవేత్తలే తాము ఇంకొకరి భుజాల మీద ఉన్నందుకే ఎక్కువ దూరాన్ని చూడగలుగుతున్నాము అన్నప్పుడు మిగతావాళ్ళెంత. తమకంటే ముందున్నవాళ్లు ఇచ్చిన విజయాలను మరచిపోతే ఎలా. ఒకవేళ విద్యార్థుల సిలబస్ మార్చినట్టు, భారతదేశ చరిత్ర కూడా తామొచ్చినప్పటి నుండి మాత్రమే మొదలైంది. అందుకే ముందున్న విషయాలను తొలగిస్తు న్నాము అనే ఛాన్స్ ఉందో ఏమో చూడాలి. భారత్, అఖండ భారత్ ఇలా ఎన్ని ఉన్నా, మనకు ఇండియా కూడా అంతే ముఖ్యమని తెలుసుకోవాలి.

బిలియనీర్ల కోసమే బీజేపీ : రాహుల్‌గాంధీ

రాయ్‌పూర్ : బీజేపీ, నరేంద్ర మోడీ భారతదేశంలోని ఇద్దరు, ముగ్గురు బిలియనీర్ల కోసం పనిచేస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో జరిగిన ర్యాలీలో, 'రాజీవ్ యువ మితాన్ క్లబ్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. బిజెపి భారతదేశ ఆర్థిక వ్యవస్థ నడ్డివిరిచిందని అన్నారు. అదానీపై భారత ప్రధాని విచారణ జరపలేరని, ఎందుకంటే విచారణ తర్వాత నష్టం అదానీకి కాదని విమర్శించారు. మరోవైపు జిఎస్‌టి, పెద్దనోట్ల రద్దుతో చిన్న వ్యాపారాలు ధ్వంసమయ్యాయని, ఇవి ఉద్దేశపూర్వకంగా చేసినవేనని చెప్పారు.

బీజేపీ పని ప్రజలను విభజించడం, హింసను, విద్వేషాన్ని వ్యాప్తి చేయడమని రాహుల్ గాంధీ విమర్శించారు. మణిపూర్, అస్సాం, కర్నాటకలో బీజేపీ విద్వేషాన్ని వ్యాప్తి చేసిందని చెప్పారు. కాంగ్రెస్ చేసే పని ప్రజలను ఏకం చేయడమని అన్నారు. కర్నాటకలో 230 నుంచి 250 సీట్లు గెలుచుకుంటామనిబీజేపీ చెప్పిందని, ఆ రాష్ట్రంలో ప్రతి పేద వ్యక్తి కాంగ్రెస్‌కు ఓటు వేశాడని అన్నారు.

చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్ పనుల పరిశీలన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ శనివారం చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్ పనులను పరిశీలించారు. జంటనగరాల్లో చర్లపల్లి రైల్వేస్టేషన్ నాలుగో అతిపెద్ద ప్యాసింజర్ టెర్మినల్‌గా అవతరించనుందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. దీని అభివృద్ధి కోసం రైల్వే బోర్డు సవరించిన అంచనా వ్యయంతో రూ.221 కోట్లను మంజూరు చేసినట్టు తెలిపారు. ప్రస్తుత ఏడాది బడ్జెట్‌లో చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్ అభివృద్ధికి రూ.82 కోట్లు కేటాయించినట్టు చెప్పారు.

సైబర్ నేరాలపై నిరంతర నిఘా అవసరం

- కమిషనర్లు, ఎస్పీలతో వర్క్‌షాప్‌లో డీజీపీ స్పష్టీకరణ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒడిసిపడుతూ సైబర్ నేరాలపై నిరంతరం నిఘా వేయాల్సినవసరం ఉన్నదని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ అన్నారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యాన నగర కమిషనర్లు, జిల్లాల ఎస్పీలతో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. డిజిటల్ వ్యవస్థ మొదలుకావటంతో సైబర్ నేరాలు కూడా విపరీతంగా పెరిగాయని ఆయన అన్నారు. సాంప్రదాయిక నేరాల స్థానంలో సైబర్ నేరాలు చొరబడటంతో మోసపోతున్న బాధితుల సంఖ్య కూడా పెరిగిపోతున్నదని ఆయన తెలిపారు. రోజులు గడుస్తున్నా కొద్దీ సైబర్ నేరాల రూపురేఖల్లో కూడా విపరీతమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని అంజనీకుమార్ చెప్పారు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని ఈ నేరాల పట్ల ఎప్పటికప్పుడు అవగాహనను పెంచుకొని వాటిని నిరోధించే సామర్థ్యాన్ని కూడా నేర పరిశోధకులు పెంచుకోవాల్సినవసరం ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా, తీవ్రవాదులను నిరోధించే గ్రేహౌండ్స్ విభాగం, ఉగ్రవాద కార్యకలాపాలను అణచివేసే కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాల పనితీరు, వారి పరిధి కంటే సైబర్ సెక్యూరిటీ బ్యూరో పరిధి అత్యంత విస్తారమైందని ఆయన అన్నారు. సైబర్ నేరాలను పరిశోధించటానికి రాష్ట్రాలే గాక అంతర్జాతీయ స్థాయిలో కూడా పరిశోధనలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. రాష్ట్రానికి చెందిన గ్రేహౌండ్స్, ఎస్ఐబీ, కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాల పనితీరు ఇతర రాష్ట్రాల పోలీసులకు అనుసరణీయమైందనీ, ఆ స్థాయికి రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో చేరుకోవాల్సినవసరం ఉన్నదని ఆయన చెప్పారు.

ఆకాష్‌కు కొత్త సారథులు..!

న్యూఢిల్లీ : విద్యాసంస్థ ఆకాష్ సిఇఒ, సిఎఫ్ఒలు రాజీనామా చేయడంతో దాని మాతృసంస్థ బైజూస్ నూతన నాయకత్వం నియామకానికి ఓ ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఇటీవల ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ (ఎఇఎస్ఎల్) హెడ్ అభిషేక్ మహేశ్వరి, సిఎఫ్ఒ విపన్ జోషి వైదొలగడంతో ఆ రెండు స్థానాలు కలిగి ఉన్నాయి. కీలకమైన ఈ హోదాల్లో కొత్త సారథుల కోసం కమిటీని నియమిస్తూ బైజూస్ సిఇఒ రవీంద్రన్ నిర్ణయం తీసుకున్నారు.

ఐసిఐసిఐ ఫ్రూ గిఫ్ట్ ప్రో పాలసీ విడుదల

ముంబయి : ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా ఐసిఐసిఐ ప్రూ గిఫ్ట్ ప్రోను విడుదల చేసినట్లు తెలిపింది. ఏక మొత్తం ప్రయోజనాలతో పాటు సాధారణ ఆదాయాన్ని అందించేలా ఈ పాలసీని రూపొందించినట్లు పేర్కొంది. ప్రతి సంవత్సరం పెరుగుతున్న ఆదాయాన్ని లేదా స్థిరమైన ఆదాయాన్ని పొందే అవకాశాన్ని అందిస్తుందని తెలిపింది. కుటుంబానికి ఆర్థిక భద్రతను కల్పిస్తుందని పేర్కొంది. ఐసిఐసిఐ ప్రూ గిఫ్ట్ ప్రో 5 నుండి 12 సంవత్సరాల వరకు ప్రీమియం చెల్లింపు నిబంధనల శ్రేణిని అందిస్తుంది.

8వ సంవత్సరం నుండి వారు 30 సంవత్సరాల వరకు ఆదాయాన్ని పొందడం ప్రారంభించవచ్చని ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిత్ పాల్టా పేర్కొన్నారు.

బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి..

- మధ్యప్రదేశ్‌లో మారుతున్న రాజకీయ సమీకరణలు

భోపాల్ : మధ్యప్రదేశ్ రాజకీయాలు వేడెక్కాయి. ఈ ఏడాది చివరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో బీజేపీలోని కొంతమంది సీనియర్ నేతలు కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. తాజాగా బీజేపీకి రాజీనామా చేసిన కొలారస్ ఎమ్మెల్యే వీరేంద్ర రఘువంశీ కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ సమక్షంలో వీరేంద్ర రఘువంశీ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కమల్‌నాథ్ మాట్లాడుతూ.. 'కేంద్రమంత్రి జ్యోతిరాధిత్య సింధియా వర్గానికి చెందిన వారే కాకుండా.. ఇతర బీజేపీ నేతలు చాలామంది నాతో టచ్‌లో ఉన్నారు. సింధియాకు నమ్మిన బంటుగా ఉన్న సమందర్ పటేల్ కూడా గత నెల్లో స్థానిక కాంగ్రెస్ నాయకత్వం అనుమతితోనే పార్టీలోకి చేరా రు.' అని ఆయన అన్నారు. కాగా, రఘువంశీ బీజేపీ వీడిన మరుసటి రోజే శుక్రవారం రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గిరిజ శంకర్ బీజేపీకి రాజీనామా చేయడం గమనార్హం. అలాగే.. వింధ్య ప్రాంతానికి చెందిన ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు, మహాకౌశల్, బుందేల్‌ఖండ్ ప్రాంతాలకు చెందిన బీజేపీ నేతలు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. గడచిన మూడు నెలల కాలంలో పలువురు బీజేపీ నేతలు ఆ పార్టీని వీడి కాం గ్రెస్‌లోకి చేరారు. వీరిలో మాజీ ముఖ్యమంత్రి కైలాష్ జోషి కుమారుడు మాజీ మంత్రి దీపక్ జోషి, మాజీ ఎమ్మెల్యే రాధేలాల్ బాఘేల్, మాజీ ఎమ్మెల్యే కున్వర్ ధ్రువ్ ప్రతాప్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే దేశరాజ్ సింగ్ కుమారుడు యద్వేంద్ర సింగ్, సమందర్ సింగ్ పటేల్ ఉన్నారు. వీరితోపాటు బిజెపి మాజీ ఎంపి మఖాన్ సింగ్ సోలంకి బిజెపికి రాజీనామా చేసి ఏప్రిల్‌లో కాంగ్రెస్‌లో చేరారు. ఈ వర్క్ షాప్‌లో పలువురు కమిషనర్లు, ఎస్పీలు, ఐజీలు పాల్గొనగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్, సైబరాబాద్ కమిషనర్ కూడా అయిన స్టీఫెన్ రవీంద్ర కోఆర్డినేటర్‌గా వ్యవహరించాడు.

అక్టోబర్ 5 నుంచి 'ఎస్ఏ-1' పరీక్షలు

- టైంటేబుల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-1) పరీక్షలు వచ్చేనెల ఐదో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అదేనెల 11 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డి శనివారం టైంటేబుల్‌ను విడుదల చేశారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలను నిర్వహిస్తారు. ఆరు, ఏడు తరగతుల వారికి ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు జరుగుతాయి. ఎనిమిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు నిర్వహిస్తారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చేపడతారు. జవాబుపత్రాలను మూల్యాంకనం చేసి వచ్చేనెల 30న ఫలితాలను ప్రకటించాలని రాధారెడ్డి తెలిపారు. వాటిని అదేనెల 31న రికార్డుల్లో పొందుపర్చాలని సూచించారు. నవంబర్ ఒకటిన తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించి మార్కుల రికార్డులను అందజేయడంతోపాటు విద్యార్థుల పురోగతిపై చర్చించాలని కోరారు. అన్ని జిల్లాల డీఈవోలు ఎస్ఏ-1 పరీక్షల నిర్వహణపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

టీయుఎంహెచ్ఇయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జాతీయ ఆరోగ్య పథకం (నేషనల్ హెల్త్ మిషన్) పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ - సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ ఫసియొద్దీన్, కె.యాదానాయక్, నాయకులు ఎండి సాదుల్లా, రమణ, వైకుంఠం శనివారం రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ హెచ్‌ఎం ఉద్యోగులందరూ సమ్మెలో ఉన్నారని వారు తెలిపారు. దీనిపై డీహెచ్ సానుకూలంగా స్పందిం చారు. ప్రభుత్వానికి తెలియజేస్తానని హామీ ఇచ్చారు. ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న దాదాపు 17 వేల మంది ఉద్యోగులను పర్మినెంట్ చేయాలనీ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి - సమాన వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. 510 జీవో అమలుకాని క్యాడర్లకు కూడా బేసిక్, డీఏ, హెచ్ఆర్ఏ తదితరాలను కలిపి గ్రాస్ శాలరీ నిర్ణయించాలనీ, హెచ్ఆర్ పాలసీని రూపొందించా లని కోరారు. మెడికల్ ఇన్సూరెన్స్, యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల్లో అత్యధికులకు రాష్ట్ర ప్రభుత్వ పీఆర్సీ ప్రకారం జీతాలు అమలు కావడం లేదని తెలిపారు. గతంలో జీవో నెంబర్ 510 ద్వారా దాదాపు 10 వేల మంది వరకు డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు, ఏఎన్ఎం తదితరులకు బేసిక్ ప్రకారం వేతనాలు నిర్ణయించి చెల్లిస్తున్నారని గుర్తుచేశారు. ఇందులో కొన్ని క్యాటగిరీలకు పర్మినెంట్ ఎంప్లాయీ బేసిక్ కన్నా తక్కువగా చెల్లిస్తున్నారనీ, మిగిలిన 7 వేల మంది కనీస బేసిక్ కాకుండా అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. వీరందరికి కనీస వేతనం డీఏ, హెచ్ఆర్ఏ తదితర అలవెన్సులు నిర్ణయించి అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనాలు అమలు కాకుండా వేతనాలు పొందుతున్న క్యాడర్లలో అర్బన్ హెల్త్ సెంటర్లలో పని చేస్తున్న పారామెడికల్ సిబ్బంది, అకౌంటెంట్స్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు, పబ్లిక్ హెల్త్ మేనేజర్ (కమ్యూనిటీ ఆర్గనైజర్స్), సపోర్టింగ్ స్టాఫ్‌లోని మెడికల్ అసిస్టెంట్లు, వాచ్‌మెన్, స్వీపర్లు, బస్తీ దవాఖానాల్లో పని చేసే స్టాఫ్ నర్సులు, సపోర్టింగ్ స్టాఫ్ తదితరులున్నారు. ఆయా విభాగాల వారీగా తక్కువ వేతనం పొందుతున్న వారికి క్యాడర్ ప్రకారం పర్మినెంట్ ఉద్యోగుల బేసిక్, అలవెన్సులు నిర్ణయించాలని వారు కోరారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మరో డీఏ చెల్లింపు

- స్వాగతించిన ఎస్‌డబ్ల్యూఎఫ్, ఈయూ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ ఉద్యోగులకు ఈ ఏడాది జనవరి నుంచి ఇవ్వాల్సిన 5 శాతం డీఏను సెప్టెంబర్ మాసం జీతంతో ఇస్తున్నట్టు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. దీనితో ఆర్టీసీ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 8 డీఏలు ఇచ్చినట్టు అయ్యిందని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులు బాగా కష్టపడి పనిచేస్తున్నారనీ, పెండింగ్ బకాయిలు త్వరలోనే ఇవ్వడానికి యాజమాన్యం ప్రయత్నిస్తున్నదని పేర్కొన్నారు.

సంతోషం...కానీ...

జనవరి డీఏ చెల్లింపును స్వాగతిస్తున్నట్టు టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు, ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జులై డీఏతోపాటు 168 నెలల డీఏ బకాయిలు కూడా వెంటనే చెల్లించాలని కోరారు. బకాయిలు చెల్లిస్తే ఒక్కో కార్మికుని కుటుంబానికి సగటున 1.60 లక్షలు వస్తుందనీ, అవి పిల్లల చదువులకు ఉపయోగపడతాయని విజ్ఞప్తి చేశారు.

ఓటుతో దౌర్జన్యాలపై ప్రతీకారం

- సీపీఐ(ఎం) అభ్యర్థికి మద్దతుగా అధిర్ రంజన్ చౌదరి ప్రచారం

కోల్‌కతా : దౌర్జన్యానికి పాల్పడుతున్న టీఎంసీని, మతతత్వ బీజేపీని ఓడించడం ద్వారా ప్రతీకారం తీర్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ పశ్చిమ బెంగాల్ అధ్యక్షుడు అధీర్ రంజన్ చౌదరి ఓటర్లను కోరారు. దూప్‌గురి ఉప ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థి ఈశ్వర్ చంద్రరాయ్‌కు మద్దతుగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న ద్వంద్వ హింసతో బెంగాల్ ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, ప్రజలు తమ ప్రజాస్వామ్య హక్కులను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ మతతత్వ రాజకీయాలను, టిఎంసి బీభత్సకాండను ఓడించాలని, సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించాలని కోరారు. టీఎంసీ, బీజేపీ తీవ్రమైన అవినీతికి పాల్పడ్డాయని ఆయన చెప్పారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి సలీం మాట్లాడుతూ ఉద్యోగ నియామకాల్లో బారీ కుంభకోణానికి సంబంధించి టీఎంసీ ప్రధాన కార్యదర్శిని ప్రశ్నించాలని హైకోర్టు ఆదేశించినా ఈడీ, సీబీఐ ఆ పని ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. 'ముంబై, బెంగళూరులో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు.

ట్రాఫిక్‌లో ఆటోపై కూలిన చెట్టు

- డ్రైవర్ మృతి.. మరొకరికి గాయాలు
- హైదరాబాద్‌లోని హైదర్‌గూడ సిగ్నల్ వద్ద ఘటన

నవతెలంగాణ-హిమాయత్ నగర్



హైదరాబాద్‌లోని నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో హైదర్‌గూడలో విషాదం చోటుచేసుకుంది. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగి ఉన్న ఆటోపై ఒక్కసారిగా పెద్ద చెట్టు కూలడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరొక ఆటో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు. అడ్మిన్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం..సోమాజిగూడ ఎంఎస్ మక్తా ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ మహమ్మద్ గౌస్ పాషా(36) శనివారం హిమాయత్ నగర్ నుంచి హైదర్‌గూడ మీదుగా బషీర్‌బాగ్ వైపు వెళుతున్నాడు. హైదర్‌గూడలో సిగ్నల్స్ పడటంతో చౌరస్తాలో ఆటోను ఆపాడు.

ఇంతలోనే అక్కడి ఫుట్‌పాత్‌పై ఉన్న భారీ చెట్టు ఒక్కసారిగా కూలిపోయింది. ఆటో మీద పడటంతో మహమ్మద్ గౌస్ పాషా అక్కడికక్కడే ప్రాణం కోల్పోయాడు. మరొక ఆటో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. మిగతా వాహనదారులు పరుగులు తీశారు. స్థలానికి చేరుకున్న నారాయణగూడ పోలీసులు, జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్ సిబ్బంది రోడ్డుపై పడి ఉన్న చెట్టు కొమ్మలను తొలగించారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కేసు దర్యాప్తు చేపట్టారు. మహమ్మద్ గౌస్ పాషా మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యమే కారణమని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీ ఆరోపించారు. ఆమె ఘటన స్థలాన్ని సందర్శించి మీడియాతో మాట్లాడారు. వర్షాకాలం రాకముందే ప్రధాన రహదారులపై పెద్ద పెద్ద వృక్షాలు వైర్లకు తాకి ఉండటంతో ఎన్నోమార్లు జీహెచ్‌ఎంసీ అధికారుల కు విన్నవించామని తెలిపారు. అయినా నిర్లక్ష్యం వహించారన్నారు. ఇప్పుడు చెట్టు కూలి ఆటో డ్రైవర్ మృతికి కారణమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

జీవితంలో మనశ్శాంతి ముఖ్యం

- టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జీ రఘుమారెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మనిషికి జీవితంలో మనశ్శాంతి ముఖ్యమని తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) సీఎమ్‌డీ జీ రఘుమారెడ్డి అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భముగా ప్రజాపిత బ్రహ్మ కుమారీలు హైదరాబాద్ మింట్ కాపౌండ్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఉద్యోగులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం ఒత్తిడి నుంచి దూరంగా ఉండే ప్రక్రియలు అవసరమనీ, అప్పుడే మనోనిబ్బరం, మనశ్శాంతి లభిస్తాయని చెప్పారు. ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయ హైదరాబాద్ శాఖ ఇంచార్జి అంజలి మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన ద్వారా ప్రతి వ్యక్తి తమకు తాము పరివర్తన చెందేలా తాము సహాయం చేస్తామని అన్నారు. మనిషికి శాంతిపూర్వక జీవితం అత్యవసరమని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు టీ శ్రీనివాస్, జే శ్రీనివాసరెడ్డి, జీ పర్వతం, సీహెచ్ మదన్‌మోహన్‌రావు, ఎస్ స్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాలలో వికృత చేష్టలు

పాఠశాలలను చుట్టుముడుతున్న మతోన్మాద జ్వాలలు

- మైనారిటీలే లక్ష్యంగా చిన్నారులలో విష బీజాలు

న్యూఢిల్లీ : కొద్ది రోజుల క్రితం సామాజిక మాధ్యమాలలో ఓ వీడియో కన్పించింది. ఓ గ్రీకు బాలిక హిందీలో పాట పాడుతుంటే ప్రధాని నరేంద్ర మోడీ శ్రద్ధగా విన్నారు. ఆ పాపతో మాట్లాడినప్పుడు ఆయన వదనం ఆనందంతో వెలిగిపోయింది. గ్రీకు బాలిక హిందీలో పాట పాడినందుకు గర్వంగా ఫీలయ్యారు కూడా. కానీ ఆ చిన్నారికి ఉత్తరప్రదేశ్‌లోని ఓ పాఠశాలలో జరిగిన అమానుష ఘటన గురించి ఏం తెలుసు? ఆమెకు వేలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామంలోని విద్యాలయంలో ఓ బాలుడి చెంప మీద కొట్టాల్సిందిగా ఉపాధ్యాయురాలు అతని సహచర విద్యార్థులను ప్రేరేపించారు. తన చెంప మీద దెబ్బలు పడుతుంటే ఆ విద్యార్థి భయంతో వణికిపోయాడు. కళ్ల వెంట నీరు ధారాపాతంగా కారింది. కానీ ఆ ఉపాధ్యాయురాలికి కనికరం కలగలేదు సరికదా గట్టిగా దెబ్బలు కొట్టనందుకు విద్యార్థులపై కోపగించుకున్నారు. దెబ్బలు తిన్న ఆ విద్యార్థి ఎవరో తెలుసా? ఓ ముస్లిం బాలుడు. మరి ఆ అధ్యాపకురాలు...అగ్రకుల దురహంకారి. మైనారిటీలు అంటే ఆ ఉపాధ్యాయురాలికి ఎంత కసి, కోపం ఉన్నదో ఆమె ఆ సందర్భంలో ప్రయోగించిన భాష వింటే అర్థమవుతుంది. మరి ఎక్కడో ఉన్న గ్రీకు బాలికకు ఇదంతా ఎలా తెలుస్తుంది?. తన పాట విని భారత ప్రధాని ఉబ్బితబ్బిబయ్యారని సంబరపడిందే కానీ భారతావనిలోని విద్యాలయాలలో ఇలాంటి భయానక దృశ్యాలు కన్పిస్తాయని ఆ చిట్టితల్లికి ఏం తెలుసు?



వారి పైనే గురి

మోడీ ప్రభుత్వం మైనారిటీల విషయంలో ఎంత వివక్ష ప్రదర్శిస్తోందో అందరికీ తెలిసిందే. మైనారిటీ విద్యార్థులకు ఉద్దేశించిన అనేక ఉపకార వేతనాలను బీజేపీ ప్రభుత్వం రద్దు చేసింది. వారి బంగారు భవితకు, సాధికారతకు తోడ్పడే ఉపకార వేతనాలను రద్దు చేయడం అంటే వారిని చదువులకు దూరం చేయడమే అవుతుంది. 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండీ ఈ విద్వేష జ్వాలలు మైనారిటీలను దహించి వేస్తూనే ఉన్నాయి. ఇప్పుడవి పాఠశాలల్ని కూడా చుట్టుముట్టాయి. చలనచిత్రాల ద్వారా ముస్లింలకు వ్యతిరేకంగా ప్రజల్లో విష బీజాలు నాటుతున్న ఉదంతాలను కూడా మనం చూస్తూనే ఉన్నాం. ది కాశ్మీర్ ఫైల్స్, 72 హూరైన్, కేరళ స్టోరీ వంటి చిత్రాలు మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని తీసినవే. ఈ చిత్రాలకు సంఘ్ పరివార్, బీజేపీ పెద్దల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ఈ ఉన్మాదం ఎంతగా తారాస్థాయికి చేరిందంటే కాశ్మీర్ ఫైల్స్ చిత్రానికి ప్రతిష్టాత్మక ప్రభుత్వ అవార్డు లభించింది. ఎందుకో తెలుసా...ఆ చిత్రం జాతీయ సమగ్రతను చాటిచెప్పినందుకట.

చిన్నారులను సైతం...

దేశంలో మైనారిటీలకు వ్యతిరేకంగా ఇలాంటి దిగ్భ్రాంతి కలిగించే సంఘటనలు జరగడం ప్రతి ఒక్కరికీ సిగ్గుచేటే. ఈ దారుణాలను చూసి సిగ్గుతో తలదించుకోవడానికి బదులు వీటిని జాతికి గర్వకారణమైన ఘటనలుగా కీర్తించడం మరింత బాధాకరం. దేశంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇలాంటి సంఘటనలను మతోన్మాద శక్తులు మరింతగా ప్రేరేపిస్తాయి. మైనారిటీలకు వ్యతిరేకంగా హిందూ ఓట్లను సంఘటితం చేసి, ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఈ శక్తులు ఎప్పటి నుండో ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నాయి. ఇప్పుడు తాజాగా పిల్లలను కూడా తమ ఆటలో పావులుగా వాడుకోవాలని చూడడమే దారుణం. చివరికి చిన్నారుల్లో సైతం మతోన్మాద విష బీజాలు నాటే వికృత చేష్టలకు తెగబడుతున్నారు. ఓ వైపు చందమామ దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా నిలిచినందుకు గర్వపడాలో, మరోవైపు అమాయక బాలల్లో విద్వేషాలు రేపుతూ పైశాచిక ఆనందం పొందుతున్న ఉన్మాదుల వికృత చేష్టలను చూసి సిగ్గుతో కుమిలిపోవాలో అర్థం కాని పరిస్థితి.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పదేళ్ల పనితీరును గమనిస్తే ఆ పార్టీ యంత్రాంగం ప్రధానంగా మతపరమైన సమీకరణలపై ఆధారపడిందని అర్థమవుతుంది. ఎన్నికలు సమీపిస్తుండడంతో మతోన్మాద శక్తులు మరింతగా విజృంభిస్తున్నాయి. బహుశా రాజకీయ ప్రత్యర్థులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఇతర ప్రభుత్వ సంస్థలను ప్రయోగించడం మాత్రమే సరిపోదని ఈ శక్తులు భావిస్తూ ఉండవచ్చు.

విద్యకు దూరం చేసేందుకే...

పాఠశాలలో జరిగిన అమానుషకాండను వీడియోలో చూసి ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. పోలీసులు ముజఫర్‌నగర్ జిల్లాలోని ఆ పాఠశాలకు వెళ్లారు. అమానవీయ ఘటనపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇదంతా షరా మామూలుగా జరిగేదే. ఒకవేళ బాధిత బాలుడు హిందువు, ఉపాధ్యాయురాలు ముస్లిం అయి ఉంటే... ఆమెను వెంటనే అరెస్ట్ చేసి ఉండేవారు. ఆమె ఇంటి పైకి బుల్‌డోజర్ పంపి నేలమట్టం చేసే వారు. ఇక్కడ గమనించాల్సిన విషయ మేమంటే బాలుడి తండ్రి భయపడి ఉపాధ్యాయురాలిపై ఫిర్యాదు చేసేందుకు సైతం వెనుకాడారు. తన కుమారుడిని పాఠశాల మాన్పించడం మినహా ఆ అభాగ్యుడు ఏం చేయగలడు? మతోన్మాద శక్తులకు కావాల్సింది కూడా ఇదే. కర్నాటకలో హిజాబ్ వివాదం తర్వాత అనేక ముస్లిం కుటుంబాలు తమ కుమార్తెలను చదువులు మాన్పించిన విషయం గుర్తుండే ఉంటుంది.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు 126 మంది ఎంపిక

- పాఠశాల విద్య నుంచి 54 మందికి అవకాశం
- గురుపూజోత్సవం సందర్భంగా 5న ప్రదానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2023కు 126 మందిని ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు విడుదల చేశారు. ఇందులో పాఠశాల విద్యాశాఖ పరిధిలోనే 54 మంది ఉన్నారు. వారిలో గెజిటెడ్ హెడ్మాస్టర్లు, ప్రిన్సిపాళ్లు పది మంది, స్కూల్ అసిస్టెంట్లు, పీజీటీలు, టీజీటీలు 20 మంది, ఎస్జీటీలు 11 మంది, ఐఏఎస్ఈ, సీటీఈ, డైట్ కాలేజీల నుంచి ఒకరు, ప్రత్యేక కేటగిరీ ఉపాధ్యాయులకు 12 మంది కలిపి మొత్తం 54 మంది ఎంపికయ్యారు. ఈనెల ఐదున ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారికి ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. ఈ సందర్భంగా వారిని సన్మానించడంతోపాటు రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రం, శాలువా, బంగారుపూత పూసిన రజతపతకం అందజేస్తారు.

రేపు ఉత్తమ ఉపాధ్యాయులతో మంత్రి సమావేశం

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారు సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు పాఠశాల విద్యాశాఖలో రిపోర్టు చేయాలని పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ పి మదన్‌మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేరోజు సాయంత్రం ఐదు గంటలకు హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశామనీ, ముఖ్యఅతిథిగా విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

5న రవీంద్రభారతిలో గురుపూజోత్సవం

తొలి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం ఉదయం 10 గంటలకు జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఇంటర్ విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఎ శ్రీదేవసేన తెలిపారు. విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి సభాధ్యక్షులుగా వ్యవహరించనున్న ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డితోపాటు విశిష్ట అతిథులుగా శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఇతర మంత్రులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు గౌరవ అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు.

సిమ్‌కార్డ్ నిబంధనలు కఠినతరం

- అడ్డగోలు అమ్మకాలకు తెర
- రిటైలర్లకు కెవైసి తప్పనిసరి
- లేదంటే రూ.10 లక్షల జరిమానా
- టెల్కోలకు డిఒటి ఆదేశాలు3



న్యూఢిల్లీ : సిమ్ కార్డుల జారీ విధానాన్ని కఠినతరం చేస్తూ కేంద్ర టెలికం శాఖ (డిఒటి) నూతన నిబంధనలు రూపొందించింది. అక్టోబర్ నుంచి ఈ నూతన విధానం అమల్లోకి రానుంది. సిమ్ కార్డు కొనుగోలు చేసేవారు, విక్రయించేవారు నూతన నిబంధనలు కచ్చితంగా పాటించాలి. ఇకపై తమ కంపెనీ సిమ్ కార్డులు విక్రయించే దుకాణాలు, రిటైలర్లను ఆయా టెలికం కంపెనీలు కచ్చితంగా తనిఖీ చేసి.. కెవైసిలను పరిశీలించి.. గుర్తింపును ఇవ్వాల్సి ఉంటుంది. సిమ్ కార్డుల విక్రయాల్లో భద్రత పెంచేందుకు డిఒటి కొత్త నిబంధనలను జారీ చేసిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కంపెనీలు రిటైలర్లను తనిఖీ చేయడంతో పాటుగా వారికి గుర్తింపును ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత వారికి సిమ్ కార్డుల విక్రయానికి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 30లోగా టెలికాం కంపెనీలు ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందని డిఒటి స్పష్టం చేసింది. అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా సిమ్‌కార్డులను విక్రయిస్తే ఒక్కో రిటైలర్‌కు రూ.10 లక్షల చొప్పున జరిమానా విధించాల్సి ఉంటుందని డిఒటి నిబంధనల్లో పేర్కొంది. దేశంలో సిమ్ కార్డుల దుర్వినియోగాన్ని నిలువరించేందుకు కేంద్రం నిబంధనలను కఠినతరం చేసినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.

అక్కడ పోలీసు శాఖ అనుమతి తప్పనిసరి..

కొత్త రిటైలర్లతో పాటుగా ప్రస్తుత విక్రయదారులను కూడా టెలికం కంపెనీలు తనిఖీ చేసి.. కెవైసి పూర్తి చేయాల్సి ఉంటుంది. అదే విధంగా అసోం, కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో సిమ్ కార్డులు విక్రయించే దుకాణాలను ఏకంగా పోలీసు శాఖ తనిఖీలు చేస్తుంది. ఆ తర్వాత టెలికాం కంపెనీలు దుకాణదారులతో ఒప్పందాలు కుదుర్చుకోవాలని డిఒటి వెల్లడించింది.

ఆధార్ తప్పనిసరి..!

ఇకపై కొత్త సిమ్ కార్డులు తీసుకునే సమయంలో ఆధార్ గుర్తింపు కార్డుతోనే కెవైసి పూర్తి చేయాలని డిఒటి సూచించినట్లు సమాచారం. పాత సిమ్ కార్డ్ పాడైనా, పోగొట్టుకున్న ఆధార్‌ను సమర్పించి.. కొత్తది తీసుకోవాల్సి ఉంటుంది.

తుమ్మల ఇంటికి పొంగులేటి

- కాంగ్రెస్‌లోకి రావాల్సిందిగా ఆహ్వానం
- పరస్పరం సన్మానించుకున్న నేతలు
- బీఆర్ఎస్, కేసీఆర్ తీరుపై పొంగులేటి ఆగ్రహం
- కార్యకర్తల అభీష్టం మేరకే నిర్ణయమన్న తుమ్మల



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్‌లోకి రావాల్సిందిగా మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కో చైర్మెన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆహ్వానించారు. ఖమ్మం గొల్లగూడెం రోడ్డులోని తుమ్మల ఇంటికి శనివారం ఉదయం పొంగులేటి వెళ్లారు. తుమ్మల ఎదురొచ్చి స్వాగతం పలికారు. ఇద్దరూ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. తుమ్మలకు పొంగులేటి పూలమొక్క ఇచ్చి, శాలువా కప్పారు. పొంగులేటిని కూడా శాలువాతో మాజీ మంత్రి సన్మానించారు. తుమ్మల అనుచరులను పొంగులేటికి, పొంగులేటి అనుచరులను తుమ్మలకు పరస్పరం పరిచయం చేశారు. ఆ తర్వాత ఇద్దరూ ప్రత్యేకంగా ఓ గదిలో కూర్చొని అరగంటకు పైగా చర్చించుకున్నాక బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు.

వినాశకాలే విపరీత బుద్ధి : పొంగులేటి

'వినాశకాలే విపరీత బుద్ధి' అని కేసీఆర్‌ను ఉద్దేశించి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. 'ఖమ్మం జిల్లా కాంగ్రెస్, ప్రజల పక్షాన తుమ్మలను ఆహ్వానించాం.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్తగూడెం నియోజకవర్గం మినహా మిగిలిన చోట్ల ఒకటి, రెండు శాతం ఓట్లు కూడా లేని టీఆర్ఎస్‌ను బలోపేతం చేసేందుకు తుమ్మలను పార్టీలోకి తీసుకున్న కేసీఆర్, ఆ తర్వాత ఉప ఎన్నికల కోసం తనను, ప్రస్తుతం మంత్రిగా ఉన్న పువ్వాడ అజయ్‌కుమార్‌ను పార్టీలోకి రప్పించారు. ఏ రాజకీయ పార్టీలో ఉన్నా చిత్తశుద్ధితో ఆ పార్టీ, ప్రజల అభివృద్ధి కోసం కృషి చేసే వ్యక్తి తుమ్మల నాగేశ్వరరావు. పార్టీలో చేరాక కొన్ని శక్తులు వారికి ఇష్టం లేకుంటే 'పొమ్మన లేక పొగబెట్టే' కార్యక్రమాన్ని చేపట్టాయి. ఆ పార్టీలో చేరాక అనేక అవమానాలకు గురిచేస్తూ ముందు నన్ను బయటకు పంపారు. ఆ తర్వాత తుమ్మలను.. మేమైతే మిమ్మల్ని సస్పెండ్ చేయం.. మీ అంతట మీరు పోయేవిధంగా చేస్తామనే రీతిలో వ్యవహరించిన పద్ధతులను అందరూ ప్రత్యక్షంగా చూశారు. తుమ్మలతోపాటు వారి మిత్రబృందాన్నీ పార్టీలోకి ఆహ్వానిస్తున్నాం. కల్వకుంట్ల చంద్రశేఖరరావు కుటుంబం పట్ల తెలంగాణ ప్రజలు ఎంత అసంతృప్తితో ఉన్నారో రాబోయే ఎన్నికల్లో చూడబోతున్నాం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది సీట్లు గెలుచుకుంటాం.. పెద్దలు తుమ్మల, ఇంకా చాలా మంది ఉన్నారు. మేమంతా కలిసి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటాం. బీఆర్ఎస్‌ను వీడాక అనుచరులు, మద్దతుదారులతో చర్చించిన తర్వాత వారి సూచనల మేరకు నిర్ణయం తీసుకున్నా.. తుమ్మల కూడా అదే పద్ధతిలో నిర్ణయాన్ని ప్రకటిస్తారు. ప్రజాకోరిక మేరకు నిర్ణయం ఉంటుందని తుమ్మల చెప్పారు. ఇంకా కొంత సమయం పడుతుంది.. తప్పకుండా నిర్ణయం తీసుకుంటామని" తుమ్మల అన్నట్టు పొంగులేటి వివరించారు.

కార్యకర్తల అభీష్టం మేరకే నిర్ణయం: తుమ్మల నాగేశ్వరరావు

కార్యకర్తల అభీష్టం మేరకే నిర్ణయం ఉంటుందని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. 'నన్ను ఆహ్వానించడానికి వచ్చిన పొంగులేటికి ధన్యవాదాలు. నా రాజకీయ జీవితం.. నా కోసం, నా కుటుంబం.. నా స్వార్థం కోసం కాకుండా నాకు వచ్చిన ఏ అవకాశమైనా ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడ్డా. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను, నేనున్న పార్టీలతోపాటు జిల్లా అభివృద్ధికి కృషి చేశా. సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడం కోసమే నేను రాజకీయాల్లో కొనసాగుతున్నా.. కార్యకర్తల అభిప్రాయం మేరకు నిర్ణయం ఉంటుందని' వివరించారు.

నాలుగేండ్ల తర్వాత..

జిల్లా రాజకీయాల్లో కీలక నేతలుగా భావిస్తున్న తుమ్మల, పొంగులేటి దాదాపు నాలుగేండ్ల తర్వాత ఒకర్నొకరు ప్రత్యక్షంగా కలుసుకుని ఆత్మీయ ఆలింగనం చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఇరువురి నేతల ఆత్మీయ ఆలింగనంపై అనుచరుల మధ్య సరదా చర్చ సాగింది.

పొంగులేటి అనుచరులు చావా శివరామకృష్ణ, మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరు బ్రహ్మయ్య, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, మలీద్ జగన్, దొడ్డా నగేష్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతగాని జైపాల్, తుమ్మల అనుచరులు సాధు రమేష్‌రెడ్డి, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బండి జగదీశ్, మద్ది ఎల్లారెడ్డి, బానోత్ కృష్ణ తదితరులు సరదా సంభాషణ చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో పదికి పది సీట్లు గెలుచుకుంటామనే విశ్వాసాన్ని వెల్లడించారు.

దీప్తిని చంపింది చెల్లెలే..

- వీడిన కోరుట్ల మర్డర్ కేసు
- చెల్లెలు చందన, ఆమె ప్రియుడే హంతకులు
- అక్కకు వొడ్కా తాగించి.. డబ్బు, నగలతో పారియేందుకు పథకం
- ప్లాన్ వికటించడంతో అక్కను చంపిన వైనం
- మద్యం తాగి చనిపోయిందని నమ్మించే యత్నం
- ముంబయికి పారిపోయేందుకు పయనం
- నిందితులను అరెస్టు చేసి.. కేసును ఛేదించిన పోలీసులు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / జగిత్యాల

జగిత్యాల జిల్లా కోరుట్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దీప్తి మర్డర్ కేసు మిస్టరీ వీడింది. ఆమె చెల్లెలు చందననే తన ప్రియుడితో కలిసి చంపినట్టు పోలీసులు నిర్ధారించారు. ప్రియుడితో కలిసి ఇంట్లో నగదు, నగలు పట్టుకుని పారిపోయేందుకు సినీఫక్కీలో వేసిన ప్లాన్ కాస్త మర్డర్ చేసేవరకూ వెళ్లి ప్రేమికులిద్దరూ కటకటాలపాలయ్యారు. ముంబయి వెళ్లేందుకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్-బాల్కొండ రోడ్డుని దాబాలో ఉన్న నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. జగిత్యాల ఎస్పీ ఎగ్గడి భాస్కర్ శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన బంక శ్రీనివాస్‌రెడ్డికి ఇద్దరు కుమార్తెలు దీప్తి, చందన, కొడుకు ఉన్నారు. దీప్తి వర్క్‌ఫ్రం హోంలో భాగంగా ఇంటి నుంచే సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తోంది. రెండో కూతురు బీటెక్ చదివింది. హైదరాబాద్ మల్లారెడ్డి కాలేజీలో బీటెక్ చదువుతున్న చందన, నెల్లూరుకు చెందిన ఉమర్‌షేక్ సుల్తాన్ ప్రేమించుకున్నారు. చదువు పూర్తయి ఇంటి వద్దనే ఉంటున్న చందనను ఉమర్ తరచూ కోరుట్లకు వచ్చి కలుస్తుండేవాడు. గత నెల 19న కూడా కోరుట్లకు వచ్చిన ఉమర్‌తో 'మన పెండ్లికి ఇంట్లో ఒప్పుకోరు. బయటకి వెళ్లి పెండ్లి చేసుకుందాం' అని చందన చెప్పింది. జాబ్ లేకుండా ఇద్దరం ఎలా బతుకుతాం.. సెటిల్ అయ్యాక పెండ్లి చేసుకుందామని అతని చెబితే.. ఎలాగైనా సరే పెండ్లి చేసుకుందామని ఒత్తిడి చేసింది. దీంతో విషయం వాట్సప్‌కాల్ ద్వారా ఉమర్ తన కుటుంబ సభ్యులు తల్లి సయ్యద్ అలియా మహబూబ్, చెల్లి ఫాతిమా, తన స్నేహితుడు హఫీజ్‌కు తెలిపాడు. వారు కూడా చందనతో మాట్లాడారు. రెండ్రోజుల తరువాత చందన తన ప్రియుడికి ఫోన్ చేసి ఇంట్లో బంగారం, డబ్బులు ఉన్నాయని, అవి తీసుకెళ్లి పెండ్లి చేసుకుని బతుకుదామని చెప్పింది. ఇంట్లో ఎవరూ లేని సమయం కోసం ఎదురుచూస్తున్న చందన గత నెల 28న తల్లిదండ్రులు హైదరాబాద్‌కు వెళ్తున్న విషయాన్ని ప్రియుడికి తెలిపింది. ఆ రోజు ఉదయం 11గంటలకు ఉమర్ కోరుట్లకు వచ్చాడు. చందన, ఆమె అక్క దీప్తితో కలిసి వొడ్కా తాగారు. కొంత సేపటికి ఉమర్ ప్లాన్‌లో భాగంగా బయటకు వెళ్లాడు. మద్యం మత్తులో దీప్తి పడుకోగానే.. చందన రాత్రి 2గంటల సమయంలో ఉమర్‌ను రమ్మని మెసేజ్ చేసింది. చందన ఇంటి వెనకాల నుంచి ఉమర్‌తో కలిసి బీరువాలోని బంగారు ఆభరణాలు, డబ్బులు సర్దుతుండగా అలికిడి అయింది. మెళకువ వచ్చిన దీప్తి 'నువ్వు ఏం చేస్తున్నావే' అంటూ అరుస్తూ అడ్డుకునే ప్రయత్నం చేసింది. దీంతో ఏం చేయాలో తోచక దీప్తి ముక్కు, మూతికి ప్లాస్టర్ వేసి, చేతులను చున్నీతో కట్టేశారు. ఊపిరి ఆడక దీప్తి చనిపోవడంతో ప్లాస్టర్ తీసి, కట్టు విప్పారు. 70తులాల బంగారు ఆభరణాలు, రూ.1.25లక్షలు తీసుకుని పారిపోయారు. మరుసటి రోజు 29న ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు విగతజీవిగా ఉన్న దీప్తిని చూసిన బోరున విలపించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే సమయంలో 'అక్క అతిగా మద్యం తాగి చనిపోయింది' అంటూ చందన వాయిస్ మెసేజ్ పెట్టి.. పోలీసులకు దొరక్కుండా ప్రియుడితో కలిసి పలుచోట్ల తిరిగింది.జగిత్యాల ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐదు పోలీసు బృందాలు విచారణ ప్రారంభించాయి. హత్య జరిగిన నాలుగు రోజుల తరువాత నమ్మదగిన సమాచారం మేరకు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుల జాడ తెలుసుకున్నారు.ముంబయి వెళ్లేందుకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్-బాల్కొండ రోడ్డులోని దాబాలో ఉన్న చందన, ఉమర్, అతని కుటుంబ సభ్యులు, స్నేహి తుడిని చాకచక్యంగా పట్టుకున్నారు. చందన(ఏ1), ఉమర్‌షేక్ సుల్తాన్(ఏ2), సయ్యద్ అలియా మహబూబ్(ఏ3), షేక్ ఆసియా ఫాతిమా (ఏ4), హఫీజ్(ఏ5)గా కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. 70తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష, సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు.కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి, కోరుట్ల సీఐ ప్రవీణ్ కుమార్, కోరుట్ల, మేడిపల్లి, కథలాపూర్ ఎస్ఐలు కిరణ్, చిరంజీవి, కిరణ్ కుమార్, సిబ్బందిని ఎస్పీ భాస్కర్ అభినందించారు.

8 మంది తో జమిలి ఎన్నికల కమిటీ..

న్యూఢిల్లీ : బీజేపీ ముందస్తు లోక్‌సభ ఎన్నికలకు వెళ్లే ఆలోచన చేస్తున్నదనే ప్రచారం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొన్నది. జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతత్వంలో శుక్రవారం ఓ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కాగా, 8 మంది సభ్యులతో శనివారం న్యాయశాఖ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం ఈ కమిటీలో కేంద్రమంత్రి అమిత్ షా, లోక్‌సభలో విపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి, గులాం నబీ ఆజాద్, 15వ ఆర్థిక సంఘం మాజీ చైర్మన్ ఎన్‌కే సింగ్, లోక్‌సభ మాజీ సెక్రెటరీ జనరల్ సుభాశ్ కశ్యప్, సీనియర్ లాయర్ హరీశ్ సాల్వే, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కొఠారి సభ్యులుగా ఉండనున్నారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు (వన్ నేషన్-వన్ ఎలక్షన్)'తో ఒకేసారి లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై కమిటీ అధ్యయనం చేస్తుందని ప్రభుత్వం తెలిపింది.

కొటాక్ మహీంద్రా బ్యాంక్ సిఇఒ రాజీనామా



న్యూఢిల్లీ : ప్రముఖ ప్రయివేటు రంగ విత్త సంస్థ కొటాక్ మహీంద్రా బ్యాంక్ సిఇఒ, మేనేజింగ్ డైరెక్టర్ హోదాలకు ఉదయ్ కొటక్ రాజీనామా చేశారు. శనివారం ఆయన తన రాజీనామాకు సంబంధించిన లేఖను సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. 2023 డిసెంబర్ వరకు ఆయన పదవీకాలం ఉన్నప్పటికీ ముందే ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే తాను సంస్థలో నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, ముఖ్య వాటాదారుగా కొనసాగనున్నట్లు వెల్లడించారు. తాత్కాలిక ఎండిగా ప్రస్తుత జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ గుప్తా వ్యవహరించనున్నారు. డిసెంబర్ వరకు తనకు గడువు ఉన్నప్పటికీ సులువుగా అధికార మార్పిడి జరగాలన్న ఉద్దేశంతో తాను స్వచ్ఛందంగా తప్పుకుంటున్నానని అన్నారు. 1985లో ఎన్‌బిఎఫ్‌సిని స్థాపించిన ఉదయ్ కోటక్.. 2003 నాటికి పూర్తి స్థాయి కమర్షియల్ బ్యాంక్ కార్యకలాపాల్లోకి మార్చారు. 2024 జనవరి 1 తర్వాత కొటక్ బ్యాంక్‌కు కొత్త సిఇఒ నియమతులు కానున్నారని ఆ వర్గాలు తెలిపాయి.

పాత ఇంజన్ల కోసం మొబిల్ డెల్వాక్ ఆయిల్

న్యూఢిల్లీ : ట్రక్కర్లకు మంచి నాణ్యత గల ఇంజన్ ఆయిల్‌ను ఎంపిక చేసుకోవటంలో సహాయపడటానికి మొబిల్ కొత్త క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. 'ట్రక్కింగ్ కష్టం.. ఇంజిన్ ఆయిల్ ఎంపిక చేయటం కాదు' అనే నినాదంతో ప్రచారం సాగనున్నట్లు పేర్కొంది. ట్రక్కులు వాటి వయస్సును బట్టి ఇంజనాయిల్‌ను సులభతరం చేయడంలో సహాయపడనున్నట్లు పేర్కొంది. ఇందుకోసం మొబిల్ డెల్వాక్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. దీన్ని పాత ఇంజన్‌ల కోసం డిజైన్ చేసినట్లు పేర్కొంది. దీంతో ఇంజన్ జీవితకాలం పెరగనుందని తెలిపింది.

ఫ్యూచర్‌స్కిల్స్ ప్రైమ్‌తో సర్వీసునౌ భాగస్వామ్యం

న్యూఢిల్లీ : నాస్కామ్ మీటీ కార్యక్రమం ఫ్యూచర్‌స్కిల్స్ ప్రైమ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు సర్వీస్‌నౌ వెల్లడించింది. దీంతో 2024 చివరి నాటికి పది లక్షల మందికి నైపుణ్యం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రముఖ డిజిటల్ వర్క్‌ఫ్లో కంపెనీ సర్వీస్‌నౌ ఇండియా వెల్లడించింది. భారతదేశం అంతటా 5,000 మంది అభ్యాసకులకు కొత్త డిజిటల్ నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొంది.

వేగంగా అభివద్ధి చెందుతున్న నెట్‌వర్క్‌లో అందుబాటులో ఉన్న రివార్డింగ్ కెరీర్‌లను నిర్మించడానికి ఈ భాగస్వామ్యం స్పష్టమైన మార్గాలను అందిస్తుందని తెలిపింది.

నగరంలో గార్మిన్ ఎక్స్‌పీరియన్స్ స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : గార్మిన్ ఇండియా నగరంలోని బంజారాహిల్స్ ప్రాంతంలో అతిపెద్ద ఇండియన్ ఎక్స్‌పీరియెన్స్ స్టోర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. పెరుగుతున్న వినియోగదారుల డిమాండ్ కు సేవలందించడానికి విస్తృత శ్రేణీ గార్మిన్ ఉత్పత్తులు, సేవలను పొందడం కోసం వినియోగదారులకు ఒక చక్కని అవకాశాన్ని అందించడమే తమ లక్ష్యమని గార్మిన్ ఏషియా రీజినల్ డైరెక్టర్ స్కై చెన్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై ఉలికిపాటెందుకు?

- మంత్రి ఈశ్వర్‌కు జీవన్‌రెడ్డి ప్రశ్న


నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఉలికిపాటెందుకు? అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే దళిత సంక్షేమం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ఉన్న ఊళ్ళో కాంగ్రెస్ ఓట్లు అడగబోదనీ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఉన్న ఊళ్ళో కేసీఆర్ ఓటు అడగాలని సవాల్ విసిరారు. దళితులకు భూములు పంచిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలదేనన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో కొత్తగా ఒక్కరికీ రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. దళితులకు పెరిగిన జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు.

వ్యవసాయ శాఖ మంత్రి ఎక్కడున్నారో తెలియదు : కోదండరెడ్డి, అన్వేష్‌రెడ్డి

కేసీఆర్ ఫామ్ హౌస్‌లో కేసీఆర్...విదేశాల్లో కేటీఆర్...కానీ వ్యవసాయ శాఖ మంత్రి ఎక్కడున్నారో తెలీయదని కిసాన్ కాంగ్రెస్ జాతీయ నేత కోదండరెడ్డి ఎద్దేవా చేశారు. వర్షాభావంతో రాష్ట్రంలో పంటలు ఆగమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్ నగర్ జిల్లాలో పరిస్థితి దయనీయంగా మారిందని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ అన్వేష్‌రెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం చెప్పటం వల్లే వరి, పత్తి పంటలు కాకుండా ఇతర పంటలు వేశారని తెలిపారు. పంటలు ఎండిపోతుంటే ఆలయాల్లో పూజలు చేయాలని చెప్పటం హాస్యస్పందమన్నారు.

కప్పరి కిషన్ సార్‌కు.. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఆర్ట్ టీచర్ అవార్డు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ జవహర్ బాలభవన్ సీనియర్ ఆర్ట్ ఇన్‌స్ట్రక్టర్ కప్పరి కిషన్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఆర్ట్ టీచర్ అవార్డుకు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 5న హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డును ఆయన అందుకోనున్నారు. 30 ఏండ్లుగా బాలభవన్‌లో అనేక మంది పిల్లలను ఆర్ట్ విభాగంలో తీర్చిదిద్దిన అనుభవం ఆయనది. ఆయన విద్యార్థులు చాలా మంది రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్న వారుండటం విశేషం. ప్రతి ఏడాది జనవరిలో, వేసవి సెలవుల శిబిరంలో విద్యార్థుల చేత గ్రీటింగ్ కార్డులు తయారు చేయించి ఎగ్జిబిషన్ పెట్టి ప్రోత్సహిస్తుంటారు. అదే విధంగా బోనాలు, సంక్రాంతి, దసరా తదితర పండుగలకు పోటీలు నిర్వహించి ఆర్ట్‌పై అవగాహన పెంచుతున్నారు. అదే విధంగా బాలభవన్ బయట జరిగే ఆర్ట్ పోటీల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తూ కిషన్ సార్ విద్యార్థులకు ఇష్టమైన సార్ అనిపించుకున్నారు. అవార్డుకు ఎంపికైన సందర్భంగా కిషన్ మాట్లాడుతూ, ఈ అవార్డు తనకు మరింత ఉత్సాహాన్నిస్తుందని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్ - మల్కాజిగిరి
ఆదివారం | సెప్టెంబర్ 03, 2023 | www.navatelangana.com

లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ డివిజన్‌కు చెందిన నిరుపేద కుటుంబాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు పడకల గదులను లబ్దిదారులకు కేటాయించి, ఇండ్ల పత్రాలను శనివారం అందజేశారు. సురారం కాలనీ లాస్ట్ బస్ స్టాప్ వద్ద డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులకు కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...డబుల్ బెడ్ రూమ్ రాలేదని ఎవ్వరూ బాధపడవద్దు రాబోయే విడతలో అందరికీ అందేలా చూస్తామని అన్నారు. కార్పొరేటర్ వెంట స్థానిక నాయకులు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.



పాలే శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపిన లబ్దిదారులు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేద ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకం కింద శనివారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని 130 డివిజన్ సుభాష్ నగర్‌కు చెందిన ఈ.కుమారికి మంత్రివర్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్, నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ వివేకానంద చేతుల మీదుగా అలాట్మెంట్ పత్రాన్ని అందజేశారు. లబ్దిదారులు మాట్లాడుతూ... మా జీవితంలో ఒక కలగా మిగిలిపోయినటు వంటి సొంత ఇండ్లు శనివారం కేసీఆర్ ప్రభుత్వం వలన మా కల నిజమైందని సంతోషం వ్యక్తం చేశారు. 130 డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డికి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు.



పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే 'డబుల్' ఇండ్లు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- బహదూర్‌పల్లిలో 'డబుల్' ఇండ్ల పంపిణీ



నవతెలంగాణ-సిటీబ్యూరో/కూకట్‌పల్లి/దుండిగల్/కేపీహెచ్‌బీ

పేదలు గొప్పగా, ఆత్మగౌరవంతో బతకాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం మేరకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి అర్హులకు ఉచితంగా అందజేస్తున్నదని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. శనివారం మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బహదూర్‌పల్లిలో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంత్రి శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు వివేక్, మాధవరం కృష్ణారావులతో కలిసి ప్రారంభించారు. ముందుగా కాలనీలో మంత్రి మొక్కలను నాటారు. బహదూర్ పల్లిలో 76.50 కోట్ల రూపాయల వ్యయంతో 900 ఇండ్లు, డీ పోచంపల్లిలో రూ.140 కోట్ల వ్యయంతో 1620, గాజుల రామారంలో రూ.11 కోట్ల వ్యయంతో 144 ఇండ్ల సముదాయాలను నిర్మించారు. సనత్ నగర్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, కంటోన్మెంట్ నియోజకవర్గాలకు చెందిన 1700 మంది లబ్ధిదారులకు ఇండ్లను కేటాయిస్తూ మంత్రి పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇల్లు కట్టి చూడు పెండ్లి చేసి చూడు అని మన పెద్దలు ఎప్పుడు చెబుతుంటారని, ఆ రెండు ఎంతో కష్టతరమైనవని అన్నారు. ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా పారదర్శకంగా ఆన్ లైన్ డ్రా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని వివరించారు. లబ్ధిదారులపై ఒక్క పైసా భారం పడకుండా ప్రభుత్వమే అన్ని వసతులతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి ఉచితంగా పంపిణీ చేస్తుందని చెప్పారు. ప్రభుత్వం నిర్మించిన ఇల్లు ఎంతో విశాలంగా 2 బెడ్ రూమ్‌లు, కిచెన్, హాల్, 2 టాయిలెట్స్ ఉన్నాయని చెప్పారు. దేశంలో ఇంత గొప్ప కార్యక్రమం ఎక్కడా లేదని అన్నారు. పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చాలనే సదుద్దేశంతో జీహెచ్ఎంసీ పరిధిలో 109 ప్రాంతాలలో 10 వేల కోట్ల రూపాయల వ్యయంతో లక్ష ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని, ఇందులో 73 ప్రాంతాలలో 69,532 ఇండ్ల నిర్మాణం పూర్తయిందని, మరో 36 ప్రాంతాలలో 30,468 ఇండ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని వివరించారు. మొదటి విడతలో రానివారు ఆందోళన చెందవద్దని, దశల వారిగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు ఇస్తామని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల మాటలు పట్టించుకోవద్దని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హౌసింగ్ సీ.ఇ. సురేష్, ఇ.ఇ. వెంకటదాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆనందం వ్యక్తం చేసిన లబ్దిదారులు

ఎన్నో సంవత్సరాల కోరిక సొంత ఇంటి కల నేడు నెరవేరడంతో లబ్దిదారులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇండ్ల కేటాయింపు పత్రాలను అందుకున్న పలువురు మహిళలు వేదికపైనే తమ సంతోషాన్ని వ్యక్త పరిచారు. ఒక్క రూపాయల ఖర్చు లేకుండా తమకు ఇల్లు ఉచితంగా నిర్మించి ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, తెలంగాణ ప్రభుత్వానికి కతజ్ఞతలు తెలిపారు.

పేదలను మోసం చేసిన కేసీఆర్ ప్రభుత్వం





- సీపీఐ, సీపీఐ(ఎం) కార్యదర్శులు ఉమా మహేష్, కీలుకాని లక్ష్మణ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/దుండిగల్

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం ఎదురుచూసిన పేదలను మోసం చేసిన కేసీఆర్ ప్రభుత్వం అని సీపీఐ,సీపీఐ(ఎం) నాయకులు అన్నారు. బహదూర్‌పల్లిలోని శనివారం డబుల్ బెడ్ రూమ్‌ల ఇండ్ల ప్రారంభోత్సవం సందర్భంగా దరఖాస్తు చేసుకున్న అన్నింటిని పరిశీలించకుండా హడావుడిగా కొంతమందికి మాత్రమే కేటాయించడాన్ని నిరసిస్తూ సీపీఐ, సీపీఐ(ఎం) నాయకులు డబుల్ బెడ్ రూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2 సార్లు ఎన్నికల్లో డబుల్ బెడ్ రూమ్ ఇస్తా అని చెప్పి ముచ్చటగా మూడోసారి ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజల దగ్గరకు ఓట్ల కోసం వెళ్ళినప్పుడు తిరగబడుతారని వేల మంది దరఖాస్తు చెలుకుంటే తూతుమంత్రంగా కేవలం 500 మందికి మాత్రమే ఇచ్చారన్నారు. మిగిలినవి దశలవారీగా అందజేస్తామని చెప్పడం పేదలను మోసం చేయడమేనని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను రాజకీయ ప్రచారం కోసం ఉపయోగించుకోవాలని చూస్తున్నరని తెలిపారు. స్థానికులకు డబుల్ బెడ్ రూమ్ కేటాయించ కుండా లాటరి పద్ధతిన డబుల్ బెడ్ రూములు కేటాయిస్తామని చెప్పి ఎవ్వరికి ఎలా కేటాయించారో చెప్పకుండా లబ్దిదారులను ఎంపిక చెయ్యడం సిగ్గుచేటని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి దరఖాస్తులను పరిశీలించకుండా హడావుడిగా కేటాయించడం కేవలం ఎన్నికల స్టంట్ అని ఎద్దేవా చేశారు. ఎన్ని జిమ్మిక్కులు చేసిన ఈ సారి ప్రజలు కచ్చితంగా ప్రజా వ్యతిరేక ఎన్నికల వాగ్దానాలను అమలు చేయలేని కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని, ఇప్పటికైనా నిజాయితీగా అందరికి రెండు పడక గదుల ఇండ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో దరఖాస్తు చేసుకున్న పేదలను సమీకరించి వామపక్షాల ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆందోళన చేస్తున్న సీపీఐ అబ్దుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, ఎం.మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్, బాచుపల్లి కార్యదర్శి పాలబిందాల శ్రీనివాస్, సీపీఐ(ఎం) మండల నాయకులు అంజయ్య, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు వి.శ్రీనివాస్, ఇమామ్, ప్రభాకర్‌లను పోలీసులు అరెస్టు చేసి దుండిగల్ పోలీస్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అన్ని డివిజన్‌లను అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే



నవతెలంగాణ-మల్కాజిగిరి

నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్‌లను అభివృద్ధి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శనివారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని రాజా శ్రీనివాస్ నగర్, న్యూ మధుసూదన్ నగర్ ఏరియాలలో రూ.8 లక్షలతో పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు, కార్పొరేటర్ మేకల సునీత రామూయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, జలమండలి జీఎం. సునీల్ కుమార్, మేనేజర్ నవీన్ కుమార్, సీనియర్ నాయకుడు మేకల రామూయాదవ్, నాయకులు కార్యకర్తలు కాలని వాసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్పొరేటర్ ఆఫీసు కార్యలయంలో ప్రణవ్ యాదవ్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు, కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

రాఘవేంద్రస్వామీ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ రాఘవేంద్ర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులుతో పాటు నాయ కులు మేకల రాము యాదవ్, బాబు, సత్యనారాయణ, సంపత్, పిట్ల శ్రీనివాస్, రంగా విజయ కుమార్ పాల్గొన్నారు.



మంత్రి మల్లారెడ్డిని కలిసిన టీఎన్జీవో నాయకులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉద్యోగుల జేఏసీ చైర్మెన్లు, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి అధ్యక్షులు రవి ప్రకాష్ అధ్యక్షతన రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డిని శనివారం కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ అధ్వర్యంలో నిర్వహించబోయే అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమావేశం, అనంతరం సూరారంలో నిర్వహించబోయే ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి మంత్రిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భరత్, అసోసియేట్ ప్రెసిడెంట్ శామ్యూల్ పాల్, వైస్ ప్రెసిడెంట్ శ్రీహరి, కోశాధికారి గిరికాంత్, ఈసీ మెంబర్ శ్రీచంద్, కలెక్టరేట్ యూనిట్ ప్రెసిడెంట్ జేమ్స్ దాస్, మల్కాజిగిరి యూనిట్ కార్యదర్శి రామచంద్రం, ఐసీడీఎస్ ఉద్యోగులు కె.సుజాత, టి.పద్మలత పాల్గొన్నారు.

బాక్స్ డ్రైన్ పనులను ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి సర్కిల్ ఓల్డ్ బోయినపల్లి 119 డివిజన్ పరిధిలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా ఉన్న మెయిన్ రోడ్డులో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో రూ.1కోటి 50 లక్షల వ్యయంతో చేపట్టారు. రెయిన్ వాటర్ బాక్స్ డ్రైన్ పనులను మల్లికార్జున్ కాలనీ నుండి సిండికేట్ బ్యాంక్ కాలనీ వరకు పూర్తి చేసిన సందర్భంగా శనివారం ఓల్డ్ బోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, జనరల్ సెక్రెటరీ హరినాథ్, మహిళా ప్రెసిడెంట్ లలిత, ఎస్సీ ప్రెసిడెంట్ బుర్రి యాదగిరి, మైనార్టీ ప్రెసిడెంట్ జాహంగీర్, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

డ్రయినేజీ పనులను ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిదిలోగల సిక్కుల బస్తీలో గతకొద్ది రోజులుగా డ్రయినేజీ సమస్యతో బస్తీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అట్టి సమస్యను స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి నూతన పైపు లైన్‌ను మంజూరు చేయించారు. ఈ మేరకు శనివారం నూతనంగా చేపట్టే భూగర్భ డ్రయినేజీ పనులను బాలానగర్ కార్పొరేటర్, స్థానిక కాలనీవాసులతో కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డ్రయినేజీ పనులలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ అనిల్ కుమార్, సిఖ్ బస్తీ అధ్యక్షులు అమర్ సింగ్, త్రిలోక్ సింగ్, మంగళ్ సింగ్, జస్పాల్ సింగ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు దేవులపల్లి కృష్ణమూర్తి తదితరులులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట



- కార్పొరేటర్ శ్రీనివాస రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదర్ నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని నందమూరి నగర్‌లో జరుగుతున్నటువంటి సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ పనుల నాణ్యత ప్రమాణాలను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సలహాలు సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామన్నారు. డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళలా ప్రజలకు అందుబాటులోకి ఉంటాన న్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు నాగ వర ప్రసాద్, అంజయ్య, కోటిరెడ్డి, శ్రీనివాస రావు, ప్రకాష్, వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్ పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్ఆర్



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు క్రిష్ణరాజ్ పుత్ అధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డా. వైయస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా పీసీసీ సభ్యులు డా.సత్యం శ్రీరంగం విగ్రహానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ దేశ చరిత్రలోనే సంక్షేమాన్ని సరికొత్తగా నిర్వచించి ప్రజల అవసరాలే పాలనకు ప్రధానాంశంగా కావాలని చాటి చెప్పిన వ్యక్తి వైఎస్ఆర్ అన్నారు. సమగ్రాభివృద్ధి వైపు రాష్ట్రాన్ని ఎలా పరుగెత్తించాలో దేశానికే చాటి చెప్పారని, అందుకే ఆ మహానేత భౌతికంగా దూరమై 14 ఏండ్లు గడిచినా ఇప్పటికి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిపోయారన్నారు. ఇన్నేండ్ల తర్వాత కూడా, ఆయన తెలుగు రాష్ట్రాల్లో ప్రతి గ్రామంలో కోట్ల మంది తెలుగు హృదయాల్లో అలాగే ఉండిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో తూము వేణు, ప్రకాష్ ముదిరాజ్, మహేష్ గౌడ్, నయీమ్, అక్బర్, బాలక్రిష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట: దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. శనివారం వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ గాజుల రామారం చౌరస్తాలోని వైఎస్ఆర్ విగ్రహానికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలుచోట్ల ఆయన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు , కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసినటువంటి సేవలను పేద మధ్యతరగతి ప్రజలు జీవితంలో మర్చిపోలేరని అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి నిరంతరం పాటుపడేవారని గుర్తు చేసుకున్నారు. వైయస్ అడుగుజాడల్లో నడిచినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు లాల్ మహమ్మద్ , బేకరీ గడ్డ ప్రెసిడెంట్ గఫర్, ఏ బ్లాక్ మహిళా వైస్ ప్రెసిడెంట్ ధనలక్ష్మి, నాయకులు శ్రీనివాస్ గౌడ్, రాజ్ కుమార్, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని బాలానగర్ డివిజన్‌లో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కొండకింది పుష్పారెడ్డి ఆధ్వర్యంలో బాలానగర్ డివిజన్ పరిధిలో డా.వైఎస్ఆర్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు టీపీసీసీ జాయింట్ సెక్రటరీ బండారి నవీన్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు మధు, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్నకుమార్, మేడ్చల్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మదన్ మోహన్, డివిజన్ జనరల్ సెక్రెటరీ మహేందర్, హేమంత్, ముత్యాలు, వెంకటేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.



పెన్షన్‌ల మంజూరుకు ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేస్తాం

- కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని ఏవీబీపురం కాలనీలో అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ కార్పొరేటర్ మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో, కాలనీలో అన్ని పనులను పూర్తి చేసుకున్నామన్నారు. అలాగే రోడ్డు నెం.3లో భూగర్భ డ్రయినేజీ పనులు కూడా మొదలు పెట్టామని పేర్కొన్నారు. త్వరలో రోడ్డు పనులు కూడా ప్రారంభిస్తామని, మంచినీటి లైన్ కూడా వేసాము అని తెలిపారు. కొంత మందికి పింఛన్లు మంజూరు చేయాలని కాలనీ వాసులు కోరడంతో, అధికారులకు వెంటనే సమాచారం తెలియజేసి ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేసి అర్హులైన వారికి పెన్షన్ పథకం అందేలా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దరసింఘ్ ఆదినారాయణ, రమణారావు, వాసు, సింహాద్రి,లక్ష్మణ , రాజు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



డి.ఎస్.పి నోటిఫికేషన్ విడుదల చేయాలంటూ ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో నిరసన దీక్ష

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి చౌరస్తాలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలంటూ శనివారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన దీక్షలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు , టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణాలోని నిరుద్యోగులను బీఆర్ఎస్ ప్రభుత్వం దగా చేసిందంటూ మండిపడ్డారు. హన్మంత్ రెడ్డి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ కోసం వేలాది మంది అభ్యర్థులు ఎదురు చూస్తున్నారని ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలంటూ డిమాండ్ చేశారు. ఉద్యోగాలను భర్తీ చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హన్మంత్ రెడ్డి విమర్శించారు. ఈ నిరసన దీక్షలో ఎన్ఎంసీ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, గోపాల్ రావు, గణేష్, అరుణ్‌తో పాటు కాంగ్రెస్ శ్రేణులు, పలువురు నిరుద్యోగులు పాల్గొన్నారు.



ఘనంగా నందికంటి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-మల్కాజిగిరి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ జన్మదిన వేడుకలు షికారి మల్లయ్య గార్డెన్‌లో కాంగ్రెస్ శ్రేణులు శనివారం నాడు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు అల్వాల్ , మల్కాజిగిరి కార్యకర్తలు బైక్ ర్యాలీ 300 మందితో నేరేడ్‌మేట్ ఎక్స్ రోడ్డు మీదుగా మల్కాజిగిరి చౌరస్తాకి చేరుకొని చౌరస్తాలో ఏర్పాటు చేసిన కేక్‌ను శ్రీధర్ కట్ చేశారు. అనంతరం షికారి మల్లయ్య గార్డెన్‌లో పెద్ద ఎత్తున జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీని అధికారంలోకి తీసుకవచ్చేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో హరి వర్ధన్ రెడ్డి, వజ్రేష్ యాదవ్, బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, వాసగోని శ్రీనివాస్ గౌడ్ , గుత్తి రాంచందర్, వినోద్ యాదవ్, మహమ్మద్ అలీ, సానాది శంకర్, సంతోష్ ముదిరాజ్, ఉమేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జీడీ శ్రీనివాస్‌కు శ్రద్ధాంజలి



సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జీడి శ్రీనివాస్ గౌడ్ గుండెపోటుతో ఈరోజు మధ్యాహ్నం మరణించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కోరుకున్నారు.

మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యకులు నందికంటి శ్రీధర్ వారి నివాసంలో ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ నాయకురాలు కందాడి జ్యోత్స్న శివారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.
నవతెలంగాణ-బాలానగర్





జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో.... నియోజకవర్గం ఇన్‌చార్జి నందగిరి సతీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్ పాల్గొన్నారు. సూరారం, షాపూర్, జగద్గిరిగుట్టలో పార్టీ జెండా ఎగరేసి కేక్ కట్ చేసుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,వీర మహిళలు భారీగా పాల్గొన్నారు.
నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

వీఓఏలకు ఓటు హక్కుపై అవగాహన



నవతెలంగాణ-సిటీబ్యూరో
స్వీప్ అవగాహనలో భాగంగా శనివారం మండల సమాఖ్య శామీర్‌పేటలో వీఓఏలకు ఓటు హక్కుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం శీలం ప్రభాకర్ మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన విద్యార్థిని, విద్యార్థులందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటును మొబైల్ యాప్, ఆన్‌లైన్ లో నమోదు చేయించాలని వీఓఏలకు సూచించారు. ఓటు హక్కు పొందిన వారందరూ వారి వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఎంలు, సీసీఎస్‌లు, వీఓఏలు పాల్గొన్నారు.

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ జన్మదిన సంబరాలు



నవతెలంగాణ-కాప్రా
పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ జన్మదిన సంబరాలు ఈసీఐఎల్ ఎక్స్ రోడ్ లో కేక్ కటింగ్, మౌలాలి హౌసింగ్ బోర్డ్ లో రక్తదాన శిబిరం నిర్వహించి ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా లయన్ రెడ్డి శ్రీనివాస్ రావు హాజరైనారు.జనసైనికులు వీర మహిళలు బైక్ ర్యాలీని డాక్టర్ ఏ.ఎస్.రావు నగర్ గ్రౌండ్ నుంచి మౌలాలి హౌసింగ్ బోర్డ్ వరకు నిర్వహించారు. 15 కేజీల కేక్‌ను జయరాం ప్రసాద్ స్పాన్సర్ చేశారు. రోడ్ నెంబర్ ఫైవ్ కష్ణానగర్ మౌలాలి హౌసింగ్ బోర్డ్ లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 150 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో దాసరి ప్రసాద్ ఉప్పల్ ఇన్‌చార్జ్ నిహారిక నాయుడు ,కొల్లు నరేష్ నాయుడు, రామకష్ణ, సూర్య శివ కార్తీక్, సంతోష్, పాపులర్ శ్రీనివాస్ , జన సైనికులు వీర మహిళలు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ నీడ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- అహ్మద్‌గూడలో 'డబుల్' ఇండ్లు పంపిణీ





నవతెలంగాణ-సిటీబ్యూరో
రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించి, అర్హులైన నిరుపేదలందరికీ నీడ కల్పిస్తుందని, ఈ ఇండ్లను పారదర్శకంగా కేటాయిస్తున్నట్టు రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉన్న అహ్మద్‌గూడలో శనివారం ముషీరాబాద్, మల్కాజిగిరి, సికింద్రాబాద్ నియోజకవర్గాలకు సంబంధించి నియోజకవర్గానికి 500 మంది చొప్పున 4,428 ఇండ్లకుగాను 1,500 ఇండ్లను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆధ్వర్యంలో లబ్దిదారులకు అలాట్‌మెంట్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ అన్ని వసతులతో ఇండ్లను కట్టించి పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఇలాంటివి దేశంలో ఎక్కడా లేవన్నారు. పారదర్శకంగా ఈ ఇండ్లను కేటాయించినట్టు చెప్పారు. ఇందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించినట్టు తెలిపారు. మూడు నియోజకవర్గాల్లో మొదటి విడతలో 1,500 మంది లబ్దిదారులకు అందజేసినట్టు చెప్పారు. మిగిలిన లబ్దిదారులకు రెండు, మూడో, నాలుగో దశల్లో అందజేస్తామని చెప్పారు. ఇది నిరంతర ప్రక్రియ అని, అర్హులందరికీ అందజేస్తామన్నారు. ఇండ్లు రాని వారు ఆందోళన చెందవద్దని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లను కేటాయిస్తామన్నారు. గడిచిన తొమ్మిదేండ్లుగా సీఎం కేసీఆర్ మహిళలకు ఎన్నో రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్టు చెప్పారు. దేశంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తోందని, ఇందులో మంత్రి కేటీఆర్ కృషి ఎంతో ఉందన్నారు. ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీలో 9 లక్షల మంది హైదరాబాద్‌లోనే ఉద్యోగాలు చేస్తున్నారని, ఇది మంత్రి కేటీఆర్ కషికి నిదర్శమన్నారు. పేద విద్యార్థులకు గురుకుల పాఠశాలల ద్వారా ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.1.25 లక్షలు వెచ్చిస్తూ ఉన్నత చదువులు చదివిస్తోందన్నారు. తెలంగాణలోని పథకాలను వేరే రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని, ఇది ఎంతో గర్వకారణమన్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టే ప్రతి కార్యక్రమం ఎంతో గొప్పదన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీ యజ్ఞంలా ముందుకు సాగుతోం దన్నారు. ఇండ్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయాలు, పైరవీలకు తావులేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మెన్ దయాకర్ రెడ్డి, జవహర్ నగర్ మేయర్ మేకల కావ్య, దమ్మాయిగూడ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ప్రణీత గౌడ్, వైస్ చైర్మెన్ నరేందర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, ఆర్డీవో రాజేష్ కుమార్, ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాంటినెంటల్ హాస్పిటల్స్ మరో మైలురాయి

- అంతర్జాతీయ ముఖ-అంగవైకల్య చికిత్స విభాగం ప్రారంభం





నవతెలంగాణ-సిటీబ్యూరో
యూఎస్ఏలో దశాబ్దాలుగా పనిచేసిన సుప్రసిద్ధ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి నేతృత్వంలో 2014 నుంచి వైద్యరంగంలో నాణ్యమైన సేవలను అందిస్తోన్న కాంటినెంటల్ హాస్పిటల్స్, ఇప్పుడు మరో ముందడుగు వేసింది. గచ్చిబౌలిలో 'ఇంటర్నేషనల్ ఫెసియల్ ఎస్తెటిక్ అండ్ క్రానియోఫేషియల్ సెంటర్'ను ప్రారంభించింది. పుట్టుకతో వచ్చే వైకల్యాలు, జీవితంలో అనుకోకుండా సంభవించే ప్రమాదాల కారణంగా, ముఖంలో ఏర్పడ్డ అంగవైకల్యాలను పూర్తిగా నయం చేసి.. వారి ముఖంపై అందమైన చిరునవ్వును తిరిగి ఇవ్వడమే కాంటినెంటల్ హాస్పిటల్స్ క్రానియో ఫేషియల్ (ముఖ-అంగవైకల్యం) సెంటర్ ప్రధాన ఉద్దేశ్యం.

ముఖ-అంగవైకల్యంతో బాధపడేవారు.. సమాజంతో కలువడానికి నిరాకరించి, ఒంటరిగా జీవిస్తూ నరకం అనుభవిస్తుంటారు. అలాంటి వారందరి జీవితాల్లో వెలుగులు నింపాలనే సత్సంకల్పంతో డాక్టర్ గురు ఎన్ రెడ్డి ఈ అంతర్జాతీయ క్రానియో ఫేషియల్ సెంటర్‌ను ప్రారంభించారు. మంచి లక్ష్యంతో ఏర్పాటైన ఈ పనికి.. అంతే మంచి మనసున్న, సమాజసేవ చేస్తున్న, ఆ వృత్తిలో 30 ఏండ్ల అనుభవం ఉన్న డాక్టర్ శ్రీనివాస్ గోస్లా రెడ్డిని డైరెక్టర్‌గా నియమించి, తన సంకల్ప లక్ష్యాన్ని తెలియజేశారు డాక్టర్ గురు ఎన్ రెడ్డి. ఫేస్ ట్రాన్స్ ఫర్ మేషన్ అండ్ ఫేస్ డిజైనింగ్ సర్జన్స్‌లో హైదరాబాద్‌లో ఉన్న ఏకైక క్రానియో ఫేషియల్ సర్జన్.. డాక్టర్ శ్రీనివాస్ గోస్లా రెడ్డి. 30 ఏండ్ల ఈ వృత్తిలో శ్రీనివాస్ గోస్లా రెడ్డి చాలా ప్రయోగాలు చేశారు. 1996 నుంచి 40 వేలకు పైగా ముఖ-అంగవైకల్య ఆపరేషన్స్ చేసి రికార్డు సష్టించారు. తమ గురువు ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్రనాథ్‌తో కలిసి దేశ విదేశాల నుంచి వచ్చిన వేలమంది డాక్టర్లకు ఈ సర్జరీలో ట్రెనింగ్ ఇచ్చారు. సామాజిక స్పృహతో ఎంతోమంది పేదలకు ఉచితంగా వైద్య చికిత్సలందించిన డాక్టర్ శ్రీనివాస్ గోస్లా రెడ్డి.. కాంటినెంటల్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ గురు ఎన్ రెడ్డి కోరిక మేరకు, ఈ అంతర్జాతీయ క్రానియో ఫేషియల్ సెంటర్‌కి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

అత్యాధునిక సాంకేతిక వైద్యానికి మారుపేరుగా నిలిచే కాంటినెంటల్ హాస్పిటల్స్..

కొత్తగా ఏర్పాటు చేసిన ఈ క్రానియో ఫేషియల్ సెంటర్‌లో మరింత అధునాతనమైన ఎక్విప్‌మెంట్‌ను, అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన, నిపుణులైన కాస్మొటిక్ డెర్మటాలజిస్ట్, ప్లాస్టిక్ సర్జన్స్, కాస్మొటిక్ డెంటల్ సర్జన్స్, ఈఎన్‌టీ సర్జన్స్, ఇంకా ఆయా రంగాల్లో నిష్ణాతులైన అనుభవజ్ఞులైన డాక్టర్స్‌తో కూడిన ఒక ప్రత్యేక బృందాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. వీరందరితో కలిసి ఫేస్ రీడిజైన్ అండ్ ట్రాన్స్ఫర్మేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. కాంటినెంటల్ అంతర్జాతీయ ఫెసియల్ ఎస్తెటిక్ అండ్ క్రానియోఫేషియల్ సెంటర్.

గిరిజన బంధు వెంటనే అమలు చేయాలి



- గిరిజన సమాఖ్య డిమాండ్

నవతెలంగాణ-జవహర్ నగర్
రాష్ట్రంలో దాదాపు 40 లక్షల జనాభా కలిగిన ఆదివాసి గిరిజనులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని.. కాని అవి అమలుకు నోచుకోలేదని గిరిజన సమాఖ్య నాయకులు అన్నారు. శనివారం జవహర్ నగర్‌లోని అంబేద్కర్ విగ్రహనికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈసారి ప్రభుత్వానికి గిరిజన ఓట్లతో గుణపాఠం చెప్పాలని గిరిజన సమాఖ్య భవిష్యత్ కార్యాచరణకు పూనుకున్నదన్నారు. దళితుల మాదిరిగా గిరిజనులకు రూ.10 లక్షలుగిరిజన బంధు ఇస్తానని 2022 సెప్టెంబర్ 17వ తేదీన హైదరాబాద్ లో గిరిజన భవనాల ప్రారంభోత్సవ ఆత్మీయ బహిరంగ సభలోనే ముఖ్యమంత్రి చెప్పారని.. కాని ఆ విషయాన్ని మరిచారన్నారు. వెంటనే గిరిజన బంధు అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీకేఏంయూ జిల్లా కార్యదర్శి తోటపెళ్లి శంఖర్, బీకేఎంయు జిల్లా కార్యదర్శి, అజ్మీరా రామ్మూర్తి రాష్ట్ర అధ్యక్షులు రామావత్ అంజయ్య నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. స్వరూప, జిల్లా కార్యదర్శి దర్శనం యాదగిరి, కాప్రా మండల కార్యదర్శి రవి నాయక్, కీసర మండల కార్యదర్శి తదితరులు ఉన్నారు.



ఆరోగ్య తెలంగాణే సీఎం కేసీఆర్ విజన్

- కార్పొరేటర్ బల్లి రోజా శ్రీనివాస్

నవతెలంగాణ-జవహర్‌నగర్
ఆరోగ్య తెలంగాణానే సీఎం కేసీఆర్ విజన్ అని, 9 ఏండ్లలోనే ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మారిపోయాయని, పేదలకు సీఎంఆర్ఎఫ్ వరంలాంటిది అని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ కార్పొరేటర్ బల్లి రోజా శ్రీనివాస్ అన్నారు మంత్రి చామ కూర మల్లారెడ్డి సహకారంతో సంతోష్ కుమార్, నాగరాజు కు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్ఎఫ్ రూ. 33 వేలు, రూ. 30 వేల చెక్కులను కార్పొరేటర్ కార్యాలయంలో శనివారం అందజేశారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జవహర్ నగర్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దులు యాదవ్, జవహర్ నగర్ బీసీ సెల్ అధ్యక్షుడు మూల సోమయ్య గౌడ్, జవహర్ నగర్ వైస్ ప్రెసిడెంట్ శగాంటి వెంకటేష్, ఎన్టీఆర్ కాలనీ ప్రెసిడెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

అన్నా చెల్లెళ్లకు సత్వర న్యాయం కల్పించిన న్యాయ సేవాధికార సంస్థ



నవతెలంగాణ-కాప్రా
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు భవన సముదాయంలో జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా మల్కాజిగిరి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, చైర్మెన్ బి.ఆర్ మధుసూదన్ రావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రీ లోక్ అదాలత్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలాలి హౌసింగ్ బోర్డుకు చెందిన వాసావత్తుల వెంకటేశ్వర్ రావుపై ఏప్రిల్ నెలలో తమకు రావాల్సిన వాట కావాలంటూ లాలపేటలో నివాసం ఉంటున్న తాడేటి ఉదయేశ్వరి, కీసర మండలం నాగారంలో నివాసం ఉంటున్న ఆవుపాటి పుష్ప కుమారి లు వేసిన కేసు విషయంలో నేడు జిల్లా సివిల్ న్యాయమూర్తి, సెక్రటరీ జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ డి.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో రాజీ కుదుర్చుకుని సత్వర న్యాయం పొందారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తుల సమక్షంలో రాజీ కుదుర్చుకుని తన అన్నకు ఇద్దరు చెల్లెళ్ళు రాఖీ కట్టి సంతోషం వ్యక్తం చేశారు. ఇదే విధంగా కక్షిదారులు తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాల్సిందిగా జిల్లా న్యాయ సేవదికార సంస్థ తెలిపింది.

అద్భుతమైన పనితీరుతోనే ఆర్టీసీకి అధిక లాభాలు

- చెంగిచర్ల డిపో మేనేజర్ కే కవిత



నవతెలంగాణ-బోడుప్పల్
ప్రయాణికులకు విశిష్ట సేవలను అందించినప్పుడే అధిక లాభాలు వస్తాయని ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే కవిత తెలిపారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో రాఖీ పౌర్ణమి సందర్భంగా రోజు రావాల్సిన ఆదాయం కన్నా రూ. 6 లక్షలు ఎక్కువ రావటంతో డిపో ఉద్యోగులతో కలిసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు పేరు పేరున శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ రాఖీ పండుగ రోజున ఆడపడుచులు రాఖీలు కట్టేందుకు వెళ్తున్న సమయంలో ఆర్టీసీ ఉద్యోగులు ఉద్యోగ నిర్వహణతో పాటు సేవా గుణాన్ని చాటి చెప్పారని తెలిపారు. దీంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడంతో ఎక్కువ లాభాలు వచ్చాన్నారు. తెలంగాణ ఆర్టీసీ లో రాఖీ పౌర్ణమి పండుగ రోజున రూ. 22.65 కోట్ల ఆదాయం రావడంతో ఎండీ సజ్జనారు ఆర్టీసీ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంపిణీ చేయాలని సూచించినట్టు తెలిపారు. ఉద్యోగుల అద్భుతమైన పనితీరుతోనే అత్యధిక లాభాలను సాధించినట్టు ఆమె చెప్పారు. మరింత కష్టపడి సంస్థను నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకు వచ్చేందుకు నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) అనంద్‌రావు, డిప్యూటీ సూపరింటెండెంట్(పర్సనల్) సత్యన్, సూపరింటెంట్ (ఫైనాన్స్) అశోక్ కుమార్, డ్రైవర్ కండక్టర్లు, మెకానిక్ లు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా చిన్న చెరువు

- ఐద్వా నాయకురాలు పల్లవి



నవతెలంగాణ-ఉప్పల్
ఉప్పల్ సర్కిల్ రామంతపూర్‌లోని చిన్న చెరువు మందుబాబులకు అడ్డాగా మారిందని ఐద్వా నాయకురాలు పల్లవి అన్నారు శనివారం రామంతపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రామాంతపూర్ నందు ఎక్కడా గ్రౌండ్ లేకపోవడంతో స్థానికులు క్రికెట్, వాలీబాల్ వాకింగ్ కోసం, అలాగే ప్రభుత్వం చిన్న చెరువు ప్రాంగణంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో ప్రజలు వ్యాయామం చేసుకునేందుకు అక్కడకు వస్తుంటారని తెలిపారు.అయితే రోజూ అక్కడ సాయంత్రం అయితే మందుబాబుల బెడద ఎక్కువగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. చాలామంది మహిళలు మందుబాబులకు భయపడి రావడం మానేశారని తెలిపారు. పాలకులు సుందరీకరణ పేరుతో ఎన్ని మాటలు చెప్పినా అభివద్ధి మాత్రం కుంటుబడిపోయిందన్నారు. పాలకులు ఇప్పటికైనా చిన్న చెరువు నందు వాకింగ్ ట్రాక్ పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టి చెరువును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. చిన్న చెరువులో అసాంఘిక కార్యకలాపాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు లేకపోతే ఐద్వా ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

మేడ్చల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బరిలో పాతూరి సుధాకర్ రెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్
రాష్ట్ర శాసనసభకు పోటీ చేసే బీజేపీ నాయకులను దరఖాస్తు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం కోరడం పట్ల బీజేపీ రాష్ట్ర నాయకుడు పాతూరి సుధాకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రంగంలో ఉంటానని తెలియజేశారు. ఈ నెల 4న బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకోనున్నట్టు వెల్లడించారు. మేడ్చల్ పట్టణ,పరిసరాల గ్రామాల్లో 1980 నుంచి ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ,విశ్వహిందూ పరిషత్,బీఎంఎస్ విస్తరణకు కషి చేయడం జరిగిందని చెప్పారు. 1983లో మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన నిరంజన్ యాదవ్ విస్తతంగా పనిచేయడం జరిగిందని పేర్కొన్నారు. 1989 నుండి ప్రారంభమైన అయోధ్య ఉద్యమంలో విస్తతంగా పాల్గొంటూ 1992లో అయోధ్యలో జరిగిన కర సేవకుల ప్రదర్శనలో పాల్గొన్నట్టు తెలిపారు. 2001 నుండి 2014వరకు జరిగిన తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేసినట్టు పేర్కొన్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే ఉత్తర తెలంగాణ ముఖద్వారం నిజాం కాలం నుండి చారిత్రాత్మకమైన మేడ్చల్ ప్రాంతాన్ని మేడ్చల్ జిల్లాగా చేయాలని మేడ్చల్ జిల్లా సాధన సమితిని ఏర్పాటు చేసి అన్ని రాజకీయ పార్టీలు,ప్రజా ప్రతినిధులు,సామాజిక సంస్థలను కలుపుకొని వినతి పత్రాలు,రాస్తారోకోలు,ధర్నాలు నిరసన దీక్షలు,అమర నిరాహార దీక్ష చేసి అందరి సహకారంతో మేడ్చల్ జిల్లా సాధించడం జరిగిందని అన్నారు. 43సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం, సామాజిక సేవాభావం కలిగిన తనను బీజేపీ ఎమ్మెల్యేగా అభ్యర్థిగా ప్రకటించాలని రాష్ట్ర నాయకత్వాన్ని కోరారు.

వైఎస్ రాజశేఖర్ రెడ్డికి నివాళులు



నవతెలంగాణ-శామీర్‌పేట
మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా తూముకుంట మున్సిపాల్టీ పరిధిలోని దేవరయాంజాల్‌లో కాంగ్రెస్ పార్టీ మున్సిపాల్టీ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తూంకుంట మున్సిపల్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్, రైతుల రుణాలు మాఫీ, ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి రైతులకు లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత వైఎస్ దేనని, రాజీవ్ ఆరోగ్య శ్రీ ప్రవేశ పెట్టి పేద ప్రజలు కార్పొరేట్ వైద్యం ,108,104 వాహనలు ప్రవేశ పెట్టి రోడ్ల మీద ఆక్సిడేంట్ అయిన వారిని ఎంతో మంది ప్రాణలు కాపాడురని, నిరుపేదలకు లక్షలాది మందికి ఇందిరమ్మ ఇండ్లు ,మహిళలకు పావల వడ్డీ రుణాలు ,మహిళలకు స్థానిక సంస్థలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించారని పేర్కొన్నారు. తూంకుంట మున్సిపల్ 4 వ వార్డు కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, దేవరయాంజాల్ మాజీ ఉప సర్పంచ్ తిరుపతి శంకర్ గౌడ్, కాంగ్రెస్ తూముకుంట మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు వలందాస్ మురళి గౌడ్,చీరాల యాదగిరి,కందాల రాము,మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి తిగుళ్ల మురళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కుషాయిగూడ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి దయవల్ల ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆ భగవంతుని కోరుతున్నట్టు తెలిపారు. అలయ కమిటీ సభ్యులు,నాయకులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-కాప్రా

ఇండ్ల కోసం పత్తి కుమార్ ధర్నా.. అరెస్టు



నవతెలంగాణ-కాప్రా
కాప్రా డివిజన్‌లో కట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్లను డివిజన్‌కు చెందిన పేదలకే ఇవ్వాలని కాప్రా డివిజన్ కంటెస్టడ్ కార్పొరేటర్ మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం చైర్మెన్ పత్తి కుమార్ ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, జగదీష్, సుమన్, సందీప్ గౌడ్, నర్సింహ, రాము, విజయ్, రామలింగం, పెద్ద యెత్తున మహిళలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

స్థానికులను నిరాశపరిచిన 'డబుల్' ఇండ్ల కేటాయింపులు..!

- కాప్రా డివిజన్‌లో నిరాశతో పేదలు

నవతెలంగాణ-కాప్రా
ఉప్పల్ నియోజకవర్గం కాప్రా డివిజన్లోని సాయిరాం నగర్ కాలనీలో పంపిణీ చేసిన డబుల్ బెడ్ రూమ్ లలో స్థానికులకు ,పక్క డివిజన్ వారికి ఒక్కరికి కూడా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ డబుల్ బెడ్రూంల గురించి ఎంక్వయిరీ కూడా చేయలేదని చాలామంది చెప్పడం చెబుతున్నారు. ఈ ఏరియాలో డబుల్ బెడ్రూం లు కట్టి ఇక్కడ వారికి కేటాయించకుండా బయటి వారికి కేటాయించడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ ఇండ్లు కట్టినప్పటి నుంచి చాలామంది వాటిపై ఆశ పెట్టుకొని ఉన్నారు కానీ ఈరోజు ఎక్కడో ఉన్నవారికి ఇక్కడ ఇల్లు కేటాయించి ఇక్కడివారిని పట్టించుకోకపోవడం ఎంతవరకు న్యాయమని వారు నిలదీస్తున్నారు.

పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఎన్ఐసి సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన రాండో మైజేషన్ సాఫ్ట్వేర్ ద్వారా ఆన్‌లైన్‌లో డ్రా నిర్వహించారు. నియోజకవర్గం యూనిట్ గా తీసుకున్నప్పుడు ఆ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల వారికి సమన్యాయం దక్కినట్టు చేస్తే బాగుండేది కదా అని పలువురు అంటున్నారు. ఉదాహరణకు ఉప్పల్ నియోజకవర్గంలో 10 డివిజన్లు ఉన్నాయి. ఒక్కొక్క డివిజన్ కు 50 మందికి వచ్చేటట్టు చేస్తే బాగుండేదని.. అలా కాకుండా ఒక సైడ్ ఏరియా వారికి 300 ఇండ్లు కేటాయించడం ఎంతవరకు సమంజసం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కనీసం రెండో విడతలోనైనా డివిజన్ 1, 2, 3, 4 వారికి న్యాయం చేయగలరని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం ఎంక్వయిరీ చేయమంటే ఎక్కడో కూర్చుని ఎంక్వయిరీ చేసేవారు కాకుండా నిజంగా పేదవారిని గుర్తించి ఎంక్వయిరీ చేసే వాళ్లను ఈ కార్యక్రమానికి నియమించాలని కోరుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఆశగా ఎదురు చూస్తున్న పేదవారికి మాత్రం ఈ కేటాయింపులు చాలా నిరాశను మిగిల్చాయని తెలుస్తోంది.

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి

- డిప్యూటీ స్పీకర్ పద్మారావు
- ప్రతాప సింగారంలో 'డబుల్' ఇండ్ల పంపిణీ



నవతెలంగాణ -ఘట్కేసర్
రాష్ట్రంలో ప్రజలందరు ఆనందంగా ఉండి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి మూడోసారి అవకాశం కల్పించాలని డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. ఘట్కేసర్ మండల పరిధి ప్రతాపసింగారంలో శనివారం డీప్యూటి స్పీకర్ పద్మారావు, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో డబుల్ బెడ్రూంల ఇండ్లను ప్రారంభించారు. అనంతరం పద్మారావు మాట్లాడుతూ ప్రభుత్వం బడుగు బలహీనవర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో ప్రజలందరూ సంతోషంగా ఉండి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి మూడోసారి అధికారం ఇవ్వాలని కోరారు. గతంలో ఇల్లు లేకపోతే పిల్లను ఇచ్చే ప్రసక్తి లేదని. కాని ప్రస్తుతం సీఎం కేసీఆర్ ఇండ్లు మంజూరు చేయడంతో పిలిచి పిల్లను ఇచ్చే స్టేజ్ వరకు చేరుకున్నామన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు చాలగొప్పవని కొనియాడారు. ఎల్బీ నగర్, అంబర్‌పేట్ నియోజకవర్గంలో వెయ్యి మంది లబ్దిదారులకు డబుల్ బెడ్ రూంల ఇండ్లను, ప్రతాప సింగారంలో ఇచ్చినట్టు తెలిపారు. ఎమ్మెల్యే వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను చూసి ప్రజలు కేసీఆర్‌ను మరోసారి సీఎం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఐదు విడతలలో డబుల్ బెడ్ రూమ్‌ల ఇండ్ల పంపిణీ ప్రక్రియ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీచైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, మల్కాజిగిరి ఏసీపీ నరేష్ రెడ్డి, తహసీల్దారు కష్ణ ఎంపీడీవో అరుణ, స్థానిక సర్పంచ్ శివశంకర్, ఉపసర్పంచ్ అబేదాబేగం, జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

ఘట్కేసర్ మండల ఎంపీపీ నిరసన



డబుల్ బెడ్రూం ఇండ్లను స్థానికులకు కేటాయించిన తరువాతే లబ్దిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఘట్కేసర్ మండల ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ డబుల్ బెడ్ రూంల ప్రారంభోత్సవ కార్యక్రమంలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. స్థానికులకు ఇవ్వకుండ ఇతర ప్రాంతాల వారికి ఇండ్లు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. దీంతో పోలీసులు చేరుకొని ఎంపీపీని అదుపులోకి తీసుకొని మేడిపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

లోక్ అదాలత్‌లో
పెండింగ్ కేసులు పరిష్కరించుకోవాలి

చార్మినార్ అబ్కారీ ఇన్‌స్పెక్టర్ షాదిక్ అలీ

నవతెలంగాణ - ధూల్ పేట్

చార్మినార్ అబ్కారీ(ఎక్సయిజ్, ప్రోహిబిషన్) స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల కేసులను జాతీయ మెగా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని చార్మినార్ అబ్కారీ ఇన్‌స్పెక్టర్ షాదిక్ అలీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ వరకు మెగా లోక్ అదాలత్ నిర్వహించబడుతుందన్నారు. అక్రమంగా లిక్కర్ దుకాణాలు కొనసాగించడం, అక్రమంగా మద్యం తరలించడం, అమ్మకాలు చేయడం, వివిధ ఎక్సైజ్ కేసులకు సంబంధించిన వ్యక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు

డాక్టర్ జహీదా బేగంకు అభినందనలు



నవతెలంగాణ - హయత్ నగర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్ రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జహీదా బేగం ప్రతిష్టాత్మకమైన గిన్నిస్ రికార్డులో చోట సాధించింది. ఈ మేరకు కళాశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్స్ డాక్టర్ యాదగిరి, డాక్టర్ రాజేంద్ర సింగ్‌లు శనివారం జహీదా బేగంకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. తమిళనాడులోని ఈఎస్ఎన్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో 10మంది రచయితలతో కలిసి 200 ఆర్టికల్స్ తో 1,000,100 పేజీలతో ప్రపంచంలోనే అతిపెద్ద గ్రంథం 'షీ ఫర్ హర్ సెల్ఫ్' ను రూపొందించారు. ఈ గ్రంథానికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు లభించింది. దీంతో ఈ గ్రంథానికి పుస్తక రచయితగా, సంపాదకురాలిగా ఉన్న డాక్టర్ జహీదా బేగంకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుండి ప్రత్యేకంగా ప్రశంసా పత్రం, గిన్నిస్ రికార్డ్ అఫీషియల్ సర్టిఫికెట్ దక్కింది. అభినందనలు తెలియజేసిన వారిలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్యోత్స్న ప్రభ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. శ్రీనివాస్ రెడ్డి, ఐక్యుఏసి కో ఆర్డినేటర్ డాక్టర్ ఇంతియాజుద్దీన్ ఫారూఖీ ఇతర అధ్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

పేదోళ్లకు డబుల్ బెడ్ రూం ఇండ్లు

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-ఎల్బీనగర్

విమర్శలకు తావులేకుండా ఆధునిక సాంకేతికను ఉపయోగించడం వలన నిజమైన పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు దక్కాయని ఎల్బీనగర్ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో శనివారం లబ్దిదారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. 15రోజుల్లో రెండోవ ఫేస్ పంపిణీ ఉందని..దశల వారీగా అందరికీ కేటాయింపు జరుగుతుందన్నారు. విపక్షాలవి అర్థం లేని



ఆరోపణలు అని తోసిపుచ్చారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో మొదటి విడతగా 500 మందిని డబుల్ బెడ్ రూమ్స్ ఇండ్ల లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారన్నారు. దానిలో భాగంగా లబ్దిదారులకు ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో వారికి మంజూరైన ప్రతాప్ సింగారం వరకు వెళ్లడానికి బస్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గానికి దాదాపు 4752 ఇండ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా తెలంగాణ ప్రభుత్వం పేదలకు నీడ కల్పించేందుకు డబుల్ బెడ్ రూం ఇండ్లతో పాటు సొంత స్థలం వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.మూడు లక్షలు అందిస్తుందని చెప్పారు. బల్దియా పరిధిలో అర్హులైన పేదలకు విడతల వారీగా ఇండ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, ఎల్బీనగర్ సర్కిల్ల డిప్యూటీ కమిషనర్లు దశరథ, రవీందర్, గడ్డిఅన్నారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు మహేందర్ యాదవ్, బేర బాలకిషన్, ఆనంద్ గౌడ్, ఆశిష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న కేసీఆర్

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ- సంతోష్ నగర్

పేదల సొంతింటి కలను సీఎం కేసీఆర్ నెరవేరుస్తున్నారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఇటీవల లక్కీ డ్రాలో డబుల్ బెడ్ రూం ఇండ్లు దక్కించుకున్న లబ్దిదారులకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఇండ్ల మంజూరు పత్రాలను శనివారం అందజేశారు. తర్వాత గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సొంతింటి కల, ఆత్మ గౌరవంతో గొప్పగా జీవించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్..దేశంలో ఎక్కడా లేని విధంగా రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు వంటి అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించినట్టు తెలిపారు. లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్ఐసీ సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన ర్యాండమైజేషన్ సాఫ్ట్ వేర్ ద్వారా ఆన్‌లైన్ డ్రా నిర్వహించినట్లు వివరించారు. మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గ పరిధిలో 500 మంది చొప్పున 2 వేల మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. కేటాయింపులో ఎవరి జోక్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, బొగ్గారపు దయానంద్, ఎగ్గె మల్లేశం, మలక్ పేట్ శాసన సభ్యులు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, కలెక్టర్ హరీష్, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం లక్ష్యం



బడంగ్‌పేట్ :

పేదల అభివృద్ధి, సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యం అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 12,13,14,15 వార్డుల్లో రూ.1కోటి 50లక్షల ప్రత్యేక నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్ల వెడల్పు, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శనివారం విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలలో నివాసం ఉండే ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు, మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం, కాలనీల్లో అంతర్గత రోడ్లు వేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందు పహాడీ షరీఫ్ బాబా హజ్రత్ షర్ఫోద్దీన్ దర్గాకు మంత్రి పూలతో కూడిన చాదర్ ను సమర్పించారు. దర్గాకు ర్యాంప్ రోడ్డు, షెడ్డు ఏర్పాటు చేస్తున్నందుకు ముస్లిం, మైనార్టీ సోదర సోదరీమణులు మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వసంత, డీఈఈ వెంకన్న, ఏఈ అయేషా, మున్సిపల్ వైస్ చైర్మన్ పరాన నాజ్, యూసుఫ్ పటేల్, కౌన్సిలర్లు దస్తగిర్, పుష్పమ్మ కొండల్ యాదవ్, పి.శంకర్, లక్ష్మీనారాయణ, పమీద అఫ్జల్, శంషోద్దీన్, కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు నాసార్ అవల్లి, మాజీ సర్పంచ్ మెరాజ్ ఖాన్, మహిళా అధ్యక్షురాలు యాష్మిన్ బేగం, మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వై జనార్దన్, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మామిడి పల్లి కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ దశదినకర్మలో మంత్రి



నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి తండ్రి జిల్లెలగూడ మాజీ సర్పంచ్ తీగల సత్యనారాయణరెడ్డి దశదినకర్మకు శనివారం తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తీగల సత్యనారాయణ రెడ్డి చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. తర్వాత డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డిని వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, కొత్త మనోహర్ రెడ్డి, మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని వినతి



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

ప్రజలకు అనుకూలంగా, ప్రజా అవసరాల దృష్ట్యా రేషన్ షాప్‌ను ఏర్పాటు చేయాలని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తుకు శనివారం సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ కుంట్లూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని 12వ వార్డులో సుమారుగా 800 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, వారికి అందుబాటులో రేషన్ షాపు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి ప్రతి నెల నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడం జరుగుతుందన్నారు. దీంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే 12వ వార్డులో సర్వే నెం. 12లోని ప్రభుత్వ భూమిలో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. ఓటర్ నమోదు కార్యక్రమంలో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా పక్షపాత, రాజకీయ ఒత్తిడికి లోను కాకుండా బీఎల్ఓల ద్వారా నిక్కచ్చిగా ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అనంతరం తహసీల్దార్ రవీందర్ దత్తును శాలువాతో సన్మానించారు. వినతిపత్రం అందజేసిన వారిలో కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, సీపీఐ(ఎం) మండల కార్యవర్గ సభ్యులు ఏశాల నరసింహ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఆశాలకు రూ.18వేలు ఫిక్సడ్ వేతనం చెల్లించాలి'



నవతెలంగాణ-ధూల్ పేట్

ఆశా వర్కర్లకు రూ.18వేలు ఫిక్సడ్ వేతనం చెల్లించాలని ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) సౌత్ జిల్లా కార్యదర్శి ఎం మీనా, నాయకులు శ్రావణ్ కుమార్‌లు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో డీఎం అండ్ హెచ్ ఓ కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు వేతనం అందించాలన్నారు. అంతేకాదు ఆశాలకు సంక్షేమ పథకాలన్నింటినీ వర్తింపచేయాలన్నారు. ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో ఆశాలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆశాలకు పని భారం తగ్గించి, జాబ్ చార్జను విడుదల చేయాలన్నారు. 2021 జూలై నుండి డిసెంబర్ వరకు 6 నెలల పేజీరిని ఎరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. 32 రకాల రిజిష్టర్స్‌ను వెంటనే ప్రింట్ చేసి ప్రభుత్వం సప్లై చేయాలన్నారు. ఆశాలకు ప్రసూతి సెలవులపైన సర్యులర్‌ను వెంటనే జారీ చేయాలన్నారు. అనంతరం హైదరాబాద్ డీఎం అండ్ హెచ్‌ఓ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సరస్వతి, ఉమా, లావణ్య నిక్కత్, ఆశా వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇండ్లు కేటాయించాలని నిరాహార దీక్ష



నవతెలంగాణ-హయత్ నగర్

నాగోల్ డివిజన్ పరిధిలోని ఎరుకల నాంచారమ్మ బస్తీలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను స్థానికులకు కేటాయించాలని కోరుతూ శనివారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎరుకల సంఘం నాయకులు జగన్నాథం గంగయ్య మాట్లాడుతూ ప్రభుత్వం జీహెచ్ఎంసీ పరిధిలో లాటరీ రూపంలో విడుదల చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలోఎరుకల నాంచారమ్మ బస్తీ వాసులకు కేటాయించకపోవడం దారుణమన్నారు. నిర్మించిన 288 డబుల్ ఇండ్లలో ప్రస్తుతం 200ఇండ్ల వరకు అందజేశారని, మిగిలిన ఇండ్లను అక్కడే నివాసం ఉంటున్న ఇండ్లు లేని వారికే ఇవ్వాలని.. లేని పక్షంలో తమ ఉద్యమం ఆగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అర్జున్ రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీజేపీ నాయకులు చింతల సురేందర్, లింగయ్య, స్వామి, మల్లేష్, పాపమ్మ, వెంకన్న, రామకృష్ణ, అంజి, బుజ్జన్న, నాగయ్య, నర్సింహ, హిట్లర్, హేమలత, విజయశాంతి, అనిత, గురవమ్మా, కుమారి, వీరయ్య వెంకన్న, రామంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి

- సీపీఐ(ఎం) నాంపల్లి జోన్ కమిటీ కన్వీనర్ మల్లేష్



నవతెలంగాణ - ధూల్ పేట్

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని సీపీఐ(ఎం) నాంపల్లి జోన్ కమిటీ కన్వీనర్ సి మల్లేష్ అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఉపాధి తదితర సమస్యలపై సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా పార్టీ నాంపల్లి జోన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం గుడిమల్కాపూర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 9 ఏళ్ల కాలంలో నిత్యావసర ధరలు 100 నుండి 200ల శాతం వరకు పెరిగాయన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కేంద్రం..ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించి, ఉన్న ఉద్యోగాలను తీసివేస్తుందని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం 25 శాతం ఉందన్నారు. మోడీ ప్రభుత్వం వలన ఐదు లక్షల చిన్న పరిశ్రమలు మూతపడ్డాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర కమిటీ సభ్యులు ఆర్ వెంకటేష్, జోన్ నాయకులు శంకర్, వెంకటస్వామి, ఫకీరయ్య లక్ష్మణ్, కలీం తదితరులు పాల్గొన్నారు.

వైశ్య గర్జన సభకు
అనుమతి ఇవ్వాలని వినతి

నవతెలంగాణ- చైతన్యపురి

వైశ్య హక్కుల సాధన కోసం అక్టోబర్ 1న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న వైశ్య గర్జన సభకు అనుమతి ఇవ్వాలని కోరారు. శనివారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో రాచకొండ సీపీ డీ ఎస్ చౌహాన్ ను వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కాచం



సత్యనారాయణ గుప్త, వైశ్య ప్రతినిధులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాచం మాట్లడుతూ అగ్ర కులాలు అని చెప్పుకునే తమ వైశ్య కులస్థులలో ఎక్కువగా ఎంతో మంది పేదవారు ఉన్నారని, వారి హక్కుల సాధనాలతో పాటు వైశ్యుల జాతి కోసం కార్పొరేషన్ సత్వరమే ఏర్పాటు చేసే విధంగా పోరాటం చేస్తున్నామన్నారు. అదే విధంగా రాజకీయ పార్టీలలో సరైన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. అందుకే అక్టోబర్ 1న నిర్వహించనున్న వైశ్య గర్జనకు తెలంగాణ నలుమూలల నుండి వేలాది మంది వైశ్యులు తరలి వస్తున్నారని పేర్కొన్నారు. వైశ్యుల ఆత్మ గౌరవం కాపాడుకోవాలంటే ముందుగా యువత ముందుకు రావాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏసీపీఎస్ జాతీయ అధ్యక్షుడు ప్రేమ్ గాంధీ, గుంత మురళీ మోహన్, కూర రమేష్, తెలుకుంట్ల రాంబాబు, వీరు దివ్వెల తదితరులు పాల్గొన్నారు.

మనశ్శాంతి ఎంతో ముఖ్యమైంది



టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమా రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీవితంలో మనశ్శాంతి ఎంతో ముఖ్యమైనదని టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయ, హైదరాబాద్ వారు దాదాపు 120 మంది దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఉద్యోగినీ ఉద్యోగులకు రాఖీలు కట్టారు. సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.రఘుమా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ, హైదరాబాద్ ఇన్‌చార్జి బ్రహ్మ కుమారి అంజ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన ద్వారా ప్రతి వ్యక్తి తమకు తాము పరివర్తన చెందే విధంగా తాము సహాయపడతామన్నారు. ప్రతి వ్యక్తికీ సమస్యలు ఉంటాయని, వాటిని అధిగమించి శాంతి పూర్వక జీవితం పొందడానికి మెడిటేషన్ ఉపయోగపడుతుందన్నారు. సీఎండీ రఘుమా రెడ్డి మాట్లాడుతూ జీవితంలో ప్రతి వ్యక్తికీ మనశ్శాంతి ఎంతో ముఖ్యమైనదన్నారు. కొందరిలో పని ఒత్తిడి వలన కోపం, బాధ వంటివి కలుగుతాయని, వాటి వలన సంతోషాలకు దూరమవుతాం అన్నారు. ఎంత పేరు ప్రతిష్టలు, ఆస్తి ఉన్నా మనశ్శాంతి లేనిదే అవన్నీ వ్యర్థం అని, ప్రతి ఉద్యోగి రోజులో కొంత సమయాన్ని మెడిటేషన్‌కు కేటాయించాలని సూచించారు. దీని వలన కోపం, బాధ వంటి భావాలు మన నుంచి దూరమై మనశ్శాంతి కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మ కుమారి సుజాత, రమేష్ కుమారు, అరుణ్ భాయ్, సంస్థ డైరెక్టర్లు టి.శ్రీనివాస్ జె.శ్రీనివాస్ రెడ్డి, జి.పర్వతం, మదన్ మోహన్ రావు, ఎస్.స్వామి రెడ్డి, సీజీఎంలు, సూపెరింటెండింగ్ ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇటీవల యాదగిరిగుట్ట ఏసీపీగా కే. శివరాంరెడ్డి బాధ్యతలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ జహంగీర్, ఆర్కే పురం డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ జాహెద్‌లు శనివారం ఏసీపీని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో పాటు సత్యనారాయణ గౌడ్, ఆసిఫ్ తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ - చైతన్యపురి



వివేకానంద ఆశ్రమానికి విద్యార్థుల విరాళం



నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురంలోని నాగార్జున మాంటిసోరి ఐఐటీ ఒలంపియాడ్ విద్యార్థులు శనివారం వివేకానంద అనాథ ఆశ్రమానికి ఐదు క్వింటాల బియ్యం, 50 కేజీల కంది పప్పును విరాళంగా అందజేశారు. నాగార్జున స్కూల్స్ వ్యవస్థాపకుడు గుమ్మకొండ విఠల్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఇటీవల పాఠశాలలో చారిటీ డే నిర్వహించి..సేకరించిన సరుకులతో పాటు యాజమాన్యం సకారంతో అనాథ ఆశ్రమానికి చేయూత నిచ్చారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత విఠల్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో అభాగ్యుల పట్ల ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు సమాజం పట్ల అవగాహన కల్పించి.. వారిని ఉన్నత విలువలు కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఏఈ అల్లు శేషారావు, అకాడమిక్ డీన్ ఎస్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ఏ. లక్ష్మి, ఇంచార్జీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో ఛాంపియన్ షిప్స్-2023 ప్రారంభం



నవతెలంగాణ - నాగోలు

హైదరాబాద్‌లోని నాగోల్, మమత నగర్‌లో జరిగిన 39వ తెలంగాణ స్టేట్ తైక్వాండో ఛాంపియన్ షిప్స్ 2023 కార్యక్రమాన్ని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఐవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస గుప్త శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత స్పోర్ట్స్, క్రీడాకారులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో స్పోర్ట్స్ స్టేడియాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఉత్సాహం, ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా ఇస్తున్నారని తెలిపారు. క్రీడాకారులు క్రీడలలో రాణించి.. జాతీయ, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి దేశానికి మంచి పేరు తీసుకొనిరావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మొగులపల్లి ఉపేందర్, ఇండియన్ సెంట్రల్ బోర్డు మెంబర్, ఓబీసీ మోర్చా ప్రెసిడెంట్ చింతల సురేంద్రనాథ్ యాదవ్, టీఎఫ్ ఐ అడ్వైసర్ మనోజ్ కుమార్, శ్రీకాంత్ ట్రెజరర్, వైస్ ప్రెసిడెంట్ కిషోర్ కుమార్, ఒలంపిక్ ఫార్మర్ ట్రెజరర్ సోమేష్ కుమార్, జాయింట్ సెక్రెటరీ మల్లారెడ్డి, స్టేట్ నెంబర్ మనోహర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి అంగన్‌వాడీ సిబ్బంది రాష్ట్రవ్యాప్త సమ్మె



నవతెలంగాణ-సిటీబ్యూరో

అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్‌ను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, అదనపు పని భారాన్ని తగ్గించాలని తదితర డిమాండ్ల సాధనకు ఈ నెల 11 నుంచి రాష్ట్ర వ్యాప్త సమ్మె నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం అల్వాల్ (యాప్రల్ ఆఫీస్) ప్రాజెక్ట్ ఆఫీసర్ షర్మిల (సీడీపీఓ) లకు సమ్మె నోటీస్‌ను సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 వేల మంది అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి 11 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు అల్వాల్ ప్రాజెక్ట్ అధికారిలకు అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ, ఏఐటీయూసీ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సమ్మె నోటీస్‌ను ఇచ్చారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ (సీఐటీయూ, ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శులు బి.శోభారాణి, ఎం.పారి మాట్లాడుతూ 40 ఏండ్లకు పైగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్స్, హెల్పర్స్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పని భారాన్ని పెంచుతూ, సంబంధం లేని పనులను కూడా అప్పగిస్తున్నదని తెలిపారు. కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని పదే పదే ప్రభుత్వాన్ని కోరుతూ అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చినా, దశల వారీ ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, కర్ణాటక రాష్ట్రాల్లో పై సౌకర్యాలు అమలు చేస్తున్నారని చెప్పారు. గుజరాత్ రాష్ట్రంలో సుప్రీంకోర్టు చెప్పినట్టు గ్రాట్యూటీ చట్టం అమలు జరుగుతున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పై రాష్ట్రాల్లో అమలు జరుగుతున్న ఏ సౌకర్యాలను అమలు చేయడం లేదన్నారు. అంగన్‌వాడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పది రోజుల క్రితం అంగన్‌వాడీ యునియన్లతో జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీలకు భిన్నంగా ప్రకటనలను చేశారని తెలిపారు. సీఎం కేసీఆర్ అంగన్‌వాడీ వర్కర్ పేరుని టీచర్‌గా మార్పు చేశారు కానీ అంగన్‌వాడీ జీవితాల్లో ఏ మార్పు రాలేదన్నారు. తమిళనాడు, పాండిచ్చేరి, అస్సాం, కర్ణాటక రాష్ట్రాల్లో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి హెల్త్ కార్డులను ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో పని చేస్తున్న అంగన్‌వాడీ సమస్యలపై పరిష్కారానికి చొరవ చూపాలని, లేదంటే ఈ నెల 11వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకి వెళ్తున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ (సీఐటీయూ) జిల్లా నాయకులు అనురాధ, మంజుల, అనిత పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
ఆదివారం | సెప్టెంబర్ 03, 2023 | www.navatelangana.com

విడతల వారీగా 'డబుల్' ఇండ్ల కేటాయింపులు

నవతెలంగాణ-ఓయూ



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన 500 మంది లబ్దిదారులు తొలివిడతగా ఎంపికయ్యారు. వారికి అహ్మద్‌గుడాలో డబుల్ బెడ్‌రూమ్‌లను కేటాయించారు. వారందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి లాలాపేట స్టేడి యం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో అహ్మద్‌గుడాకు తరలివెళ్ళారు. తమ కలను నేరవేర్చినందుకు ముఖ్యమంత్రి కెసిఆర్‌కి, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ కృత్ఞతలు తెలిపారు. విడతల వారీగా ఇండ్ల కేటాయింపులు పారదర్శకంగా కొనసాగుతాయని పద్మారావుగౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

దివంగత నేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి నివాళులు

నవతెలంగాణ-ఓయూ



నాగులూరు సాయి బాబా ఆధ్వర్యంలో చిలకల గూడ స్వగృహంలోదివంగత వైయస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వర్ధంతి కార్యక్రమంలో అడ్డగుట్ట భారతి, మెట్టుగూడ బాలమణి, మెట్టుగూడ ఆనంద్, లాలాపేట రామ్‌లాల్, దేవుడు వెంకట్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు వర్ధంతి వేడుకలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మోడీకి వేసినట్టే

● డాక్టర్ కోట నీలిమ

నవతెలంగాణ-బేగంపేట్



రాష్ట్రంలో బీజేపీ, బీఅర్ఎస్ రహస్య ఒప్పందంతో పనిచేస్తున్నాయని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అన్నారు. సనత్ నగర్‌లోని అల్లావుద్దీన్ కోటి బస్తీలో స్థానిక నాయకులతో ఆమె సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నగరం నడి ఒడ్డున ఉన్న అల్లావుద్దీన్ కోటిబస్తీ ఎందుకు అభివృద్ధి చెం దలేదని, నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాను అని చెప్పుకునే మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కి ఈ బస్తీ కనబడలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత బస్తీలో పాఠశాల, గ్రంథాలయం ఏర్పాటు ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మైనార్టీలను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్పు అనేది మా బస్తి నుంచే మొదలవుతుందని, అది కాంగ్రెస్ విజయంకు దారితీస్తుందని ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అజ్జు, హజీ, వాహిద్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధాన నిరసిస్తూ అధిక ధరలు, నిరుద్యోగం, ఉపాధి కుదింపునకు వ్యతిరేకంగా బోరబండ సైట్ త్రీలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. నిత్యావసర సరు కుల ధరలు పేదలు కొనే పరిస్థితిలో లేవని , సంవత్స రానికి రెండు కోట్ల ఉద్యోగాలు అని చెప్పి కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు ఉద్యోగాలు ఖాళీలు పూర్తి చేయలేదని, ఉద్యోగాల్లో 10లక్షల ఖాళీలను వెంటనే పూర్తిచేయాలని, ఉపాధి హామీ పథకానికి నిధులను తగ్గిస్తూ, రాష్ట్రాల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా, సిపిఎం పార్టీ జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దేశంలో నిరుద్యోగం 25శాతంగా ఉందని, 2014న అధి కారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఐదు లక్షల చిన్న పరి శ్రమలు మూతపడ్డాయి, కార్మికు లందరూ పెద్ద ఎత్తున రోడ్లపై పడ్డారన్నారు. పెట్రోల్ ధర ప్రపంచవ్యాప్తంగా తగ్గిన, మన దేశంలో పెంచుతూ పోతున్న ప్రభుత్వం వెంటనే ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు రాపర్తి అశోక్, సాయి శేషగిరిరావు, జె .స్వామి, బాలయ్య, భాగ్యరాజు, కే.సుధా కర్, దేవదాసు, లాలు తదితరులు పాల్గొన్నారు.

గీతిక కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ 25వ వార్షికోత్సవం

నవతెలంగాణ-బంజారాహిల్స్



డివిజన్ పరిధిలోని గీతిక కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ 25వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్ధమాన సినీనటి శ్రీలీల అతిథిగా హాజరైన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ 25 ఏండ్లుగా ఎంతో మంది కళాకారులను తయారు చేయడం అభినందనీయమని, ప్రస్తుత జీవనశైలిలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్న పిల్లలకు కూచిపూడి రంగంలో ప్రోత్స హించాలని తల్లిదండ్రులకు సూచించారు. కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టు కున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఖ్యా శాస్త్ర నిపుణుడు దైవజ్ఞ శర్మ,అకాడమీ డైరెక్టర్ అనంత కృష్ణ,మన బ్రాహ్మణ సమాజం సంస్థ అధ్యక్షుడు అవధానుల నరసింహ ప్రసాద్ శర్మ విద్యా శక్తి పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ నారాయణ చక్రవర్తి శర్మ తదితరులు పాల్గొన్నారు.

అందరూ మెచ్చిన ప్రజా ప్రతినిధి వైఎస్ఆర్

● కార్పొరేటర్ పి.విజయరెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్



బంజారాహిల్స్ డివిజన్ పరిధిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పంజాగుట్ట చౌరస్తాలో విగ్రహానికి మాజీ రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్రారావు, సీఎల్పీ నాయకులు భట్టి విక్రమార్క, ఆంధ్ర ప్రదేశ్ మాజీ పీసీసీ అధ్యక్షులు డాక్టర్ రఘువీరా రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ మల్లు రవితో కలిసి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయరెడ్డి ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రోహిన్ రెడ్డి, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్ యాదవ్,నియోజకవర్గంలోని మాజీ కార్పొరేటర్లు, పలు డివిజన్ల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్ యుఐ నాయకులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలోని శ్రీనివాస్ నగర్ కమ్యూనిటీ హాల్ ఖైరతాబాద్‌లో శనివారం పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, పీడియాట్రిక్ సేవలలో పరీక్షలు నిర్వహించారు. దీనిలో భాగంగా పీజేఆర్ ఫౌండేషన్ చైర్మెన్ కార్పొరేటర్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శిపి విజయరెడ్డి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్న పలువురికి వైద్యులతో కలిసి ఆమె మందులు పంపిణీ చేశారు.

ఓయూ సీఎఫ్ఆర్డీలో ముగిసిన 'రీసెర్చ్ టెక్నిక్స్‌పై మొదటి ఇంటర్న్‌షిప్' కార్యక్రమం



నవతెలంగాణ-ఓయూ

తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి శాస్త్రీయ పరికరాలను బహిర్గతం చేయడం సుసంపన్నమైన అనుభవం" అని సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (సీఎఫ్ఆర్‌డీ) నిర్వహిస్తున్న మొదటి "ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ఆన్ రీసెర్చ్ టెక్నిక్ ఉస్మా నియా యూనివర్సిటీలో శనివారం సాయంత్రం ముగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సెషన్‌లో పలువురు పాల్గొన్న వారు తమ ఆలోచనను వివరించారు. ఈ సందర్భంగా నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.బి. భీమా మాట్లాడుతూ యువ విద్యార్థులను ఆవిష్కర్తలుగాతీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.సీఎఫ్ఆర్‌డి డైరెక్టర్ ప్రొ.బి.సందీప్త, అందించిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, శాస్త్రీయ పరిణామాలను నిరంతరం అప్‌డేట్ చేసుకోవాలని పిలుపునిచ్చారు.సైన్స్‌లోఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్‌లో అపూర్వమైన మార్పులు వస్తున్న నేపథ్యంలో ఇది చాలా కీలకమని ఆమె అన్నారు. నేషనల్ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌ను సందర్శించి వారం రోజుల పాటు చేపట్టిన కార్యక్రమాలను ఆమె వివరిం చారు. ఇటువంటి ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు పాల్గొ నేవారి ఉపాధిని పెంచుతాయని ఆమె తెలిపారు. బయోకెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొ.బి.మంజుల మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు సమస్యలపై పూర్తి స్పష్టత ఉండాలని, తమ లక్ష్యాలను సాధించేందుకు ఉత్సాహంగా కృషి చేయాలని కోరారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ హమీదా మాట్లా డుతూ 'అక్టోబర్ 11న పోస్ట్ పాండమిక్ సినారియో' ఇంపెండింగ్ వైరస్ రీసెర్చ్ అనే అంశంపై జరగనున్న నేషనల్ సెమినార్‌లో మైక్రోబయాలజీ, ఓయూ విభాగంలో రాబోయే ప్రోగ్రామ్ వివరాలను విడుదల చేశారు. హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. స్టీవెన్‌సన్, మాట్లాడుతూ బలహీనతలను గుర్తించి శ్రేష్ఠత దిశగా కృషి చేయాలన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ రూపొందించిన కొత్త బ్రోచర్ సీఎఫ్ఆర్‌డిలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను వివరించ వీడియోను ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అనేక మంది ఫ్యాకల్టీ సభ్యులు, పీహెచ్‌డీ విద్యార్థులు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

'డబుల్' ఇండ్ల కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్, లబ్దిదారులు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



జూబ్లీహిల్స్ నియోజకవర్గం శాసనసభ్యులు మాగంటి గోపినాథ్ ఆధ్వర్యంలో,శనివారం నియోజక వర్గంలో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్‌ల కేటాయింపు కార్యక్ర మానికి తరలివెళ్లారు. యూసుఫ్ గూడా కెవి.బి.స్టేడియం నుంచి ప్రత్యేక బస్‌లలోపంపించినట్లు తెలిపారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 500 మంది లబ్దిదారులకు మంత్రి హరీష్‌రావు ఇండ్ల పంపిణీ చేసినట్లు తెలిపారు. రహ్మత్ నగర్ డివిజన్ నుంచి దాదాపుగా 70 మంది లబ్ధిదారులతో కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి కొల్లూర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

ప్రొ.కొండ నాగేశ్వర్‌కు సత్కారం



నవతెలంగాణ-ఓయూ

వందేండ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ సివిల్ సర్వీసెస్ అకాడమీ డైరె క్టర్‌గా ప్రొఫెసర్ కొండా నాగే శ్వర్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆదివాసి స్టూ డెంట్ ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ సాగబోయిన పాపారావు, ఓయూ అధ్యక్షుడు మడావి అజయ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, మొక్కను బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే కాలంలో సివిల్ సర్వీసెస్‌కు ఆసక్తి ఉన్న ఆదివాసీ విద్యా ర్థులకు ఎటువంటి షరతులు లేకుండా అడ్మిషన్ ఇచ్చి ఆదివాసీ నిరుద్యోగ యు వతకు ఉన్నతమైన అవకాశాలు కల్పించాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి మొదటి ప్రాధాన్యతగా ఆదివాసీ విద్యార్థులకు అవకాశం కల్పిస్తానని తెలిపారు. ఏఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కల్తీ వెంకన్న గౌరవేని ప్రవీణ్, బొచ్చు నరేష్, కారం రాము, క్రాంతి కిషోర్, పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజక వర్గ మోండా డివిజన్‌లోని పలు ఓటర్ పోలింగ్ స్టేషన్లను శనివారం కార్పొరేటర్ దీపిక నరేష్‌లు పరిశీలిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఓటర్ తమ ఐడిలో ఏమైనా తప్పులు ఉంటే సరి చేసుకోవాలని, డివిజన్‌లో ఉన్న స్థానికులకు వద్ద ఉన్న ఐడిలను పరిశీలించి పలు సూచనలు చేశారు. వారిని ఓటర్ ఐడిని పరిశీలించుకోవాలని కోరారు.

ఓటు నమోదు తప్పనసరి : మాజీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని మాజీ మే యర్, బీజేపీ రాష్ట్ర నాయకు రాలు బండ కార్తీకరెడ్డి అన్నా రు. శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా తార్నాక సెంటెన్స్ స్కూల్లో 191, 192,193 బూతులలో జరిగిన ఓటరు నమోదు కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్‌గౌడ్‌తో కలిసి పాల్గొన్నారు. పలువురితో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయించి, ఓటర్‌లో చిరునామా, ఫోన్‌నెంబర్ వంటి మార్పులు చేర్పులు తదితర అంశాల్లో అవగాహన కల్పించారు. శక్తికేంద్రం ఇన్‌చార్జి వీరన్న ఆధ్యరంలో జరిగిన ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్‌లో ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుక్క, గణేష్ ముదిరాజ్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ పోచయ్య యాదవ్, స్టేట్ లీడర్ బిక్షపతి యాదవ్,వీరన్న,తార్నాక డివిజన్ ప్రెసిడెంట్ రాము వర్మ గోవర్ధన్ పాల్గొన్నారు.

పూజల్లో బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్ గణేష్‌నగర్‌లో శ్రీశ్రీశ్రీ రాఘ వేంద్ర స్వామి 352వ ఆరా ధన ఉత్సవాలాల్లో ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి పాల్గొన్న బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ స్వామివారి ఆశీస్సు లతోఉప్పల్ నియోజకవర్గ ప్రజలు బాగుడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఈవీఎం మిషన్లపై అవగాహన



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

హైదరాబాద్ జిల్లా వ్యా ప్తంగా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, ప్రతి జీహెచ్ ఎంసీ వార్డ్ ఆఫీసులలో ఈవీ ఎం మిషిన్‌ల పనితీరును ప్రజలకు ఈవీఎం మిషన్లపై పోలీస్ అధికారులు శనివారం అవగాహన కార్యక్రమం జూబ్లీహిల్స్ డివిజన్‌పరిధిలో చేప ట్టారు. ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తూ, వారితో ప్రత్యక్షంగా వేలిముద్రలతో ఓటువేయించి, అది మిషన్‌లో ఎలా కనపడుతుందో, అదే విధంగా వారు వేసిన గుర్తుకే ఓటు పడిందా, లేదా అనే విషయాన్ని ప్రత్యక్షంగా చూపిస్తున్నారు. ప్రతిరోజు 50 మంది జీహెచ్ ఎంసీ ఓటు వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. ఈవీఎం మిషిన్‌లో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేదని ఈ సందర్భంగా తెలిపారు.

10న జరిగే సింహ గర్జనకు

బీసీలు కదిలి రావాలి

● జాజుల శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-బంజారాహిల్స్



రానున్న ఎన్నికల్లో బీసీలకు అన్ని పార్టీలు అత్యధిక సీట్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీసీ కులాల జేఏసీ ఆధ్వర్యంలో 10వ తేదీన హైదరాబాద్, సరూర్ నగర్ గ్రౌండ్‌లో బీసీల సింహగర్జన పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక శాతం సామాజిక వర్గం ఉన్న వారికి 22 సీట్లను, జనాభాలో 60 శాతం కి పైగా ఉన్న బీసీలకు 13 శాతం సీట్లను కేటాయించడం బీసీలను అవమానించడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్ర ఓటర్లలో 80లక్షల పైగా ఓట్లు కలిగిన బీసీ మహిళలకు కనీసం ఒక్క సీటు కూడా కేటాయించకపోవడంపై కేసీఆర్ బీసీ మహిళలకు ఇస్తున్న ప్రాముఖ్యతను తెలుసుకోవచ్చని ఎద్దేవ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇప్పటివరకు ఒక్క బీసీ వ్యక్తికి ముఖ్య మంత్రి అవకాశం రాకపోవడం కారణం బీసీలలో రాజకీయ చైతన్యం లేకపోవడమే కారమన్నారు. సింహగర్జన ఏ ఒక్కరికోసమో కాదనీ, బీసీ లందరి ప్రయోజనం కోసమేనని ఆయన ఈ సందర్భంగా అన్నారు.

ఎస్సీ వర్గీకరణపై అన్ని పార్టీలు

తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి



● మందకృష్ణ మాదిగ

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఎస్సీ వర్గీకరణ అంశంపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో సహా అన్ని పార్టీలు తమ చిత్తశుద్ధిని నిరూపించుకు నేందుకు త్వరలో నిర్వహించనున్న చివరి పార్లమెంటు సమావేశాల్లో అనుకూలంగా వ్యవహరించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సోషలిస్ట్ పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు ప్రధానంగా వర్గీకరణ అంశానికి 29 సంవత్సరాల నుంచి అనుకూలంగా ఉన్నామని చెబుతున్న బీజేపీకి ఇదే చివరి అవకాశమని, పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేయడంతో పాటు, బీజేపీ పార్టీ బిల్లు ప్రవేశ పెట్టక పోతే మరోవైపు గతం నుంచి అనుకూలంగా ఉన్న కాంగ్రెస్‌కూడా తమ చిత్తశుద్ధి నిరూపిం చుకునేందుకు మల్లికార్జున్ ఖర్గే ,రాహుల్ గాంధీ లు పార్ల మెంటులో ప్రయివేట్ బిల్లు ప్రవేశపెట్టలని డిమాండ్ చేశారు. బిల్లుని పార్ల మెంట్లో ప్రవేశపెట్టే కార్యాచరణలో భాగంగా 3నుంచి 22వరకు కార్యాచరణ ప్రణా ళికను రూపొందించినట్లు మందకృష్ణ తెలిపారు. రాష్ట్ర అధ్య క్షులు గోవిందు నరేష్,అరుణ్, సురేష్,శివ మాదిగలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కండి

● శ్రీశ్రీశ్రీ విజయనాంద గురు సేవా సమితి

నవతెలంగాణ-బంజారాహిల్స్



వారణాసి (కాశీ) లోని శివాలఘాట్ మహారాజా చేత్సింగ్ పిలిగ్రామేజ్ సెంటర్లో నవంబర్ 19 నుంచి 27వ తేదీ వరకు శ్రీశ్రీశ్రీ విజయనాంద గురుసేవాసమితి ఆధ్వర్యంలో కోటి పార్థివ (మట్టి) లింగాల అర్చనలను నిర్వహిస్తున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగిరాల రామచంద్ర సాయి, డాక్టర్ వెంకట కె.గంజాం తెలిపారు. ఈ మేరకు శనివారం వారు లింగాల నమూనాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రపంచంలోనే మొదటి సారిగా పార్థివలింగాకార కోటి శివలింగాలతో ఈలింగార్చన నిర్వహిస్తున్నామన్నారు. ఈ లింగార్చన మహోత్సవాలకు శృంగేరి శంకరాచార్య జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతి స్వామిజీ, కంచి శంకరాచార్య శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి, నిఖిల్ చేతన కేంద్ర గురూజీ అనిల్ కుమార్ జోషి, మహారాష్ట్ర నాసిక్ కపిల తీర్థ ఆశ్రమం గురూజీ కల్కిరామ్మహరాజ్ తదితరులు హాజంపుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సమితి ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఎస్పీ అంబా ప్రసాద్, డాక్టర్ హరిహర నాదరాజు, ప్రతాప్, పాపారావు, బస్వరాజు పాల్గొన్నారు.

ముగిసిన హరికథా త్రిరాత్రి మహోత్సవాలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

శ్రీ ఆదిభట్ల, శ్రీకళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు, సిని నటి కరాటే కళ్యాణి ఆధ్వర్యంలో తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ సౌజన్యతో ఆదిభట్ల నారాయణదాసు జయంతి సందర్భంగా మూడు రోజుల నుండి పంజాగుట్ట టోపాజ్ ప్లాజాలో హరికథా త్రిరాత్ర మహోత్సవాలు ఘనంగా నిర్వహించుకుని శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ముందుగా సంగీత దర్శకుడు పడాల తారకరామారావు భక్తి సంకీర్తన గానం చేశారు. కార్యక్రమానికి మాజీ ఎంపీ టీడీపీ నాయకులు మురళీమోహన్, నటులు రచయిత తనికెళ్ళ భరణి,డాక్టర్ మామిడి హరికృష్ణ, బుర్రాసాయి మాధవ్, చీకోటి ప్రవీణ్,డాక్టర్ గౌతమ్ రావులు పాల్గొని ప్రసంగించారు. హరికథా త్రిరాత్ర మహోత్సవాలు హిందూ ధర్మం ఉట్టిపడేలా జరుగుతున్నయని కలలు అంతరించిపోయే దశలో ఉన్న నేటి రోజుల్లో కులం కంటే ముందు సనాతన సంస్కృతి ధర్మాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భాష సంస్కృతి రచయితలు కవులు కళాకారులు ఎంతో కృషి చేస్తున్నారని సాంస్కృతిక కార్యక్రమాలకు ఇంకా ఆదరణ పెరగాలని, భవితరాలకు చారిత్రికమైన గొప్పతనం తెలియాలి అంటే హరికథలు లాంటివి మేలు చేస్తాయని వక్తలు వారి అభిప్రాయాన్ని వ్యక్తపరచారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల పెన్‌డౌన్-చాక్ డౌన్

● ఓయూలో గోడ పత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-ఓయూ



కాంట్రాక్ట్ అధ్యాపకుల 130 రోజులుగా ఎన్నో రకాల నిరసనలు తెలిపిన తమ బాధలను ప్రభుత్వం పట్టిం చుకోవట్లేదని తెలంగాణలో కీలక భూమికి పోషి ంచిన కాంట్రాక్టు అధ్యాపకులను విస్మరించడం చాలా బాధాకరమని అధ్యాపక సిబ్బంది సంఘాల నాయకులు తెలిపారు. జూనియర్, డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్‌ని రెగ్యులర్ చేసిన విధంగానే మమ్మల్ని కూడా రెగ్యులరైజ్ చేయాలని ఎన్నో మార్లు కోరినా ప్రభుత్వం తమ చిన్నచూపు చూస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల ందరూ సెప్టెంబర్ 4 నుండి పెన్‌డౌన్ చాక్‌డౌన్ చేయాలని, కాంట్రాక్టు టీచర్లు అందరూ విధులను బహిష్కరించి టెంట్లకే పరిమితం కావాలని యావత్ తెలంగాణలో ఉన్న విద్యా వ్యవస్థని స్తంభించచేస్తామని సెల్ఫ్‌ఫైనాన్స్ అండ్ బడ్జెట్ కోర్స్‌లలో బోధిస్తున్న అధ్యాపక సిబ్బంది సంఘాల నాయకులు అన్నారు. శనివారం సాయంత్రం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట పెన్ డౌన్ పోస్టర్స్ విడుదల చేశారు. ఈ విష యంపై ప్రభుత్వం టీచర్స్ డే సెప్టెంబర్ 5, రోజు కంటే ముందే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ధర్మతేజ,డాక్టర్ రామేశ్వర్‌రావు, డాక్టర్ తాళ్లపల్లి వెం కటేశం, ఈ ఉపేందర్ రావ్, సిహెచ్ వెంకటేష్, ఓ.కృష్ణయ్య, విజయేందర్ రెడ్డి, డాక్టర్ కే.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలో కార్పొరేటర్

నవతెలంగాణ-ఓయూ



హబ్సిగూడ డివిజన్ గణేష్ నగర్‌లోని మంత్రాలయ మఠ్ రాఘవేంద్ర స్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవాన్ని శని వారం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడు కక్కిరేణి హరీష్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమేష్, వినయ్, గిరీష్, శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ రవీందర్ గౌడ్ ,హబ్సిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి చెల్లోజు ఎల్లాచారి, పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
ఆదివారం | సెప్టెంబర్ 03, 2023 | www.navatelangana.com

అనాథలకు నాగార్జున స్కూల్ విద్యార్థుల వితరణ



నవతెలంగాణ-బడంగ్‌పేట్

నాదర్ గుల్ గ్రామంలోని మాతృ దేవోభవ అనాథ ఆశ్రమంలో అనాథలకు నాగార్జున స్కూల్ విద్యార్థులు స్కూల్ విద్యా సంస్థల అధినేత గుమ్మకొండ విఠల్ రెడ్డి జన్మదినం సందర్భంగా సేకరించిన సరుకులతో పాటు స్కూల్ యాజమాన్యం కొంత కలిపి 2 క్వింటాల బియ్యం, 20 కిలోల పప్పులు తదితర నిత్యావసర సరుకులను శనివారం ఆశ్రమ వ్యవస్థాపకులు గట్టు గిరికి అందచేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ విఠల్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని అభాగ్యుల పట్ల ప్రతి ఒక్కరూ సేవాభావం కల్గి ఉండాలన్నారు.అందుకోసం ప్రతి విద్యార్థికి సామాజిక సేవా కార్యక్రమాలల్లో చిన్నారులకు భాగస్వామం కల్పించి ఉన్నత పౌరులుగా తీర్చి దిద్దాలన్నారు.తమ విద్యా సంస్థలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం కోసం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. ప్రిన్సిపాల్ డి.మహేష్,ఇంచార్జి దుర్గ, సంధ్య,ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం భవనం కోసం మంత్రికి వినతి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మామిడిపల్లి గ్రామంలో మల్లికార్జున స్వామి దేవాలయ నిర్మాణం, యాదవ సంఘానికి స్థలం కేటాయించాలని కోరుతూ శనివారం కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్ ఆధ్వరంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని వారి స్వగృహంలో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మామిడిపల్లి గ్రామంలో 100పై యాదవ కులస్తుల కుటుంబాలు ఉన్నాయన్నారు. గతంలో మీరు హోం మంత్రిగా ఉన్న సమయంలోనే మల్లన్న స్వామి దేవాలయాన్ని నిర్మించామని ఆ దేవాలయము అసంపూర్తిగా ఉందని, ఈ దేవాలయానికి రోడ్డు మంజూరు చేయాలన్నారు.

పారదర్శకత లేని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీ

- వార్డు సభ జరపలేదు, రిజర్వేషన్లు పాటించలేదు
- అంత గోప్యత ఎందుకు?
- ఎన్నికల్లో గుణపాఠం తప్పదు
- సీపీఐ(ఎం) సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లేదని సీపీఐ(ఎం) సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలనే పాటించ లేదన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ..



రాష్ట్ర ప్రభుత్వం 2017లో నవంబర్ 26న జీవో (ఎంఎస్ నెంబర్ 12) ద్వారా ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు మార్గ దర్శకాలను జారీ చేసిందని గుర్తు చేశారు. వార్డు సభ ద్వారా దరఖాస్తులను స్వీకరించి, చివరగా వార్డు సభలోనే లబ్ధిదారులను ఫైన లైజ్ చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చిందన్నారు. ఆ ఆదేశాలనే పక్కనె ఎట్టారని, వార్డు సభ జరపకుండానే లబ్ధిదారుల ఎంపిక చేశారని విమర్శించారు. ఎస్సీలకు 17శాతం, ఎస్టీలకు 6శాతం, మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్లు పాటించాలని జీవో నెంబర్ 10 ద్వారా స్పష్టం చేసినప్పటికీ మార్గదర్శకాలను పాటించకుండానే ఇష్టారాజ్యంగా ఎంపిక చేశారని మండిపడ్డారు. గత తొమ్మిదేండ్లుగా పేదలకు ఇండ్లపై అనేక ఆశలు చూపించి, లబ్ధిదారులం దరికీ ఇండ్లు కట్టించి ఇస్తానని వాగ్దానం చేసిన ప్రభుత్వం అతి కొద్ది మందికే ఇండ్లు కేటాయించి పేదలను మోసం చేసిందన్నారు. కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల్లో లక్షలాది మంది దరఖాస్తు చేసుకున్నారని, వాటిని పక్కనపెట్టారన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పెట్టుకున్న దరఖాస్తులను సైతం పరిగణలోకి తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో వచ్చిన కొద్దిపాటి దరఖాస్తులను సర్వే చేసిన అధికారులు మిగతా లక్షల దరఖాస్తులను చెత్తబుట్టలో వేయడం అత్యంత దారుణమన్నారు. పేదల జీవితాలతో ఆడుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తామని, రాబోయే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరిచారు.

నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా 20వ వార్షిక స్నాతకోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో/శామీర్‌పేట

నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా 20వ స్నాతకోత్సవం శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని జస్టిస్ సిటీ క్యాంపస్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి, జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథిగా భారత సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహన్ హాజరయ్యారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ యూనివర్శిటీ ఛాన్స్‌లర్, జస్టిస్ అలోక్ ఆరాధే స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించారు. నల్సార్ యూనివర్శిటీ ఆఫ్ లా వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు ప్రముఖులకు స్వాగతం పలికి యూనివర్సిటీ నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా ఉత్సవ సౌరభంతో సాగే, సాంప్రదాయిక ఊరేగింపునకు నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.విద్యుల్లతారెడ్డి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు మాట్లాడుతూ నల్సార్ యూనివర్శిటీ 25వ సంవత్సరాన్ని పూర్తి చేసుకుంటున్న విషయాన్ని ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో యూనివర్సిటీ కీలక న్యాయ విజ్ఞాన రంగంలోనూ, భౌతిక నిర్మాణాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి మీద దృష్టిని కేటాయిస్తుందన్నారు. నేడు ప్రారంభించిన ఉచిత న్యాయ సలహా కేంద్రం ద్వారా నల్సార్ న్యాయ సేవలు విస్తరించ బోతున్నాయన్నారు. తల్లిని, మాతృభూమిని, విద్య నేర్పిని విద్యాలయాన్ని విద్యార్థులు నిరంతరం గుర్తుంచుకోవాలన్నారు. పూర్వ విద్యార్థులుగా మారిన పట్టభద్రులను పూర్వ విద్యార్థుల సంఘంలో చరుకైన పాత్ర వహిస్తూ యూనివర్శిటీకి సహకరించాలని కోరారు. ముఖ్య అతిథి సుప్రీం కోర్టు సీనియర్ న్యాయమూర్తి సంజయ్ కిషన్ కౌల్ స్నాతకోత్సవం ప్రసంగం చేశారు. ఈ ప్రసంగంలో జస్టిస్ కౌల్ న్యాయ విద్యా బోధన అభ్యసనలలో మూడు దశాబ్దాలుగా అనేక మంచి మార్పులు వచ్చాయని, ఇప్పటి కాలం విద్యార్థులు ఈ నూతన బోధన అభ్యసన విధానాల ద్వారా న్యాయ విద్య నేర్చుకుంటున్న నూతన తరాలు చాలా మెరుగైన సంరతేలను చూపుతున్నారని తెలిపారు. న్యాయ విద్యా బోధనలో పాత లెక్చర్ ఇచ్చే పద్ధతిని దాటి కేస్ స్టడీ, సోక్రటిక్ పద్ధతి, అనుభవాధ్యర్య పద్ధతుల ద్వారా న్యాయ విద్య నేర్పు జరుగుతున్నదన్నారు. జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాయలు న్యాయవిద్యను మెరుగ్గా అందించడంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తూ ఉన్నాయన్నారు. పట్టాలు పొంది న్యాయ సంబంధ వృత్తులైన, న్యాయవాద వృత్తి చేయడం, న్యాయ పాలికలో ప్రవేశం, వ్యాపార న్యాయ సంస్థల్లో పని చేయడం, న్యాయ విద్య బోధనలోకి వెళ్లడం అనే అనేక అవకాశాలు ఇప్పుడు ఉన్నాయని చెప్పారు. ఈ రంగాల్లోకి ప్రవేశించినా మంచిని పెంచే అవకాశాలను, తోటి వారికి సాయ పడే గుణాన్ని కాపాడుకోవాలని సూచించారు. వత్తి జీవితాన్ని వ్యక్తి గత జీవితాన్ని సమతులనం పాటించాలని సూచించారు. కుటుంబానికి స్నేహితులకు సమయం ఇస్తూ, అర్థవంతం, మానసకంగా, ఆరోగ్యకరంగా ఉండాలని ఉద్బోధించారు.

న్యాయ లీగల్ ఎయిడ్ కేంద్రం

ఈ సందర్భంగా నల్సార్‌లోని ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని ముఖ్య అతిథి ఇతర ప్రముఖుల సమక్షంలో గౌరవ ముఖ్య అతిథి, సుప్రీం కోర్టు న్యాయమూర్తి సంజయ్ కిషన్ కౌల్ ప్రారంభిం చారు. నల్సార్ యూనివర్శిటీ ఆఫ్ లా సంబంధిత వ్యక్తులకు వివిధ రకాల న్యాయ సహాయం, అవగా హనను అందించడానికి ఒకే గొడుగు కిందికి తేవడానికి ఏర్పాటు చేసిన కేంద్ర మిది. ఈ స్నాత కోత్సవంలో పీహెచ్‌డీ, ఎల్ఎల్ఎం, ఎంబీఏ, బీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్, నల్సార్ దూర విద్యా కేంద్రం ద్వారా అందించే వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమాలను విజయవంతంగా పూర్తి చేసుకున్న 1,100 పైచిలుకు విద్యార్థులకు ఆయా పట్టాలు పొందారు. దానితో పాటు 58 బంగారు పతకాలను విజేతలైన అభ్యర్థులకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయ మూర్తులు, విశ్రాంత న్యాయమూర్తులు, నల్సా ర్ కార్యనిర్వాహక మండలి సభ్యులు, ఇతర విశ్వవిద్యాలయ సంస్థల సభ్యులు, ప్రభుత్వ అధికార ప్రముఖులు, న్యాయ వాదులు, విద్యారంగ నిపుణులు, పత్రికా ప్రతినిధులు, విద్యార్థుల తలిదండ్రులు పాల్గొన్నారు.

బంగారు పతకాలు ఇలా :

ఎల్ఎల్ఎంలో ఆకాంక్ష యాదవ్, హర్షిత్ పాండే, మనీష్ కుమర్, హరిత, అమీషా బంగారు పతకాలు సాధించారు. ఎంబీఏలో అభిషేక్, ఏవియేషన్ లా ఎంఏ విభాగంలో ఏష కతి పాడియా, ఎంఏ క్రిమినల్ లా అండ్ ఫోరెన్సిక్ సైన్సెస్‌లో కె.శ్రీకష్ణ పతకాలు పొందారు. యూనివర్శిటీలో ప్రత్యేక స్థానం ఉన్న బీఏ ఎల్ఎల్‌బీ ఈ అనర్స్ విభాగంలో కష్టన్ ఉన్ని ఏడు బంగారు పతకాలను, ఋత్విక్, ప్రణయ్, నిశిత తలా నాలుగు పతకాలను, స్వాతి, రేష్మిత మూడు పతకాలు, కార్తీక్ సుబ్రహ్మణ్యం, యశస్వి, గౌరవ్, మయూఖ, రఘునందన్, శ్రీరామ్, చెరో రెండు పతకాలు, మిగిలిన విజేతలు తలా ఒక బంగారు పతాకాన్ని స్వంతం చేసుకున్నారు.

'మహాధర్నాను విజయవంతం చేయాలి'

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ హామీలు-వైఫాల్యాలకు నిరసనగా తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్వర్యంలో ఈనెల 4న సోమావారం ఉదయం 10:30 గంటలకు హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామని సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు పీ.సాయిబాబా తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



రాంగోపాల్ పేట్ 'జే డివిజన్‌లో గత మూడు రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. బస్తీ వాసులకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.
నవతెలంగాణ- సిటీబ్యూరో



పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా వంపుగూడ కాలనీలో కాప్రా తహసీల్దార్ మత్తిన్, ఆర్ఐ ఆనంద్ పాల్గొని ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం చైర్మెన్ పత్తి కుమార్, బీఆర్ఎస్ కాప్రా డివిజన్ బీసీ నాయకులు గణేష్, సత్తయ్య, రమేష్, రవి, బిక్షపతి గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాజు, శోభ, జమున పాల్గొన్నారు.
నవతెలంగాణ-కాప్రా

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
12
హైదరాబాద్
ఆదివారం | సెప్టెంబర్ 03, 2023 | www.navatelangana.com

'ఎంఎన్‌జే లో అన్నదానం



నవతెలంగాణ- సిటీబ్యూరో

టీఎన్జీవో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, అసద్‌అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డా.యస్. యం.హుస్సేని (ముజీబ్) ఆధ్వర్యంలో శనివారం ఏ.ఎం.చంద్రశేఖర్ వర్ధంతి సందర్భంగా మెహది నవాబ్ జంగ్ క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో సుమారు 650 మంది రోగుల సహాయ కులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.చంద్రశేఖర్ కుమారుడు రాఘవేంద్ర, విమల్, కార్తీక్, జిల్లా కార్యదర్శి ఎస్. విక్రమ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కే.ఆర్.రాజకుమార్, సభ్యులు ఉమర్ ఖాన్, కురాడి శ్రీనివాస్, ఖాలీద్ అహ్మద్, వైదిక్ శస్త్ర, బొలిగిద శంకర్, సుజాత, ఎం.ఎన్.జే.క్యాన్సర్ ఆస్పత్రి యూనియన్ సభ్యు లు పాల్గొన్నారు. ముజీబ్ మాట్లాడుతూ జిల్లా యూని యన్ పెద్ద దిక్కు చంద్రశేఖరరావు వర్ధంతి సందర్భంగా అన్నదానం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు.

కొత్త ఎస్కలేటర్ ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్‌ఆర్మ్-బి వద్ద కొత్త ఎస్క లేటర్‌ను ఎల్‌అండ్‌టీ మెట్రోరైల్(హైదరాబాద్) లిమిటెడ్(ఎల్‌అండ్‌టీ ఎమ్ఆర్‌హెచ్ఎల్) ప్రారంభించినట్లు తెలి పింది. వారు మాట్లాడుతూ ప్రయాణీ కుల కదలికను, ముఖ్యంగా రద్దీ సమయాల్లో క్రమబద్ధీ కరించడానికి ఇది ఉపయోగపడు తుందని, మొత్తం ప్రయాణ అనుభవాన్ని మరింత మెరుగుపరుస్తుందన్నారు. హైద రాబాద్ మెట్రో రైల్ నెట్‌వర్క్‌లో అత్యంత రద్దీగా ఉండే మెట్రో స్టేషన్‌లలో ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ ఒకట అని, ప్రస్తుతం రోజూ 70,000 మంది ప్రయాణికులు ఇక్కడరాకపోకలు సాగి స్తున్నారన్నారు.ఈపరిణామం గురించి హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌వీఎస్‌రెడ్డి మాట్లాడుతూ, "ఎల్‌బినగర్ మెట్రో స్టేషన్ కొత్త ఎస్కలేటర్‌ను ప్రజలకు అంకితం చేయడం సంతో షంగా ఉందని, దీనితో, ఇప్పుడు ప్రయాణికులు స్టేషన్‌ను సౌకర్య వంతంగా యాక్సెస్ చేయడానికి అదనపు అవకాశాలను కలిగి ఉంటారన్నారు ఎల్‌అండ్ టి ఎమ్ఆర్‌హెచ్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈఓ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యం, సౌలభ్యంకు కట్టుబడి ఉన్నామన్నారు.

బీజేపీ హటావో దేశ్ బచావో

- సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్

నవతెలంగాణ-అంబర్‌పేట

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా సీపీఐ(ఎం) అంబర్‌పేట్ జోన్‌కమిటీ ఆధ్వర్యంలో తిలక్‌నగర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్ హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మోడీ ప్రభుత్వం దేశంలో అనేక మత కలహాలు కుల కొట్లాటలు ప్రాంతీయ విభేదాలతో ప్రజలను రెచ్చగొట్టి ఘర్షణలకు దారి తీసే విధంగా పరిపాలన సాగిస్తున్నాడని విమర్శించారు. అధికారానికి రాకముందు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తూ దేశంలో అవినీతి అక్రమాలు అరికడుతూ అవినీతి రహిత పాలన అందిస్తానని వాగ్దానం చేసిన మోడీ, ఈరో జు దేశ సంపద మొత్తం ఆదానీకి, అంబానీకి దోచిపెడు తూ ప్రజలపై అనేక భారాలు మోపుతున్నాడని, పసి పిల్లలు తాగే పాలు, పెరుగుపై ,చదువుకున్న విద్యార్థు లపై పెన్ను పుస్తకాలు, పెన్సిల్, చాకుమారిపై జీఎస్టీ విధించి ధరల భారం మోపుతున్నాడన్నారు. వెనకబడిన తరగతులకు షెడ్యూల్ కులాల, షెడ్యూలు తెగలకు



రిజర్వేషన్ లేకుండా ఉపాధికి దూరం చేస్తున్నాడని, పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు, నిత్యావసర సరు కుల ధరలు విపరీతంగా పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నాడని విమర్శించారు. కార్మిక హక్కులను కాలరాస్తూ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్స్‌గా విభజించి కార్మికుల పొట్టగొడుతున్నాడని, కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు రుణాలు మాఫీ చేస్తూ రైతులకు మాత్రం రుణాలు మాఫీ చేయడం లేదని, ఇప్పటికైనా దేశ ప్రజలు బీజేపీపరిపాలనలో జరుగుతున్న దురాగతాలను గుర్తించి బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని భారతదేశాన్ని లౌకిక సెక్యులర్ దేశంగా కాపాడుకోవాలని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ అంబర్‌పేట్ జోన్ కమిటీ సభ్యులు జి. రాములు, బి.సుబ్బారావు, ఎండి.అఖిల్ , షబానా పార్టీ నాయకులు వరలక్ష్మి, రఘునాయక్, భాస్కర్, శ్రీనివాస్, మల్లికార్జున్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

పేరు రానివారు ఎలాంటి ఆందోళన వద్దు

- విడతల వారీగా పారదర్శకంగా డబుల్ ఇండ్ల పంపిణీ
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ పరిధిలో నిరుపేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు (డిగ్నిటీ ఇండ్లు) మొదటి విడత లాటరీలో పేరు రానివారు ఎలాంటి ఆందోళన చెందవద్దని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శనివారం ఉప్పల్ నియోజకవర్గం శ్రీరామ్ నగర్ కాలనీలో ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి లతో కలిసి 500 మంది లబ్దిదారులకు పట్టా సర్టిఫికేట్‌ను మేయర్ అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మొదటి విడతలో ఇండ్లు రానివారు ఎలాంటి ఆందోళన చెందవద్దని మొత్తం 6 విడతలుగా ఒక్కొక విడత 12 వేల చొప్పున పంపిణీ చేస్తామన్నారు. 15 రోజులలో మరొక విడతలో పంపిణీ చేస్తామని అన్నారు. పట్టా కాగితాలు అందిన తర్వాత సుమారు రెండు వారా ల్లో ఇంటికి హౌసింగ్ శాఖ వారు ఇంటి తాళాలు అందజేస్తారని తెలిపారు. శ్రీరామ్ నగర్‌లో 756 గహాలకు గాను ఉప్పల్ నియోజక వర్గానికి చెందిన 500 మంది లబ్దిదారులకు



పంపిణీ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఒక లక్ష గహాలను చేపట్టినట్లు ఇప్పటి వరకు 69 వేల గహాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు తెలి పారు. మొదటి విడతలో 11,700 గహాలను పంపిణీ చేయగా మిగతా 57 వేలు కూడా త్వరలో అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేస్తామన్నారు. అసత్య ప్రచారం పుకార్లను ఎవ్వరూ చెప్పినా నమ్మవద్దని, అర్హులైన నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చిన ముఖ్యమంత్రిని ఆశీర్వదించాలని మేయర్ కోరారు.

పేదల పక్షపాతి సీఎం : ఉప్పల్ ఎమ్మెల్యే భేతి

దేశంలో ఏ ముఖ్యమంత్రి నిరుపేదలకు డబుల్ రూమ్ ఇండ్లను నిర్మించలేదని పేదల పక్షపాతి కాబట్టి అందరికీ కావలసిన అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో సుమారు రూ.7 వేల కోట్ల వ్యయంతో నిలువ నీడ లేని నిరుపేదలు ఆత్మగౌరవంతో బతికేందుకు ఉచితంగా ఇండ్లు పంపిణీ చేస్తున్నారని ఆయన అన్నారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శం: డిప్యూటీ మేయర్

మొదటి విడతలో ఇల్లు రానివారు ఆందోళన చెందవద్దని డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. నిరుపేదల సంక్షేమం కోసం పింఛన్లు, కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకా లు అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డిసి ముకుంద రెడ్డి, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే డబుల్ బెడ్రూం ఇండ్లు



- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట

పేదలు గొప్పగా, ఆత్మగౌరవంతో బ్రతకాలనే సీఎం కేసీఆర్ లక్ష్యం మేరకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి అర్హులకు ఉచితంగా అందజేస్తుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం అంబర్ పేట డివిజన్ చెందిన 500 మందికి డబల్ బెడ్ రూమ్ ఇల్లు పంపిణీ కార్యక్రమానికి అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో లబ్ధిదారులతో జెండా ఊపి భారీ ర్యాలీతో తరలివెళ్లారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పేదలకు పలు పథకాల కింద చేపట్టిన ఇండ్ల నిర్మాణాలలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం నామమాత్రమేనని, తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన ఇండ్లు ఎంతో విశాలంగా ఉన్నాయన్నారు. దేశంలో ఇంత గొప్ప కార్యక్రమం ఎక్కడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్ పేట కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్, నాయకులు పులిజాల గెల్వయ్య, మోర శ్రీరాములు ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్, ఎర్ర భీష్మ దేవ్, చంద్రమోహన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

గంగపుత్రులకు అన్ని విధాలుగా అండగా ఉంటా : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

గంగపుత్రులకు ప్రభు త్వపరంగా, వ్యక్తిగతంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం అంబర్ పేట డివిజన్ చెందిన గంభీ రావుపెట గంగపుత్ర, సం ఘం నాయకులు అలీ కేఫ్ నూతన కార్యాలయం ఏర్పాటు చేసిన సమా వేశానికి ముఖ్య అతిథిగా అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అంబర్ పేట కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ హాజరై ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మృత్యుకారులకు ప్రభుత్వం ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, రాబోయే రోజుల్లో మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మంగలిపల్లి యాదయ్య కోశాధికారి గంగాధర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తా

వీఎస్‌టీ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-ముషీరాబాద్

కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తా అని వీఎస్‌టీ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సమీపంలోని ప్రసిద్ధి చెందిన వీఎస్టీ కంపెనీలో 2023 ఏడాదికి కార్మికులకు, యాజమాన్యానికి మధ్య చారిత్రాత్మకమైన వేతన సవరణ ఒప్పందం కుదిరింది. ఈ మేరకు కార్మిక శాఖ ప్రధాన కార్యాల యంలో కమిషనర్ ఎదుట యూనియన్ అధ్యక్షులు వి. శ్రీనివాస్ రెడ్డి, కంపెనీ ప్రతినిధులు సంతకాలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో యూనియన్ జనరల్ బాడీ సమావేశం అధ్యక్షుడు వీఎస్సార్ అధ్యక్షతన వీఎస్టీ ఫంక్షన్‌హాల్లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా కార్మికులు పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు. యూనియన్ అధ్యక్షులు వి శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కోశాధికారి నరేందర్ గౌడ్లను కార్మికులు గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ దశాబ్దంలో వీఎస్టీ కంపెనీలో ఇలాంటి అగ్రిమెంట్ మును పెన్నడూ జరగలేదని, ఒక్కో కార్మికుడికి సీనియార్టీ ఆధారంగా కనీసం రూ. 15వేల నుంచి రూ.22వేల వరకూ వేతనాలు పెరుగుతాయని, కార్మికులంతా ఐక్యమత్యంగా ఉన్నందు వల్లనే ఈ తరహా అగ్రిమెంట్ సాధ్యమైందని అన్నారు. వీఎస్టీలో పనిచేసే కార్మికులకు ఈ పదేళ్ల కాలంలో రూ. 70 వేల వేతనం పెరిగిందన్నారు. నూతన అగ్రిమెంట్ ప్రకారం కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ. 8 లక్షల నుంచి రూ. 10 లక్షలకు, కార్మికులు మరణిస్తే రూ. 13 లక్షల నుంచి రూ.16 లక్షలు, మెడికల్ ఇన్సూరెన్స్ కింద రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షలతో పాటు అదనంగా మరో రూ.2లక్షలు అడ్వాన్స్ రూపంలో అందనున్నట్టు తెలిపారు.2016 నుంచి కంపెనీలో పనిచేస్తున్న వారిలో సుమారు 180 మందికి పర్మినెంటు కానున్నట్టు చెప్పారు. ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, ఉపాధ్యక్షులు బాబీ, కోశాధికారి నరేందర్ గౌడ్, రణధీర్ రెడ్డి, మల్లేష్, రాములు, మధు, బిఆర్ఎస్ నాయకులు కొండా శ్రీనివాస్ నేత, సిరిగిరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



'గిరిజనుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తే తిరుగుబాటు తప్పదు

- గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ అంజయ్య నాయక్ హెచ్చరిక

నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలోని 40 లక్షల మంది ఆదివాసీ, గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ద్రోహం చేస్తే తిరుగుబాటు తప్పదని, గిరిజనుల సమస్యలను విస్మరించి వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తే సీఎం కేసీఆర్ కు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో స్థానభ్రంశం కల్పిస్తామని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ అంజయ్య నాయక్ హెచ్చరించారు. ఆదివాసీ, గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపు మేరకు శనివారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమంపై సీఎం కేసీఆర్ అనేక సందర్భాలు, బహిరంగ సభలలో అనేక హామీల వర్షం కురిపించారని, కానీ ఇప్పటి వరకు ఏఒక్క హామీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు.పోడు రైతులకు శాశ్వత పరిష్కారం లభించలేదని, ట్రైకార్ రుణాలను ఎందుకు నిలిపివేశారని, రూ.10 లక్షల గిరిజన బంధు పథకం ఏమైందని ఆయన ప్రశ్నించారు. పోడు



భూములకు శాశ్వత పరిష్కారం కనుగొని రైతులకు యాజమాన్యపు హక్కులను కల్పించాలని, గిరిజనబంధు వెంటనే అమలు చేసి, ట్రైకార్ రుణాలను మంజూరు చేయాలని,తండాల గ్రామా పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగాగుర్తించాలని,పట్టణప్రాంతాల్లో నివసిస్తున్న పేద గిరిజనులకు డబల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని, గిరిజనులపై జరుగుతున్న దాడులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ, గిరిజనుల పట్ల వివక్ష, నిర్లక్ష్యం వీడి వెంటనే రాష్ట్రంలోని ఆదివాసీ, గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని లేకుంటే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు గిరిజనులు తగిన గుణపాఠం చెపుతారని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సమాఖ్య హైదరాబాద్ జిల్లా నేతలు కాట్రవత్ నారాయణ నాయక్, శ్రీను, చత్రునాయక్, దేవరాజ్, విజయ, రుక్మిణి, ప్రేమపాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ఆందోళన



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తు న్న అకౌంటెంట్స్, డీఈఓ ఉద్యో గులను రెగ్యులర్ చేయాలని కోఠి డిఎంహెచ్ఎస్ క్యాంపస్ ఆవరణలో ఏఐటీయూసీ ఆధ్వ ర్యంలో చేస్తున్న ఆందోళన కార్య క్రమాన్ని రెండో రోజు కొనసా గించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యగులకు సమన పనికి సమాన వేతనం (రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్ పే వర్తింపజేయాలి) ఇవ్వాలని డిమాండ్, ఉద్యోగులకు హెల్త్ కార్డులు జారీ చేయాలని చేయాలని, ఇన్సూరెన్స్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. 510జీఓలో విలీనం, డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన సమ్మె కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాల సుబ్రహ్మణ్యం శ్రీమణి, శ్రీలక్ష్మి, భార్గవి, లోకేష్, ప్రకాష్ , బాల్ రెడ్డి, డిఈఓ సరికొండ సురేష్, లక్ష్మి, వసుంధర, అశ్విని, ఉద్యోగులు పాల్గొన్నారు.

119 అసెంబ్లీ స్థానాల్లో మహిళా ఎమ్మెల్యే అభ్యర్థులతో పోటీ

- జై మహా భారత్ పార్టీ జాతీయ అధ్యక్షులు భగవాన్ శ్రీ అనంతవిష్ణు

నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 119 స్థానాల్లో మహిళా ఎమ్మెల్యే అభ్యర్థులతో తెలంగాణలో పోటీ చేయనున్నట్లు జై మహా భారత్ పార్టీ జాతీయ అధ్యక్షులు భగవాన్ శ్రీఅనంతవిష్ణు (ప్రభు) తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో శనివారం సైఫాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తమ పార్టీలో దాదాపు 40 లక్షల మంది కేవలం మహిళలు మాత్రమే ఉన్నారని, అయితే సెప్టెంబర్ 15వ తేదీ లోగా 1 కోటి 20 లక్షల మంది మహిళా ఓటర్లు తమ పార్టీలో చేరే అవకాశాలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే సమసామాజికన్యాయం, సమభాగస్వామ్యం, సుభిక్షమైన సుపరి పాలన, సంపూర్ణ మద్యపాన నిషేధం, జర్నలిస్టులకు జీవన భృతి, పూర్తి నిరుద్యోగ నిర్మూలన, సంపూర్ణ ఉచిత విద్య ఉచిత వైద్యం, మందుల పంపిణీ, ఆడవాళ్ళ పరిరక్షణ, అర్హులైన ప్రతి ఆడవారికి భూలక్ష్మి పథకం ద్వారా 200 చదరపు గజాల ఓపెన్ ఫ్లాట్, ధనలక్ష్మి పథకం ద్వారా 0.25 పైసల వడ్డీ చొప్పున లక్ష రూపాయలు సత్వరమే లోన్ మంజూరు, రైతులు, రైతు కూలీలు, శ్రామికులను బలపరచడం, వ్యవసాయ రంగాన్ని నదుల అనుసంధానంతో నీటి వసతి కల్పించి పటిష్ఠ పరుస్తామని ఆయన హామీలు ఇచ్చినట్లు తెలిపారు. సెప్టెంబర్ 19వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వేలాది మంది మహిళలతో భారీ బహిరంగ సభ నిర్వహించినట్లు తెలిపారు.ఈ సభకు తెలంగాణలోని గ్రామ, మండల స్థాయి నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



భూస్వామ్య వర్గాల ప్రయివేటు సైన్యమే రజాకారులు



- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి.నరసింహ

నవతెలంగాణ-హిమాయత్ నగర్

కరుడుగట్టిన భూస్వామ్య వర్గాల ప్రయోజనాలు కాపాడడం, తిరుగుబాటు చేస్తున్న ప్రజలపై నిరంతరం అణచివేత కొనసా గించడంలో భాగంగానే రజకార్లు అనే ప్రయివేట్ సైన్యాన్ని ఏర్పాటు చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి.నరసింహ అన్నారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం హిమాయత్ నగర్ లోని ఎన్.సత్యనారాయణరెడ్డి భవన్ ఎదుట 'తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరించుకుందాం' సెప్టెంబర్ 11 నుంచి 17వరకు జరిగే వార్షికోత్సవాల భారీ కట్ అవుట్ ను ఏర్పా టు చేశారు.ఈ సందర్భంగా ఈటి.నరసింహ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను ఆనాటి పోరాట ఘట్టాలను, అమరవీరుల త్యాగాలను ప్రజల వద్దకు తీసుకుపోయి మరింత చైతన్యం చేయడానికి ప్రతి సంవత్సరం సీపీఐ కృషి చేస్తుందన్నా రు.రజాకార్లు అంటే కేవలం ముస్లిం సైన్యం అనే తప్పుడు ప్రచారాన్ని కొనసాగిస్తూ తెలంగాణ సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టడానికి కొన్ని సంవత్సరాల నుంచి అనేక ప్రయత్నాలు కొనసాగిస్తున్నారన్నారు. గ్రామాలలో దేశముఖ్‌లు పటేళ్లు, పట్వారిలు ప్రజలపై తీవ్రమైన నిర్బంధాన్ని కొనసాగించి యథేచ్ఛగా తమ దోపిడిని కొనసాగించారన్నారు. ఆనాటి సాయుధ పోరాట స్ఫూర్తితో నేటి పాలకులు కొనసాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు పి.ప్రేంపావని, జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శి స్టాలిన్, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎం.నంసింహ, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి జెరిపోతుల కుమార్, నాయకులు కరుణ, కృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్య మంత్రి డా వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారయణ శని వారం కంటోన్మెంట్ లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యా ర్థులకి పండ్లు పంపిణీ చేశారు. రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూల మాలను అలంకరించి ఆయన సేవ లను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌరీశంకర్ రవి గజూడో నగేష్ యాదవ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పాలియేటివ్ సేవలను వినియోగించుకోవాలి



- హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.వెంకట్

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో పాలియేటివ్ సేవలను వినియోగించుకోవాలని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.వెంకటి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లాలో రెండు పాలియేటివ్ కేర్ సెంటర్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇందులో ఒకటి ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్‌లో ఆరు బెడ్లతో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రెండో కేంద్రం 6 బెడ్లతో రెడ్ క్రాస్ వెనుక ఉన్నట్టు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాదప డుతున్న వారికి సరైన సేవలు అందించి "వారికి స్వాంతన చేకూర్చడమే పాలియేటివ్ కేర్ కేంద్రాల ప్రధాన లక్ష్యం అన్నారు. పాలియేటివ్ కేంద్రాల్లో డాక్టర్లు, ఫిజియోథెర పిస్టు, స్టాఫ్ నర్సులు, ఆయాలు, రోగగ్రస్తులకు సేవలు అందిస్తారని తెలిపారు. 365 రోజులు 24 బై 7 ఈ కేంద్రాలు పని చేస్తాయని పేర్కొన్నారు. రోగులు, వారి సహాయకులకు ఉచిత వసతి, భోజన సదుపాయం ఉన్న ట్టు తెలిపారు. ఉచిత మందులు, ఉచిత పీడీ 3 అం బులెన్స్ ఈచ్ యూనిట్-2- యోథెరపీ చికిత్స, అవసరమైతే ఇంటి వద్ద కూడా ఉచిత చికిత్స అందిస్తారని, ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ప్రతి పాలియేటివ్ కేంద్రం వద్ద అంబులెన్స్‌లు ఉంటాయని, ఇంటి వద్ద బెడ్లకు మాత్రమే పరిమితమైన వారికి, హెల్త్ టీంను తీసుకెళ్లి చికిత్స అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ అశ్రితారెడ్డి, పాల్గొన్నారు.

మెట్రో రైల్ మూడో దశ డీపీఆర్ తయారీ కోసం కన్సల్టెట్ల నియామకం

నవతెలంగాణ-సిటీబ్యూరో

మెట్రో రైలు మూడవ దశ కారిడార్‌ల సవివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికల తయారీకి కన్సల్టెన్సీ సంస్థల ఎంపిక కోసం టెండర్ల ద్వారా 5కన్సల్టెన్సీ సంస్థలు తమ బిడ్లను సమర్పించినట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోలిమిటెడ్ ఎండి ఎన్వీ.యస్.రెడ్డి తెలిపారు. ఈ సంస్థలలో ఆర్వీ అసోసియేట్స్, సిస్ట్రా, యు.ఎం.టి.సీ, రైట్స్ అనే 4 సంస్థలు సాంకేతిక అర్హతను సాధించాయి. వాటి ఆర్థిక బిడ్‌లను ఆగస్టు 30వ తేదీన మెట్రో రైల్ భవన్‌లో తెరిచినట్లు తెలిపారు. ఆర్వీ అసోసియేట్స్ సాంకేతికంగా అత్యంత అధిక మార్కులను పొందడమే కాకుండా మొత్తం 4 ప్యాకేజీలలోను కూడా అన్నిటికన్నా అతి తక్కువ ఆర్థిక బిడ్‌లను సమర్పించిందని ఆయన తెలిపారు. టెండర్ నిబంధనల ప్రకారం ఆర్వీ అసోసియేట్స్‌కి రెండు ప్యాకేజీలను ఇచ్చినట్లు, మిగిలిన రెండు ప్యాకేజీలను సాంకేతిక పరంగా రెండవ స్థానంలో ఉన్న సిస్ట్రా సంస్థ అతి తక్కువ ఆర్థిక బిడ్‌తో సమానంగా తగ్గించగా, ఆ సంస్థకు ఇచ్చినట్లు తెలిపారు. ఈ రెండు కన్సల్టెన్సీ సంస్థలు వచ్చే రెండు నెలల్లో ట్రాఫిక్ సర్వేలు, రవాణా రద్దీ అంచనాలు, ట్రాఫిక్ అంచనాలు, పలు రకాల రవాణా వ్యవస్థల విశ్లేషణ వంటి వివిధ అధ్యయనాలు పూర్తిచేసి ప్రిలిమినరీ ప్రాజెక్ట్ నివేదికలను సమర్పించాలన్నారు. ఆ తరువాత మూడు నెలల్లో మెట్రో రైలు అలైన్‌మెంట్, వయాడక్ట్/భూమి ఉపరితల మార్గం/భూగర్భ మార్గం వంటి ఆప్షన్‌లు, స్టేషన్లు డిపోలు, రైల్వే విద్యుత్ ఏర్పాట్లు, సిగ్నలింగ్ మరియు రైల్వే సమాచార వ్యవస్థ, రైలు బోగీలు, పర్యావరణం, సామాజిక ప్రభావం, ఆదాయ వ్యయ అంచనా, ఛార్జీల పట్టిక , ప్రాజెక్టు అమలు విధానం వంటి విషయాలపై సవివరణాత్మక ప్రాజెక్టు నివేదికలను లను సమర్పించవల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు ఆదేశానుసారం ఈ కన్సల్టెన్సీ సంస్థలను వివిధ కారిడార్ లలో సత్వరమే సర్వే పనులను ప్రారంభించాలని ఆదేశించినట్లు యండి తెలిపారు.



ఎమ్మెల్యే టికెట్ బిజిని శ్రీనివాస్‌కు ఇవ్వాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గోషామహల్ నియోజక వర్గం నుండి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ను ఉద్య మకారులకే కేటాయించాలని గోషామహల్ ట్రేడర్స్ అసోసియేషన్ నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్లేవుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆవిర్భావం నుండి పార్టీలో ఉంటూ, తమ సాదక బాధకాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరి స్తున్న ఉద్యమకారుడు బిజిని శ్రీనివాస్‌కు బీఆర్ఎస్ టికెట్ కేటాయించాలని కోరారు. గోషామహల్ నుండి టికెట్ ఆయనకు కేటాయిస్తే తాము గెలిపించుకొని, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇస్తామని వారు స్పష్టంచేశారు.



ఆ గ్రామానికి ఆమె మొదటి సర్పంచ్

అది మహారాష్ట్రలోని గాడ్చిరోలి అనే మారుమూల గ్రామం. పదహారేండ్లుగా ఆ గ్రామానికి సర్పంచ్ లేరు. అలాంటి చోట ప్రజలు 24 ఏండ్ల యువతిని మొదటి సారి తమ గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహారాష్ట్రలోని నక్సల్ ప్రభావిత ప్రాంతం అది. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా గిరిజనుల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు కృషి చేస్తున్నది. బాల్య వివాహాలను అరికట్టేందుకు, చదువులో వారిని ప్రోత్సహించేందుకు, స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు విరామమెరుగక శ్రమిస్తుంది. ఆమే భాగ్యశ్రీ మనోహర్ లేఖమి. ఆమె గురించి మరిన్ని విశేషాలు మానవి పాఠకుల కోసం...



మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలోని భామ్రాగఢ్ తహసీల్ గ్రామంలో బాల్య వివాహాలు సర్వసాధారణం. ప్రజారోగ్య కేంద్రాలలో వైద్యులు చాలా అరుదుగా కనిపిస్తారు. గిరిజన పురుషులు నక్సల్స్ పేరుతో ఏండ్ల తరబడి జైల్లో మగ్గుతున్నారు. అలాంటి ప్రాంతంలో ప్రతిరోజు కోటి అనే తన గ్రామం నుంచి సర్పంచ్ భాగ్యశ్రీ ఉదయం టీ తాగేసి అక్కడి పరిస్థితుల్లో మార్పు తీసుకొచ్చేందుకు సరికొత్త ప్రణాళికతో తన మోటార్ సైకిల్‌పై బయలుదేరుతుంది. తన పరిధిలోని తొమ్మిది గ్రామాల్లో ఒక గ్రామాన్ని ఎంచుకుని ఆ రోజంతా వారితోనే ఉండిపోతుంది. తన ఆలోచనలు మాత్రమే కాదు తన భోజనం కూడా ఆ రోజు ఆ గ్రామ ప్రజలతోనే.

నక్సల్ ప్రాంతమనీ...

విద్యుత్ సరఫరా కోసం అక్కడి ఎలక్ట్రిక్ మీటర్ల స్థితిని తనిఖీ చేయించడం, మరుగుదొడ్లు, పక్కా గృహాల నిర్మాణంతో పాటు బాల్య వివాహాలను ఆపడం, వారు మళ్ళీ బడికి వెళ్ళి చదువుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం ఆమె లక్ష్యం. భాగ్యశ్రీ నివసించే కోటి గ్రామ పంచాయతీకి 2003 నుండి సర్పంచ్ లేరు. ఎందుకంటే నక్సల్స్ ప్రాబల్యం ఉన్న ప్రాంతంలో పని చేయడానికి ఎవరూ ఆసక్తి చూపలేదు. భాగ్యశ్రీ తల్లి అంగన్‌వాడీ టీచర్, తండ్రి తహసీల్ స్థాయి టీచర్. వీరు అధికారిక పత్రాల కోసం దరఖాస్తు చేయడం, రిజిస్ట్రేషన్ ఫారమ్‌లు నింపడం, బ్యాంక్ ఖాతాలు తెరవడంలో గ్రామస్తులకు సహకరిస్తుంటారు.

గ్రామాన్ని మార్చుకోవడానికి

2019లో పంచాయితీలో చదువు పూర్తి చేసిన అతికొద్ది మంది బాలికలలో భాగ్యశ్రీ ఒకరు. మాదియా గిరిజన సంఘం (ఈ ప్రాంతంలోని జనాభాలో ఆధిపత్యం చెలాయిస్తుంది) ద్వారా స్వతంత్ర అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలా భాగ్యశ్రీ ఆ గ్రామానికి మొదటి సర్పంచ్‌గా చరిత్ర సృష్టించారు. అప్పుడు ఆమె వయసు 20 ఏండ్లు. ఆమె వాలీబాల్ ఛాంపియన్ కూడా. 'వాస్తవానికి నేను అథ్లెట్ కావాలని కోరుకున్నాను. కానీ నాకు 20 ఏండ్లు వచ్చే వరకు మా ఇంట్లో కరెంటు లేదు. ఆదివాసీలుగా మాకు ఏ ప్రభుత్వ ప్రాధాన్యతా లేదు. మా గ్రామాన్ని మార్చుకోవడానికి నేను ఈ బాధ్యతను ఒక అవకాశంగా భావించాను' అంటున్నారు ఆమె.

రోజువారీ సవాలు

సర్పంచ్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత భాగ్యశ్రీ ప్రతి రోజూ ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చేది. 'చిన్నప్పుడు నేను రోజంతా ఆరు బయట ఆడుకునే దాన్ని. నాకు కావలసినవి ధరించేదాన్ని. నన్ను నా తల్లిదండ్రులు కొడుకులా పెంచారు. కానీ మొదటిసారిగా గ్రామ సర్పంచ్‌గా ఉన్న నన్ను కొందరు అనుచితంగా తాకడానికి, ఎగతాళి చేయడానికి ప్రయత్నించేవారు. అక్కడ ఎవరినీ ఏమీ అనేదాన్ని కాదు. ఇంటికి వచ్చి మా అమ్మకు చెప్పుకుని ఏడ్చేదాన్ని. అయితే బయట పరిస్థితులకు అనుగుణంగా మారాలని మా అమ్మ నాకు ధైర్యం చెప్పింది. అప్పుడు నేను బయట బిగ్గరగా, నమ్మకంతో మాట్లాడాలని నిర్ణయించుకున్నాను' అంటూ ఆమె అప్పటి రోజులు గుర్తు చేసుకున్నారు.

అది నా బాధ్యత

ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం అవసరమైన విద్యార్థులకు భాగ్యశ్రీ సహాయం చేస్తున్నారు. అలాగే తనకు సమయం దొరికినప్పుడు రుతుక్రమ ఆరోగ్యం, పరిశుభ్రత గురించి కూడా అవగాహన కల్పిస్తున్నారు. 'ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి ప్రాథమిక వనరులను పొందడం గిరిజన సమాజానికి ఒక పెద్ద పనిగా నేను చూస్తున్నాను. ఈ పనులేమీ అక్కడ ఆగకుండా చూడడం నా బాధ్యత. తలపెట్టిన పనులేమీ మధ్యలోనే ఆగిపోకుండా పట్టుదలతో కృషి చేస్తున్నాము' అని ఆమె అంటున్నారు. విద్యుత్ మీటర్ల కోసం దరఖాస్తు చేసుకున్న గ్రామాలు విద్యుత్ సరఫరా కోసం ఆరు నెలలు వేచి ఉన్నాయి. అలాంటి ఈరోజు ఆమె పరిధిలోని తొమ్మిది గ్రామాలలో ఆరు గ్రామాలకు విద్యుత్ సౌకర్యం ఉంది. 150 కంటే ఎక్కువ కచ్చా ఇళ్లు పక్కా గృహాలుగా పునర్నిర్మించబడ్డాయి. నీటి సరఫరాతో మరుగుదొడ్లు కూడా ఉన్నాయి.





ఇప్పుడు మార్పు వచ్చింది

తమ పంచాయతీలోని ప్రజారోగ్య కేంద్రాలను వైద్యులు నిర్లక్ష్యం చేయడంతో వర్షాకాలం తర్వాత చిన్నారుల్లో మలేరియా కేసులు పెరుగుతున్నాయి. 'మా గ్రామాలకు వచ్చి వైద్య సేవలు అందించేందుకు వైద్యులు రోడ్లు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు కోరుతున్నారు. కానీ మా కమ్యూనిటీ పట్ల విపరీతమైన వివక్ష ఉంది. మమ్మల్ని ఎవరూ పట్టించుకోరు. పాఠశాలలు కూడా ఇలాంటి సమస్యనే ఎదుర్కొంటున్నాయి. గ్రామంలో చాలా రోజులుగా పని చేస్తున్న ఏకైక ఉపాధ్యాయుడు మా నాన్న. ఎవరూ ఇక్కడ పని చేయాలనుకోరు. దీనికి నక్సలిజాన్ని ఓ కారణంగా చూపేవారు. ఇప్పుడు పరిస్థితి చాలా వరకు మారింది. నేను నా ప్రజల కోసం నిలబడినందుకు సంతోషంగా ఉంది. సమస్యలను పరిష్కరించుకుంటే మా పరిస్థితులను మార్చుకోవచ్చని నేను తెలుసుకున్నాను. ఆ మార్పు పూర్తిగా వచ్చే వరకు నేను నా ప్రయత్నాలను ఆపను' అంటూ భాగ్యశ్రీ తన మాటలు ముగించారు.

బాల్య వివాహాలు నిర్మూలించేందుకు

చంద్రాపూర్‌లోని రాష్ట్రీయ శారీరక్ శిక్షన్ మహా విద్యాలయం నుండి ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో బిపె చేస్తున్న ఈ యువ నాయకురాలు ఓ మహిళా సర్పంచ్‌గా తనకు వస్తున్న సవాళ్ళను ఎప్పటికప్పుడు ఎదుర్కొంటూనే వుంది. వాటిని ఎలా పరిష్కరించుకోవాలో, అనుకున్న లక్ష్యం ఎలా చేరుకోవాలో నేర్చుకుంది. 'గ్రామస్తులు నాతో, నా ఆలోచనలతో విభేదించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా వారు ఆడపిల్లలను చదవించడానికి, దాని కోసం డబ్బు ఖర్చు పెట్టడానికి అస్సలు ఇష్టం పడరు' అంటున్నారు ఆమె. అందుకే భాగ్యశ్రీ ఓ నిర్ణయం తీసుకున్నారు. బాల్య వివాహాలను తగ్గించేందుకు అమ్మాయిలను తమ గ్రామానికి చాలా దూరంలో ఉన్న చంద్రాపూర్‌లోని రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించడం ప్రారంభించింది. 'వారు సెలవులకు మాత్రమే ఇంటికి వస్తారు. అక్కడ చదువుకుంటూ క్రీడల్లో కూడా రాణిస్తారు. దాంతో వాళ్ళకు చదువుపై ఆసక్తి పెరుగుతుంది. ఇంట్లో పెండ్లి ఆలోచన కూడా పెద్దగా రాదు' అంటున్నారు.

స్నేహం అవసరం...

స్నేహాన్ని నిర్వచించడం చాలా కష్టం. మాటలకు అందని బంధం. మన గురించి మనకు గొప్పగా అనిపించేలా చేసే వారు స్నేహితులనడంలో సందేహం లేదు. లైఫ్‌లోని కష్టమైన పరిస్థితులు కూడా మనకు తేలిగ్గా కనపడేలా చేస్తారు. కేవలం సుఖాల్లోనే కాదు కష్టాల్లో కూడా స్నేహితులు తోడుంటారు. ప్రపంచం మొత్తం ఒంటరిని చేసినా స్నేహితులు మాత్రం పక్కనే ఉంటారు. అలాంటి స్నేహం గురించి...

- ప్రతి ఒక్కరూ లైఫ్‌లో ప్రత్యేక పరిస్థితులను ఎదుర్కొంటారు. అటువంటి సమయంలో మనసులోని బాధనంతా బయటపెట్టడానికి ఒక స్నేహం కావాలి. స్నేహితుల దగ్గరే మనసు విప్పి మాట్లాడగలుగుతారు. మనసును తేలిక పరుస్తారు. చెప్పేదంతా ఓర్పుతో వింటారు. కష్టమైన దశను దాటడానికి సలహాలు ఇస్తారు. కష్ట సమయంలో అవసరమైన స్నేహ హస్తాన్ని అందిస్తారు. పరిస్థితి ఎలా ఉన్నా పాజిటివ్ ఎనర్జీని ఇవ్వడానికి స్నేహితులు ఎప్పుడూ ముందుంటారు.

- మన కోసం టైమ్ కేటాయించడానికి ఫ్రెండ్స్ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. ఫ్రెండ్స్ లేకపోతే ఇంట్లోనే ఒంటరిగా కూర్చుని టీవీ చూడడం గానీ వీడియో గేమ్స్ ఆడటం గాని చేస్తుంటారు. ఫ్రెండ్స్ ఉంటే మనసు యాక్టివ్‌గా ఉంటుంది. దీని వల్ల హెల్తీ లైఫ్‌స్టైల్‌ను మెయింటెయిన్ చేయడం సాధ్యమవుతుంది.

- ఫ్రెండ్స్ సీక్రెట్ బ్యాంక్స్ లాంటివారు. ప్రతి ఒక్కరికీ లైఫ్‌లో కొన్ని రహస్యాలు ఉంటాయి. ఫ్రెండ్స్‌తో సీక్రెట్ షేర్ చేయడం ఎంతో సురక్షితం. మీ ఫస్ట్ క్రష్‌తో మొదలుపెడితే ఫ్యామిలీ ప్రాబ్లెమ్స్ ఇలా ఎన్నో విషయాలు షేర్ చేసుకోవచ్చు.

- కొన్ని సార్లు మన సామర్థ్యం పట్ల, మనం తీసుకునే నిర్ణయాల పట్ల మనకే నమ్మకం కలగదు. అటువంటి సమయంలో ఫ్రెండ్స్ మనకు కావాల్సినంత నమ్మకాన్ని ఇస్తారు. ముందడుగు వేసే ధైర్యం ఇస్తారు. ఎంత కష్టమైన టాస్కైనా సరే అఛీవ్ చేసే కాన్ఫిడెన్స్ వారి వల్లే సాధ్యమవుతుంది. కలలు నిజమయ్యేందుకు, గోల్స్‌ను చేరుకోడానికి సహాయం చేస్తారు. లైఫ్‌లో ముందడుగు వేయడానికి ఇది ఎంతో అవసరం.

- ఫ్రెండ్స్‌తో ఉన్నప్పుడు మనం మనలా ఉండవచ్చు. మేకప్ అవసరం లేదు, స్టైల్‌గా రెడీ అవ్వాల్సిన అవసరం కూడా లేదు. ఇవన్నీ ఫ్రెండ్స్ పెద్దగా పట్టించుకోరు. మనల్ని మనలాగానే ఇష్టపడతారు. వారు మనలోని అన్ని కోణాలను చూసేసారు. మన మనసులో ఏముందో కూడా ఇట్టే కనిపెట్టేస్తారు. వీక్‌నెస్, లోపాలు.. ఇలా ప్రతీది వారికి తెలుసు. స్నేహితుల ముందు నటించనక్కర్లేదు. కాబట్టి ఫ్రెండ్స్‌తో ఉంటే కంఫర్ట్ జోన్‌లో ఉన్నట్టే.



దుర్మార్గం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలోని బాబూరావుపేట శివారు ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను తగలబెట్టడం, మహిళలపై దౌర్జన్యం చేసి దాడి చేయడాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటన అత్యంత దుర్మార్గమని విమర్శించింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాబూరావుపేట శివారులో ఉన్న ప్రభుత్వ, అసైన్‌మెంట్ భూమిలో ఇండ్లులేని నిరుపేదలు సుమారు 1,600 కుటుంబాలు గుడిసెలు వేసుకుని గత కొన్ని నెలలుగా నివాసముంటున్నాయని తెలిపారు. ఈ భూమిని మోసపూరితంగా పట్టా చేసుకున్న కబ్జాదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుమ్మక్కై శనివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో, వారి కిరాయి గూండాలను పంపి ట్రాక్టర్లతో గుడిసెలను కూల్చి, పెట్రోల్ పోసి తగలబెట్టించారని వివరించారు.

అడ్డొచ్చిన వారిపై కులంపేరుతో దూషిస్తూ కర్రలతో దాడిచేశారని పేర్కొన్నారు. ప్రాధేయపడ్డ మహిళలను అమానుషంగా మంటలలో వేసే ప్రయత్నం చేశారని తెలిపారు. పేదలకున్న కొద్దిపాటి వస్తువులు, నిత్యావసర సరుకులు, నగదు కూడా పూర్తిగా కాలిబూడిదయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. జగిత్యాల పట్టణంలోనూ పేదలు వేసుకున్న గుడిసెలను నేలమట్టం చేశారని పేర్కొన్నారు. ఇండ్లు లేని పేదలకు శనివారం నుంచి డబుల్ బెడ్రూమ్‌లు కేటాయిస్తున్నామంటూ ఢంకా బజాయించి చెప్పున్న ప్రభుత్వం తలదాచుకునే గూడు లేక సర్కారు భూమిలో గుడిసెలు వేసుకుంటే, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై వాటిని కూల్చేయటం అత్యంత దారుణమని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ ఘటనకు పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలనీ, పేదల గుడిసెలకు రక్షణ కల్పించాలనీ, గుడిసెవాసులందరికీ పట్టాలివ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆదిత్య ఆల్ ది బెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

క్షేత్రాలపై పరిశోధనలు చేస్తాయి. ఐదు పేలోడ్స్‌ను ఇస్రో సారథ్యంలో తయారు చేశారు. మరో రెండు ఇస్రో సహకారంతో భారతీయ విద్యాసంస్థల ద్వారా రూపొందించారు. ఆదిత్య ఎల్1 మిషన్ 16 రోజుల పాటు భూకక్ష్యలో తిరుగుతూ ఉంటుంది. భూమిచుట్టూ నాలుగుసార్లు తిరిగిన తరువాత

సూర్యుని వైపుకు ప్రయాణిస్తుంది.

శాస్త్రవేత్తలకు ప్రధాని, రాష్ట్రపతి అభినందనలు

ఆదిత్య ఎల్-1ను విజయవంతంగా ప్రయోగించిన శాస్త్రవేత్తలకు ప్రధాని నరేంద్రమోడీ అభినందనలు తెలిపారు. 'చంద్రయాన్ -3 విజయం తర్వాత భారత్ తన అంతరిక్ష యాత్రను కొనసాగిస్తున్నది. ప్రపంచ మానవాళి సంక్షేమం కోసం విశ్వంపై మంచి అవగాహన పెంపొందించడానికి అవిశ్రాంతంగా శాస్త్రీయ ప్రయత్నాలు కొనసాగుతాయి' అని మోడీ ట్వీట్ చేశారు. కాగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. ఈ సందర్భంగా 'భారతదేశపు మొట్టమొదటి సౌర మిషన్ అయిన ఆదిత్య-ఎల్1 ప్రయోగం భారతదేశ స్వదేశీ అంతరిక్ష కార్యక్రమాన్ని కొత్త పథంలోకి తీసుకెళ్లే ఒక మైలురాయి సాధన. ఇది అంతరిక్షం, ఖగోళ దగ్విషయాలను బాగా అర్థం చేసుకోవడానికి మనకు ఎంతగానో సాయపడుతుంది. శాస్త్రవేత్తలు, ఇంజినీర్లను నేను అభినందిస్తున్నాను. మిషన్ విజయవంతం అయినందుకు నా శుభాకాంక్షలు' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

విజయవంతంగా కక్ష్యలోకి ఆదిత్య ఎల్1..
హర్షం వ్యక్తం చేసిన సీఎం కేసీఆర్

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శనివారం 'ఆదిత్య ఎల్1' ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో అంతరిక్ష పరిశోధనా రంగంలో మరో కీలక మైలురాయిని దాటిందని ఆయన పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనా రంగంలో ప్రపంచానికి ఆదర్శంగా దేశ శాస్త్రవేత్తలు సాధిస్తున్న ప్రగతి, ప్రతి భారతీయుడు గర్వపడేలా చేసిందన్నారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మెన్, శాస్త్రవేత్తలు, ఇతర సాంకేతిక సిబ్బందిని అభినందిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

పేదల గుడిసెలు ధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొన్నారని బాధిత మహిళలు పేర్కొంటున్నారు. వేసుకున్న గుడిసెల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు పేదలు రెండుసార్లు విన్నవించారు. ఆర్‌డీఓతో పాటు కలెక్టర్‌కు సైతం వినతిపత్రాలిచ్చారు. అసైన్డ్ భూమి పేదలకే ఇవ్వాలని కోరితే అధికారులు కూడా అంగీకరించారు. కానీ.. ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల అండతో భూకబ్జాదారులు దౌర్జన్యానికి పాల్పడ్డారు.

ప్రభుత్వ పెద్దల అండతోనే భూకబ్జాదారులు పేదలు వేసుకున్న గుడిసెలను ధ్వంసం చేశారని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిసెల ప్రాంతాన్ని ఆయన సందర్శించి బాధితులతో మాట్లాడారు. అనంతరం కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశయ్య మాట్లాడుతూ.. కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకూ పోరాటం చేస్తామన్నారు. కబ్జాదారులైన ప్రభాకర్‌రెడ్డి, తాటి శ్రీనివాస్, సదానందం, సత్యనారాయణరెడ్డిపై కేసు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం భూకబ్జాదారుల గూండాగిరిని అరికట్టకుండా ప్రభుత్వ భూమిని కాపాడుతున్న పేదలపై కేసులు పెడుతోందన్నారు. భూకబ్జాదారులు దాడులు చేస్తుంటే ప్రభుత్వ యంత్రాంగం కండ్లప్పగించి చూస్తోందని విమర్శించారు. రెవెన్యూ అధికారులు భూకబ్జాదారుల వద్ద ముడుపులు తీసుకుని ప్రభుత్వ భూమిని అప్పనంగా అప్పగిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని కబ్జాదారుల అక్రమ పట్టాలను రద్దు చేసి, భూమిని పేదల ఇండ్ల స్థలాలకు ఇచ్చి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యులు బొడెంకి చందు, నాయకులు, ఎండీ అవేజ్, పేదలు తుమ్మ రేణుక, మణి, భూదేవి, ఉమారాణి, రుక్సానా, రుక్మిణి, శ్రీనివాస్, నగేష్, సమ్మక్క, సంధ్య, సాదిక్, అనిల్, కుమార్, సరిత ఉన్నారు.

వ్యవసాయాన్ని వైఎస్ఆర్ పండుగ చేశారు

- ఎన్నో పథకాలకు రూపకల్పన చేశారు
- 'రైతే రాజైతే' పుస్తకావిష్కరణలో పాలగుమ్మి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



వ్యవసాయ సంక్షోభ సమయంలో పాదయాత్ర చేపట్టిన వైఎస్ రాజశేఖరరెడ్డి రైతుల కష్టాలను చూసి చలించిపోయారని ప్రముఖ పాత్రికేయులు పాలగుమ్మి సాయినాథ్ చెప్పారు. సంక్షోభం నుంచి వ్యవసాయాన్ని గట్టేక్కించుకు ఎన్నో పథకాలు రూపొందించారని గుర్తు చేశారు. రైతు సమస్యలు, రైతు ఉద్యమాల పట్ల వెంటనే స్పందించేవారని తెలిపారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజా అనుకూల విధానాలను అమలు చేశారని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, మాజీ వ్యవసాయశాఖ మంత్రి రఘువీరారెడ్డి రచించిన 'రైతే రాజైతే...వ్యవసాయం పండుగే' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయినాథ్ మాట్లాడుతూ ఆయా కంపెనీలు విత్తనాల ధరలు పెంచినప్పుడు అధికారంలోకి వచ్చాక వాటిని తగ్గించారని తెలిపారు. మోన్‌సెంటో లాంటి విత్తన కంపెనీ మెడలు వంచి ధరలు తగ్గించేలా చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చిందని చెప్పారు. ఆ చట్టాలకు వ్యతిరేకంగా ఏడాదిపాటు రైతులు ఉద్యమించి, విజయం సాధించారని చెప్పారు. ఆ ఉద్యమంలో దాదాపు 725 మంది రైతులు చనిపోయారని వివరించారు. ప్రజాస్వామ్యయుతంగా, శాంతియుతంగా నిర్వహించిన రైతు ఉద్యమంలో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న కేంద్ర ప్రభుత్వం...రైతులను కష్టాలపాలు చేసిందన్నారు.రైతుల ఆదాయం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. ఇప్పుడు రాజశేఖర్ రెడ్డి బతికుంటే రైతులకు మేలు చేసి ఉండేవారని చెప్పారు. మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ మాట్లాడుతూ వైఎస్ఆర్‌తో నా అనుబంధం విడదీయరానిదని తెలిపారు. పార్టీ నిర్మాణంలో యుక్త వయస్సు నుంచే కీలకంగా పని చేశారన్నారు. ఉచిత విద్యుత్ వైఎస్సార్ మానసపుత్రిక అన్నారు.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే జలయజ్ఞం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కొనియాడారు. ఆయన మరణించకపోతే తెలుగు రాష్ట్రాలు మరోలా ఉండేవన్నారు. శత్రువులు కూడా మెచ్చే గుణం ఆయనకుందన్నారు. ఆయన బతికుంటే బీజేపీ తీసుకొచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో ధర్నా నిర్వహించేవారని తెలిపారు. 2004, 2009లో యూపీఏ ప్రభుత్వం ఏర్పడటంలో ఆయన కీలకంగా వ్యవహరించారని తెలిపారు. దేశంలో ఇప్పుడు ఉన్న విపత్కర పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడే వారని గుర్తు చేశారు. సీపీఐ జాతీయ నేత డాక్టర్ కె నారాయణ మాట్లాడుతూ వైఎస్ఆర్‌తో విపక్షాలు విభేదించినా గౌరవించేవారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే ఆయనపై ఆర్థిక దాడులు జరిగాయని తెలిపారు. దాంతో తన బ్రైటీస్ వ్యాపారాన్ని మూసేశారని వివరించారు. ఆ సమయంలో ప్రాంతీయ పార్టీ పెడతారా? అని నేను అడిగాననీ, కాంగ్రెస్‌తోనే ఉంటానని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి నరసింహరెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రరాజు, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ నేత కొప్పుల రాజు తదితరులు మాట్లాడారు.

దురాలోచన !

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటన. 'ఒకే దేశం...ఒకే ఎన్నిక' నినాదంలో భాగంగా దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించాలని, అందుకోసం లోక్‌సభ ఎన్నికలను ముందుకు జరపాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వదంతులు వ్యాపిస్తున్నాయి. దీనిపై ప్రభుత్వం హడావిడిగా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది కూడా. అంతేకాదు... ఇందులో ప్రభుత్వ దురుద్దేశం కూడా ఉంది. దేశంలో ప్రతిపక్షాలకు అనుకూలంగా మారుతున్న వాతావరణాన్ని దెబ్బ తీసేందుకే మోడీ ప్రభుత్వం జమిలి ఎన్నికల ప్రతిపాదనను ముందుకు తెస్తోంది. నరేంద్ర మోడీ సన్నిహితుడైన పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి వ్యతిరేకంగా తాజాగా బయటపడిన అవినీతి ఆరోపణలు దేశంలో దుమారం రేపుతున్నాయి. దీని నుండి ప్రజల దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం జమిలి ఎన్నికలపై హడావిడి చేస్తోందన్న వాదన కూడా వినిపిస్తోంది.

బలపడుతున్న ఇండియా

ఈడీ, సీబీఐ వంటి ప్రభుత్వ విచారణ సంస్థలు ఎన్ని దాడులు చేస్తున్నప్పటికీ ప్రతిపక్ష ఇండియా కూటమి రోజురోజుకూ బలోపేతమవుతోంది. ఎన్నికలలో ముఖాముఖి పోరు తప్పదన్న అభిప్రాయం సర్వత్రా విన్పిస్తోంది. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణను మినహాయిస్తే దేశంలోని మిగతా ప్రాంతాలలో బీజేపీ కూటమి, ఇండియా కూటమి మధ్య ద్విముఖ పోరు జరగడం ఖాయంగా కన్పిస్తోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంపై ఇండియా కూటమిలో అంతర్గ తంగా ఏకాభిప్రాయం కుదిరిందని సమాచారం. సీట్ల సర్దుబాటే ప్రధాన సమస్య. అయినప్పటికీ కలసికట్టుగా పోరాడాలని ప్రతిపక్షాలు అభిప్రాయపడుతున్నందున బీజేపీకి సవాలు తప్పేలా లేదు. ఎందుకంటే 2019 ఎన్నికలలో ఎన్డీయే కూటమికి 42% ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆ తరువాత అనేక భాగస్వామ్య పక్షాలు ఆ కూటమికి టాటా చెప్పాయి. బీజేపీ ప్రభుత్వ విధానాల పట్ల అసంతృప్తి అంతకంతకూ పెరగడంతోపాటు, క్రమేణా మోడీ హవా తగ్గిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇండియా కూటమి బలోపేతం కావడం బీజేపీకి సవాలుగా పరిణమించింది.

డిసెంబర్‌లోనే ఎన్నికలు?

ఓ వైపు ఇండియా కూటమి సమావేశమవుతున్న సమయంలోనే బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ 'ప్రత్యేక' సమావేశాలపై ప్రకటన చేసింది. ఇండియా కూటమి సమావేశంపై మీడియాలో వస్తున్న ప్రచారాన్ని పక్కదారి పట్టించేందుకే ఈ సమావేశాలను ముందుకు తెచ్చారన్న వాదన విన్పిస్తోంది. డిసెంబర్ లోనే సార్వత్రిక ఎన్నికలు జరిపేందుకు వీలుగా ఈ సమావేశాలు ఆలోచన అని అభిప్రాయ మూ వ్యక్తమవుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రతిపక్ష కూటమి ఐక్యత నుండి ప్రజల దృష్టి మరలిం చేందుకే కేంద్రం ఈ వ్యూహం పన్నినట్లు అర్థమవుతోంది.

మా పార్టీ కార్యకర్తలకే పథకాలు..

నవతెలంగాణ - చిన్నగూడూరు

"మాకు ఓటు వేయని వాళ్లకు ప్రభుత్వ పథకాలు ఇచ్చేదే లేదు.. మా పార్టీ కార్యకర్తలకే పథకాలు ఇస్తాం.. ఎన్నికల్లో ఎట్లా గెలవాలో నాకు బాగా తెలుసు" అంటూ డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పల్లెకు మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా శనివారం అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. విస్సంపల్లి గ్రామంలో సమావేశంలో మాట్లాడుతుండగా.. దళితబంధు ఇవ్వలేదని స్థానిక యువకులు రైతు సమితి మండల కోఆర్డినేటర్ మంగపతిరావును నిలదీశారు. పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాకు ఓటు వేయని వాళ్లకు ఇచ్చేదే లేదని, మా పార్టీ కార్యకర్తలకే పథకాలు ఇస్తామని అన్నారు. మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వల్లూరి పద్మా వెంకట్ రెడ్డి, సర్పంచులు విద్యుల్లత, సరస్వతి, మల్లయ్య, వైస్ ఎంపీపీ వీరయ్య, మండల కో ఆప్షన్ మోసీన్ బేగ్, ఎంపీడీవో శ్యాంసుందర్, ఎమ్మార్వో మహబూబ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామ్‌సింగ్ పాల్గొన్నారు.

పార్టీ విలీనంపై కాంగ్రెస్‌తో తుది దశకు చర్చలు

(మొదటిపేజీ తరువాయి)

ఆయన పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చారని సోనియా, రాహుల్ తనకు వివరించారని తెలిపారు. కేసీఆర్ అవినీతి పాలను అంతమొందిచటానికే సోనియాతో చర్చలు జరిపినట్టు వెల్లడించారు. ఆయన్ని గద్దె దించే అంశంపై వారితో సుదీర్ఘంగా చర్చలు జరిపినట్టు తెలిపారు. తమ క్యాడర్, లీడర్లతో మాట్లాడాక విలీనంపై మీడియాకు వెల్లడిస్తామని చెప్పారు. తెలంగాణలో తాను 3,800 కి.మీ పాదయాత్ర చేశానని గుర్తు చేశారు. కేసీఆర్ పాలన పోతేనే తెలంగాణకు మంచి జరుగుతుందన్నారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు కలసి రావాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాలంటే వండినట్లు.. తిన్నట్లు కాదన్నారు. తనతో నడిచిన వారిని తనతో పాటు నిలబెడుతానని షర్మిల పేర్కొన్నారు.

జీ 20ని హైజాక్ చేయాలనుకుంటున్నారు !

(మొదటిపేజీ తరువాయి)

చేర్చాలని చూస్తున్నారు" అని వ్యాఖ్యానించారు.

"జీ 20 దేశాలు ఆర్థిక, ద్రవ్యపరమైన అంశాలపైనే దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది. కానీ గత ఏడాది నుండి, కొన్ని రాజకీయ అంశాలను కూడా చర్చించాలని ఈ గ్రూపులోని కొంతమంది సభ్యులు నిర్ణయించారు. అది మాకు ఆమోద యోగ్యం కాదు" అని అలీపోవ్ చెప్పారు. ఈ అంశాన్ని ఎజెండాలో భాగంగా చేర్చడంపై ఏకాభిప్రాయం రాని పక్షంలో దాన్ని తొలగించాలని అన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను చర్చించి, స్పందించేందుకు జీ 20 ఏర్పాటైందని, భౌగోళిక, రాజకీయ సమస్యల కోసం కాదని చెప్పారు. మరే ఇతర సముచితమైన వేదికలపైనైనా ఉక్రెయిన్ యుద్ధం గురించి చర్చించడానికి మాస్కో సిద్ధంగా వుందన్నారు. జీ 20కి అధ్యక్షురాలిగా భారత్‌కు గల ప్రాధాన్యతలకు రష్యా మద్దతిస్తుందన్నారు.

వీటిలో సుస్థిర అభివృద్ధి, వాతావరణ మార్పులు, సర్వతోముఖాభివృద్ధి, డిజిటల్‌కు పరివర్తన వంటి అనేక అంశాలు వున్నాయన్నారు. భారత్ ఇప్పటికే ఏదైతే ఎజెండా పెట్టిందో దానిపైనే చర్చజరగగలదని ఆశిస్తున్నట్లు రష్యా పేర్కొంది. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ పాత్ర గురించి మాట్లాడుతూ, అతి త్వరలోనే నిర్ణయాత్మక కేంద్రాల్లో ఒకటిగా భారత్ మారుతుందని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయంగా, సమానత్వం, న్యాయంతో కూడిన బహుళ ధ్రువ ప్రపంచానికి మద్దతునివ్వాలన్నదే తమ ప్రాధాన్యత అని అలీపోవ్ చెప్పారు. బ్రిక్స్, ఎస్‌సిఓ విస్తరణల్లో వర్ధమాన ప్రపంచం పెరుగుతున్న ప్రయోజనాలు ప్రతిబింబిస్తున్నాయన్నారు.

రాజస్థాన్‌లో అమానుషం

భార్యను వివస్త్రను చేసి ఊరేగించిన కసాయి

- భర్తసహా ఏడుగురి అరెస్టు
- బాధితురాలికి సీఎం పరామర్శ
- ప్రభుత్వ ఉద్యోగం, రూ.10లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ ఇస్తామని హామీ



జైపూర్ : మణిపూర్‌లో ఇద్దరు మహిళల్ని నగ్నంగా ఊరేగించిన ఘటన మరువకముందే రాజస్థాన్‌లో మరొక దారుణ ఘటన వెలుగులోకొచ్చింది. ఓ గిరిజన మహిళ (21)ను ఆమె భర్తే విపరీతంగా కొట్టి, వివస్త్రను చేసి గ్రామంలో ఊరేగించాడు. రాజస్థాన్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లా నిచల్‌కోటా గ్రామంలో గురువారం జరిగిన ఈ ఘటనపై వీడియో వైరల్ అవడంతో, భర్తసహా ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ప్రతాప్‌గఢ్ జిల్లా ఎస్‌పి అమిత్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ కన్హా గమేటి తన భార్య అత్తింటికి రాకుండా వేరొకరితో సహజీవనం చేస్తుందంటూ ఆగ్రహంగా ఉన్నాడని చెప్పారు. ఆమెను బలవంతంగా తమ గ్రామానికి బైకుపై తీసుకొచ్చాడన్నారు. అనంతరం ఆమెను కొట్టి వివస్త్రను చేసి ఊరేగించాడన్నారు. నిందితులను అరెస్టు చేసేందుకు ఆరు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎఫ్ఐఆర్‌లో మొత్తంగా పదిమంది పేర్లు పేర్కొన్నట్లు డీజీపీ ఉమేష్ మిశ్రా తెలిపారు. బన్స్‌వారా రేంజ్ ఐజి ఆధ్వర్యాన సిట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సంఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై ప్రతాప్‌ఘడ్ ఎస్‌పి దర్యాప్తు చేసి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని తెలిపారు. సిఎం ఆదేశాల మేరకు ఎడిజి (క్రైమ్) ఎం.ఎన్.దినేష్‌ను ప్రతాప్‌ఘడ్‌కు పంపారు.

బాధితురాలికి సిఎం పరామర్శ

బాధిత ఆదివాసీ మహిళను రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ పరామర్శించారు. ఆమెకు సామాజిక, ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రభుత్వ ఉద్యోగమిచ్చి, రూ.10లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని శనివారం ప్రకటించారు. ప్రతాప్‌ఘడ్ వెళ్లి ఆమెను కలుసుకున్న ముఖ్యమంత్రి ఆమె భద్రతకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిట్‌ను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. బాధితురాలి కుటుంబంతో తాను స్వయంగా మాట్లాడానని, వారికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఇది అమానవీయమైన చర్య అని ఆయన వ్యాఖ్యానించారు. తనను బలవంతంగా మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని వెళ్లి, వివస్త్రను చేసి ఊరేగించారంటూ తన భర్తపై ఫిర్యాదు చేసిన బాధితురాలి ధైర్యాన్ని ప్రశంసించిన ముఖ్యమంత్రి ఈ కేసుపై ఫాస్ట్ ట్రాక్ విచారణ చేపట్టాల్సిందిగా ఇప్పటికే ఆదేశించారు. బాధితురాలిది చాలా పేద ఆదివాసీ కుటుంబమని, వారి పరిస్థితి చూస్తే ఆవేదన కలిగిందని అన్నారు.

నా కుమార్తె కమ్యూనిస్ట్‌గా మారింది

- తనతో విభేదాలు బాధిస్తున్నాయి
- ధనవంతులపై ఆమెకు కోసం : ఎలన్ మస్క్ వెల్లడి



న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అతిపెద్ద ధనవంతుల్లో ఒక్కరైన టెస్లా, ట్విట్టర్ అధినేత ఎలన్ మస్క్ తన కూతురు ఏకంగా సోషలిస్ట్ నుంచి కమ్యూనిస్ట్‌గా మారిపోయిందన్నారు. మస్క్ కుమారుడు జేవియర్ పుట్టుకతో పురుషుడిగా పుట్టినప్పటికీ.. 18 ఏళ్లు నిండిన తర్వాత అమ్మాయిగా తన లింగాన్ని మార్చుకున్నారు. ఆ తర్వాత తనకు తండ్రి ఎలన్ మస్క్‌తో ఎలాంటి సంబంధం ఉండకూడదని చట్టపరంగా తన పేరును కూడా మార్చుకుంది. గతేడాది తన తండ్రితో కానీ, ఆయన ఆస్తితో కానీ తనకు సంబంధం లేకుండా తన పేరు మార్చుకోవడానికి అనుమతినివ్వాలని కోర్టుకెక్కింది. మస్క్ కూతురు తన అసలు పేరు జేవియర్ అలెగ్జాండర్ మస్క్ తీసేసి వివియన్‌గా మార్చుకుంది. ఆ తర్వాత నుంచి ఆమె మస్క్‌కు దూరంగా ఉంటోంది. ఈ పరిణామాలు తనను ఎంతో భాధించాయని ఎలన్ మస్క్ తాజాగా తన జీవిత చరిత్ర ఆధారంగా రాసుకున్న వాల్టర్ ఐసాక్సన్ పుస్తకంలో వెల్లడించారని తెలుస్తోంది. ఆ పుస్తకం సెప్టెంబర్ 12న విడుదల కానున్నప్పటికీ.. అందులోని ఓ సారాంశాన్ని 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' వార్త సంస్థ తాజాగా ప్రచురించింది. "నా కుమార్తె సోషలిజం నుంచి పూర్తిగా కమ్యూనిజం వైపు మళ్లింది. తను ధనవంతులు చెడ్డవారని భావించే స్థితికి చేరుకుంది. కన్నబిడ్డతో విబేధాలు నన్నెంతో బాధించాయి. కూతురితో సఖ్యత కోసం ఎన్నిసార్లు ప్రయత్నించినా తను నాతో ఉండేందుకు అంగీకరించలేదు. నా మొదటి కుమార్తె మరణం కంటే జెన్నాతో విభేదాలే నన్ను ఎక్కువ బాధించాయి. నాకు ఇంతగా వేదన మిగిల్చింది మరొకటి లేదు. ఆమె అలా మారడానికి తను చదువుకున్న పాఠశాలనే కారణం. తిరిగి ఆమెతో సత్సంబంధాలు ఏర్పరుచుకోవడానికి చాలాసార్లు ప్రయత్నించి విఫలమయ్యాను. కానీ ఆమె నాతో కాస్త సమయం కూడా గడపడానికి ఇష్టపడలేదు." అని ఎలన్ మస్క్ తన పుస్తకంలో రాసుకున్నారని వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనంలో పేర్కొంది.

ముగ్గురు రైల్వే అధికారులపై సిబిఐ ఛార్జిషీట్

- సాక్ష్యాలు నాశనం చేశారంటూ అభియోగాలు

భువనేశ్వర్: ఒడిశాలోని బాలాసోర్‌లో మూడు రైళ్ల ఢీకొన్న ప్రమాదంపై దర్యాప్తు చేసిన సిబిఐ, ముగ్గురు రైల్వే ఉద్యోగులపై చార్జిషీట్ దాఖలు చేసింది. సీనియర్ ఇంజినీర్ అరుణ్ కుమార్ మహంతా, సెక్షన్ ఇంజినీర్ మహమ్మద్ అమీర్ ఖాన్, టెక్నీషియన్ పప్పు కుమార్‌లపై హత్య, సాక్ష్యాలు ధ్వంసం వంటి నేరపూరిత అభియోగాలు మోపింది. ఈ ముగ్గురినీ జూలైలో సిబిఐ అధికారులు అరెస్ట్ చేశారు. ఐపీసీలోని 304, 201 సెక్షన్ల కింద వారిపై కేసు నమోదు చేశారు. జూన్ 2న బాలాసోర్‌లో మూడు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో సుమారు 290 మంది మరణించగా, వేలాది మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం వెనుక విద్రోహ చర్య ఉండవచ్చని రైల్వే శాఖ అనుమానించింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సిబిఐ దర్యాప్తు కోరారు.

భారత్- పాకిస్థాన్‌ల మధ్య వన్డే మ్యాచ్‌పై ఎంతో ఆసక్తి నెలకొన్నది. ఇరు దేశాల అభిమానులు కూడా ఎంతగానో ఎదురు చూశారు. ఇందుకు ఆసియా కప్ టోర్నమెంటు ఆ అవకాశాన్ని తీసుకొచ్చింది. ఇటు ప్రత్యక్షంగా గ్రౌండ్‌లో, టీవీల్లో చూద్దామనుకొని క్రికెట్ అభిమానులు సిద్ధమయ్యారు. టాస్ గెలిచిన ఇండియా బ్యాటింగ్ దిగింది. అయితే, భారత ఇన్నింగ్స్ తర్వాత వర్షం ఎంతకీ తగ్గకపోవటంతో మ్యాచ్‌ను ఫీల్డ్ అంపైర్లు రద్దు చేశారు. ఇరు జట్లకు చెరొక పాయింట్‌ను కేటాయించారు.

వర్షార్పణం



- టీమిండియా ఇన్నింగ్స్ తర్వాత ఎంతకీ తగ్గని వాన
- రద్దు చేసిన ఫీల్డ్ అంపైర్లు
- ఆసియాకప్‌లో ఇరు జట్లకు చెరో పాయింట్
- టాప్ ఆర్డర్ విఫలం.. ఆదుకున్న మిడిలార్డర్
- రాణించిన ఇషాన్ కిషన్, హార్దిక్
- 266 పరుగులకు భారత్ ఆలౌట్



న్యూఢిల్లీ : శ్రీలంకలోని పల్లెకెలెలో జరిగిన భారత్-పాక్ వన్డే మ్యాచ్‌కు వరణుడు ఆది నుంచే ప్రమాద సంకేతాలు పంపుతూ వచ్చాడు. కొంత వర్షం తగ్గటంతో అంపైర్లు మ్యాచ్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ బ్యాంటింగ్‌ను ఎంచుకున్నాడు. ఎట్టకేలకు మ్యాచ్ మొదలైనా భారత టాప్ ఆర్డర్ విఫలమైంది. ఓపెనర్లు రోహిత్ శర్మ(11), శుభ్‌మన్ గిల్(10)లు తక్కువ పరుగులకే అవుట్ అయ్యారు. ఆ తర్వాత వచ్చిన విరాట్ కోహ్లి(4), అయ్యర్(14), జడేజా(14) కూడా ఎక్కువ పరుగులు చేయలేక చతికల పడ్డారు. దీంతో భారత్ తక్కువ పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. భారత జట్టు కనీసం 200 పరుగులైనా దాటుతుందా అనే అనుమానం, ఆందోళన అభిమానుల్లో కలిగింది.

ఊతమిచ్చిన మిడిలార్డర్

అయితే, మిడిలార్డర్ బ్యాటర్లు రాణించటంతో జట్టు 200 పరుగులను దాటగలిగింది. ఇషాన్ కిషన్(82), హార్దిక్ పాండ్యా(87)లు చక్కటి భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో టీమిండియా చెప్పుదగిన స్కోరును చేయగలిగింది. తక్కువ పరుగులకే ఆలౌట్ అవుతుందనుకున్న భారత జట్టుకు మిడిలార్డర్ జీవం పోయటంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత వచ్చిన వారు కూడా తక్కువ స్కోర్లకే పరిమితమయ్యారు. రవీంద్ర జడేజా(14), శార్దూల్ ఠాకూర్(3), కుల్దీప్ యాదవ్(4), జస్‌ప్రీత్ బుమ్రా(16), మహ్మద్ సిరాజ్(1) త్వరత్వరగా అవుటవటంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లు ముగియకుండానే ఇన్నింగ్స్‌ను ముగించింది. 48.5 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌట్ అయింది. పాక్ బౌలర్లు రాణించటంతో భారత్ తక్కువ పరుగులకే పరిమితమైంది. షాహీన్ అఫ్రిదీ(4 వికెట్లు), నసీమ్ షా(3 వికెట్లు), హరీస్ రౌఫ్(3 వికెట్లు) లు చక్కటి బౌలింగ్‌తో భారత బ్యాటర్లను కట్టడి చేయగలిగారు.

మధ్యలో వర్షం

భారత్ ఇన్నింగ్స్ సమయంలోనూ వరుణుడు అడ్డు వచ్చాడు. అయితే ఆ తర్వాత వర్షం ఆగిపోవటంతో భారత్ ఇన్నింగ్స్‌ను మొదలు పెట్టాడు. భారత్ ఆలౌట్ అయిన తర్వాత వర్షం మొదలైంది. ఎంతకూ వర్షం తగ్గలేదు. దీంతో ఫీల్డ్ ఎంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్ దక్కింది.


చరిత్ర సృష్టించిన ఇషాన్-హార్దిక్ జోడి

పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో టీమిండియా క్రికెటర్లు కిషన్-హార్దిక్ పాండ్యాలు ద్వయం సరికొత్త చరిత్రను సృష్టించింది. ఆసియా కప్‌లో ద్రవిడ్(82)-యువరాజ్‌సింగ్(47)లు 2004లో శ్రీలంకపై ఐదో వికెట్‌కు అత్యధికంగా 133 పరుగులను జోడించారు. ఇప్పుడు ఆ రికార్డును కిషన్,హర్దిక్‌లు 138 పరుగుల భాగస్వామ్యంతో చెరిపివేశారు. అలాగే, వన్డే క్రికెట్ చరిత్రలో పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో ఐదో వికెట్‌కు అత్యధిక పరుగులు జోడించిన రాహుల్ ద్రవిడ్-మహ్మద్ కైఫ్‌ల రికార్డు(135 పరుగులు)ను కూడా వీరు బద్దలు కొట్టారు.


ఆసియా కప్ చరిత్రలో ఐదో వికెట్‌కు అత్యధిక భాగస్వామ్యం నమోదు చేసిన టాప్-4 జోడీలు

- ఇషాన్ కిషన్-హార్దిక్ పాండ్యా 2023లో పాక్‌తో మ్యాచ్‌లో 138 పరుగులు
- రాహుల్ ద్రవిడ్- యువరాజ్ సింగ్ (2004) - 133 పరుగులు
- ధోని-రోహిత్ శర్మ (2008)- పాక్‌తో 112 రన్స్
- ధోని-రోహిత్ శర్మ (2010)- శ్రీలంకతో 79 పరుగులు

ఆ కిక్కే.. వేరప్పా




హరి హర వీరమల్లు



ఓజీ

తమ అభిమాన కథానాయకుడు పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న తాజా సినిమాల్లోని సరికొత్త పోస్టర్లతో పాటు గ్లింప్స్‌ని మేకర్స్ రిలీజ్ చేయటంతో అభిమానుల ఆనందానికి ఆకాశమే హద్దయ్యింది. ఒక్కొక్క సినిమాలోని ఒక్కొక్క పోస్టర్‌లో తన పవరేంటో చూపించేలా ఉన్న పవన్ కళ్యాణ్ స్టిల్స్ ప్రేక్షకుల్ని సైతం మెస్మరైజ్ చేస్తున్నాయి. శనివారం పవన్‌కళ్యాణ్ బర్త్‌డే సందర్భంగా ఆయన, క్రిష్ కాంబినేషన్‌లో నటిస్తున్న 'హరి హర వీర మల్లు' పీరియాడిక్ చిత్రానికి 'ది లెజెండరీ హీరోయిక్ అవుట్‌లా' అని ఉప శీర్షికను జోడించగా, హరీష్‌శంకర్‌తో చేస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' మేకర్స్ పోస్టర్ విడుదల చేశారు. సుజీత్ దర్శకత్వంలో డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్న 'ఓజీ' చిత్రం నుండి 'హంగ్రీ చీతా' పేరుతో గ్లింప్స్‌ని అభిమానుల సమక్షంలో రిలీజ్ చేశారు.



ఉస్తాద్ భగత్ సింగ్

నవచిత్రం

రిలీజ్‌కి ముందే రికార్డ్స్



షారూఖ్ ఖాన్, నయనతార

షారూఖ్ ఖాన్, నయనతార జంటగా నటించిన చిత్రం 'జవాన్'. ఈనెల 7న ప్రపంచ వ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ రిలీజ్ అవుతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ 'జవాన్' అడ్వాన్స్ బుకింగ్స్‌ను ఓపెన్ చేశారు. సినిమా కోసం ఎంత ఆతృతగా ఫ్యాన్స్, ఆడియెన్స్ ఎదురు చూస్తున్నారో అడ్వాన్స్ బుకింగ్స్ వస్తున్న రెస్పాన్స్ చూస్తేనే అర్థమవుతుంది.అడ్వాన్స్ బుకింగ్స్ విషయంలో 'జవాన్' సరికొత్త రికార్డులను క్రియేట్ చేస్తోంది. ఇలాంటి రికార్డ్స్ క్రియేట్ చేయటం ఓ హిస్టరీ అని ఎగ్జిబిటర్స్ మాట్లాడుకోవటం విశేషం.

ఐనాక్స్ లీజర్ లిమిటెడ్, చీఫ్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ రాజేంద్ర సింగ్ జ్యాలా మాట్లాడుతూ, 'ఈ మూవీ అడ్వాన్స్ బుకింగ్స్‌కి వస్తోన్న రెస్పాన్స్ అద్భుతంగా ఉంది. పివిఆర్ ఐనాక్స్ అడ్వాన్స్ బుకింగ్స్ ఇలాంటి హయ్యస్ట్ అడ్వాన్స్ బుకింగ్స్‌ను చూడలేదు. బుకింగ్స్ ఓపెన్ చేసిన గంటల్లోనే 1,25,000 టికెట్స్ అమ్ముడయ్యాయి. 'పఠాన్, గద్దర్ 2' కంటే ఎక్కువగా ఉంది. ఇది బాలీవుడ్ ఇండస్ట్రీకి శుభ పరిణామం' అని చెప్పారు.

'జవాన్' చిత్రాన్ని రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై అట్లీ దర్శకత్వంలో గౌరీ ఖాన్ నిర్మించారు. గౌరవ్ వర్మ ఈ సినిమాకు సహ నిర్మాత.



మృణాల్ ఠాకూర్, కియారా ఖన్నా, నాని

ఓ తండ్రి.. భావోద్వేగ ప్రయాణం

హీరో నాని నూతన దర్శకుడు శౌర్యువ్ దర్శకత్వంలో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హాయ్ నాన్న'. వైర ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్‌పై మోహన్ చెరుకూరి (సివిఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తోంది.

పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో నాని కూతురుగా బేబీ కియారా ఖన్నా కనిపించనుంది. తాజాగా ఈ చిత్ర నూతన షూటింగ్ షెడ్యూల్ కూనూర్‌లోని పచ్చని అందమైన లొకేషన్స్‌లో ప్రారంభమైంది. 'హాయ్ నాన్న' మ్యూజికల్ ఫెస్ట్ కోసం త్వరలోనే మ్యూజికల్ ప్రమోషన్స్ ప్రారంభం కానున్నాయి.

'నాని కెరీర్‌లోనే ఇదొక డిఫరెంట్ సినిమా. ఓ తండ్రి.. భావోద్వేగ ప్రయాణం ఆద్యంతం అలరిస్తుంది. డిసెంబర్ 21న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీలో ఈ సినిమాను రిలీజ్ చేస్తునట్టు మేకర్స్ తెలిపారు.

చంద్రూ దర్శకత్వంలో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్

'ఈగ, బాహుబలి' వంటి స్ట్రైట్ తెలుగు చిత్రాలతో టాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్. శనివారం కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భంగా ఆయన మరో కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్ అయ్యింది. డైరెక్టర్ ఆర్ చంద్రూ ఈ సినిమాను రూపొందించబోతున్నారు. 'బాహుబలి, ఆర్ఆర్ఆర్' చిత్రాల కథా రచయిత విజయేంద్రప్రసాద్ ఈ సినిమాకు స్క్రిప్ట్ సూపర్ విజన్ చేస్తుండటం విశేషం.

కన్నడలో పలు సూపర్ హిట్ చిత్రాలను రూపొందించిన ఆర్ సీ స్టూడియోస్ సంస్థ ప్రతిష్టాత్మకంగా ఈ భారీ పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆర్ చంద్రూ, కిచ్చా సుదీప్ కాంబినేషన్ లో వస్తున్న ఈ సినిమా ప్రేక్షకులను మెస్మరైజ్ చేసే మేకింగ్‌తో తెరపైకి రాబోతోంది. త్వరలో ఈ సినిమాను సెట్స్ మీదకు తీసుకెళ్లనున్నారు.



కిచ్చా సుదీప్

సమాజానికి ఉపయోగపడే సినిమా



సినిమా బండి క్రియేషన్స్, యుపిక్ క్రియేషన్స్ బ్యానర్స్ పై రూపొందుతున్న ప్రాజెక్ట్ '111 గ్రీన్ జోన్'.

విజయ రాఘవేంద్ర దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్ర టైటిల్ టీజర్, పోస్టర్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది.


ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, 'ఓ మంచి ఉద్దేశంతో తీసిన చిత్రం. మంచి బడ్జెట్ ఉంటే పాన్ ఇండియా రేంజ్‌లో చేసే చిత్రమిది. ఎందుకంటే గ్రీన్‌జోన్ అనేది మన దగ్గరే కాదు.. ఇండియా అంతా ఉంది' అని తెలిపారు. సంగీత దర్శకుడు యాండర్ లీ మాట్లాడుతూ,'కంటెంట్ పరంగా ఇది చాలా స్పెషల్ మూవీ. కల్చర్‌తో ముడిపడిన చిత్రమిది. తప్పకుండా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందిస్తుంది' అని అన్నారు

లిరిక్ రైటర్ చిత్రన్ మాట్లాడుతూ,'ఇది సమాజానికి ఉపయోగపడే సినిమా. చిన్న సినిమా అయినప్పటికీ ఇందులో ఉండే కంటెంట్ చాలా పెద్దది. ఇందులో పాటని చాలా ప్రేరణ ఇస్తూ రాయించారు డైరెక్టర్. చంద్రబోస్ పక్కన నా పేరు చూసుకోవడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించే సినిమా' అని చెప్పారు.

'దర్శకుడు విజయ రాఘవేంద్ర చాలా ప్యాషన్‌తో ఈ సినిమా చేశారు. టీజర్‌లో వినిపించిన డైలాగ్‌లోని పెయిన్‌తో ఈ మోషన్ టీజర్ చేశాం. లీ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. విజువల్‌గా కూడా ఈ సినిమా చాలా బాగుంటుంది' అని వీఎఫ్ఎక్స్ చందూ అన్నారు.

ఈ చిత్రానికి ఎడిటింగ్ : ఎన్టీఆర్, సాహిత్యం : చంద్రబోస్, చిత్రన్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నవతెలంగాణ
YOUTH N YOUTH
జోష్
15
హైదరాబాద్ ఆదివారం 3 సెప్టెంబర్ 2023

టెక్నాలజీ రంగంలో మనిషి ఎన్నో అద్భుతాలు సృష్టిస్తున్నాడు. నిత్యం కొత్త ఆవిష్కరణలు చేస్తూ ముందుకు సాగుతున్నాడు. అంతరిక్ష రహస్యాలు ఛేదించే దిశలో ఎన్నో ప్రయోగాలు చేస్తూ విజయాలు సాధిస్తున్నాడు. భారతీయ శాస్త్రవేత్తలు అగ్ర రాజ్యాలతో పోటీ పడుతూ.. శాస్త్ర, సాంకేతిక రంగంలో ఎన్నో అద్భుతాలు సాధిస్తున్నారు. చంద్రుడిపై అధ్యయనానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చేపట్టిన మూడో మిషన్ చంద్రయాన్-3 విజయవంతంగా పూర్తి చేసిన విషయం తెలిసిందే. భారత్ చంద్రున్ని ముద్దాడింది%ొ% జాబిల్లి పై కాలుమోపి చరిత్ర సృష్టించింది%ొ%చంద్రుని దక్షిణ ధృవంలో అడుగుపెట్టిన ప్రపంచంలోనే మొట్ట8మొదటి దేశంగా భారత్ అవతరించింది. ప్రపంచ దేశాలు భారత్‌కు, ఇస్రోకు అభినందనలు తెలుపుతున్నాయి. చంద్రయాన్ 3ని విజయగాథగా మార్చేందుకు ఇస్రో విజ్ఞానమే చాలా కీలకం. నిపుణులు, శాస్త్రవేత్తలందరి మధ్య ఈ ప్రాజెక్ట్‌లో అతి పిన్న వయసు యువకులు కూడా భాగసామ్యం అయ్యారు. వారిలో మన తెలుగు వారు కూడా పదుల సంఖ్యలో ఉన్నారు. వారి చిరు పరిచయమే ఈవారం జోష్..

యువ చంద్రోదయం

కొత్తగూడెం నుంచి జక్కుల సాయి తేజ



చంద్రయాన్-3 ప్రయోగంలో రేంజ్ ఆపరేషన్ విభాగంలో కొత్తగూడెం మధురబస్తీకి చెందిన జక్కుల సాయితేజ(23) పనిచేశారు. దేశాభివృద్ధి కర్తవ్యంలో భాగస్వామ్యం కావాలన్న అతని తండ్రి ఆశను నేడు అతడు నిజం చేశాడు. పదవ తరగతిలో ఉన్నప్పుడు అగ్ని ప్రమాదంలో తన తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయాడు. అయినప్పటికీ, దృఢ సంకల్పంతో కష్టాలను ఇష్టంగా ఎదుర్కొని విజయాలను సాధించాడు. మాజీ భారత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆత్మకథ "వింగ్స్ ఆఫ్ ఫైర్" తండ్రి అతనికి అందించాడు. ఆ పుస్తకం అతని చదువులోనూ, వృత్తిపరమైన ప్రయత్నాలలో ప్రేరేపిస్తూనే ఉంది.

దగ్గరి బంధువుల సహాయంతో, అతను తన పాఠశాల విద్యను ఇల్లందు ఆధారిత ప్రయివేట్ పాఠశాలలో, ఇంటర్మీడియట్ హైదరాబాద్ ఆధారిత ప్రయివేట్ సంస్థలో పూర్తి చేశాడు. JEE (అడ్వాన్స్‌డ్) పరీక్షలో అద్భుతమైన ఫలితాల ద్వారా IIT- ఢిల్లీలో సీటు సాధించి మెకానికల్ ఇంజనీరింగ్ అయ్యాడు. ISRO బెంగళూరు ఆధారిత హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ (HSFC)లో సైంటిస్ట్/ ఇంజనీర్‌గా ఎంపికయ్యాడు. ఇస్రో పరిధిలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (శ్రీహరికోట)లో 'సైంటిస్ట్ ఇంజినీరు-సి' విభాగంలో శాస్త్రవేత్తగా పని చేస్తున్నారు. ఇస్రో ప్రయోగించిన మంగళయాన్ మిషన్, 104 శాటిలైట్ మిషన్, పీఎల్‌వీ సీ-42, జీఎస్ఎల్‌వీ, ఆర్ఎల్‌వీ-45, చంద్రయాన్-2 సహా సుమారు 45 ప్రయోగాల్లో భాగస్వామిగా ఉన్నాడు.

బాపట్ల జిల్లా నుంచి మానస



విక్రమ్ ల్యాండర్ సురక్షితంగా జాబిల్లిపై దిగేలా ఇస్రో రూపొందించిన సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ కీలక శాస్త్రవేత్తల బృందంలో యువ శాస్త్రవేత్త బొల్లు మానస ఒకరు. నాలుగేళ్లుగా శాస్త్రవేత్తలు చేసిన శ్రమ ఫలించి చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్‌ను విజయవంతంగా దించిన తొలి దేశంగా ప్రపంచ పటంలో భారత్‌ను నిలిపి జాతి యావత్తూ గర్వపడేలా చేయడంలో భాగస్వామి అయి మహిళాశక్తి చాటారు. తెలుగు వారికి, ప్రతిభావంతులైన యువతకు గర్వ కారణమయ్యారు.

అమృతలూరుకు చెందిన బొల్లు మానస కేరళలోని తిరువనంతపురం ఐఎస్‌టీ కళాశాలలో ఏవియానిక్స్ చదివారు. ఉద్యోగరీత్యా తల్లిదండ్రులు వనజకుమారి, అనిల్‌కుమార్ గుంటూరులో స్థిరపడ్డారు. వారి ప్రోత్సాహంతో శాస్త్రవేత్తగా ఎదిగి దేశానికి సేవ చేయాలని పట్టుదలతో కష్టపడి చదివారు. 2014లో కోర్సు పూర్తయిన వెంటనే బెంగళూరు ఇస్రో శాటిలైట్ కేంద్రంలో శాస్త్రవేత్తగా ఉద్యోగంలో చేరారు. భర్త పవన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా బెంగళూరులో పనిచేస్తున్నారు. చంద్రయాన్-2 ప్రాజెక్టు సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ విభాగంలోనూ ఈమె సేవలందించారు. 2019లో ల్యాండర్ చంద్రుడిపై దిగే సమయంలో అదుపు తప్పి కూలిపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు.


ఇస్రో శాటిలైట్ కేంద్రం నుంచి చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్ జాబిల్లిపై అడుగు పెట్టే సమయంలో శాస్త్రవేత్తల బృందంతో కలిసి పర్యవేక్షిస్తూ తీవ్ర ఉద్విగ్నతకు గురయ్యారు. చంద్రుడిపై ల్యాండర్ విజయవంతంగా దిగగానే సంతోషంతో చప్పట్లు కొట్టారు. నాలుగేళ్ల కష్టం ఫలించినందుకు ఆనందబాష్పాలు రాల్చారు.

కడప జిల్లా నుంచి రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి



రాజంపేట మండలం దిగువబసి నాయుడుగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వై.సుబ్రమణ్యంరెడ్డి, చంద్రకళ దంపతుల తనయుడు రాజేంద్రప్రసాద్ రెడ్డి బెంగళూరు ఇస్రోలో సైంటిస్ట్‌గా పని చేస్తూ చంద్రయాన్-3 మిషన్ (ప్రయోగం)లో పాల్గొన్నారు. చంద్రయాన్-3 విజయవంతం కావడం, ఆ ప్రయోగ బృందంలో రాజేంద్ర ప్రసాద్ రెడ్డి పాల్గొనడం పట్ల ఆయన స్నేహితులు, బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి తల్లిదండ్రులను పలువురు అభినందిస్తున్నారు. ఎంటెక్ పూర్తి అయ్యాక క్వాల్ కం కంపెనీ తమ కంపెనీలో ఉద్యోగం ఇచ్చేందుకు రాజేంద్రప్రసాద్ రెడ్డికి 43 లక్షల ప్యాకేజీతో ఆఫర్ ఇచ్చింది. అయితే రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి తన మేధస్సును దేశానికి ఉపయోగించాలన్న ఆశయంతో ఆ ఉద్యోగాన్ని తిరస్కరించి సైంటిస్ట్ అయ్యారు. సైంటిస్ట్ అయ్యాక తాను భాగస్వామ్యం అయిన తొలి ప్రయోగం చంద్రయాన్ - 3.

వైఎస్సార్ జిల్లా నుంచి చందన



వైయస్ఆర్ జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరానికి చెందిన యువ శాస్త్రవేత్త అవ్వారు చందన (26) కూడా భాగస్వామిగా ఉన్నారు. భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) 2019లో నిర్వహించిన ఐఐఎస్టి పోటీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ శాటిలైట్ కేంద్రంలో విక్రమ్ ల్యాండర్ డిజైనర్ విభాగంలో పనిచేస్తున్నారు. 'చంద్రయాన్ మిషన్ లో మూడేండ్లుగా పరిశోధనలు చేస్తున్నారు.

ఉయ్యూరుకు చెందిన చైతన్య

చంద్రయాన్-3 ప్రయోగంలో ఉయ్యూరుకు చెందిన యువ శాస్త్రవేత్త మధిర చైతన్య భాగస్వామ్యం ఉంది. ఇస్రో కేంద్రంలో అతడు 'ఈ' కేటగిరి విభాగంలో పనిచేస్తున్నాడు. అతడి ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యాభ్యాసం ఉయ్యూరులోని ఫ్లోరా పాఠశాలలో కొనసాగింది. ఇంటర్ చైతన్యలో ఐఐటీ విభాగంలో చదివి ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విద్యను త్రివేండ్రంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థలో 2008-12లో పూర్తి చేశారు. ఇస్రో సంస్థ దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ విద్యకు ఎంపిక చేసిన 150 మందిలో చైతన్య ఒకడు. అనంతరం ఇస్రో సంస్థలో ఉద్యోగం పొంది అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. మంగళ్ యాన్, చంద్రయాన్-2, చంద్రయాన్-3లోనే కాకుండా పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, ఎస్ఎస్ఎల్‌వీ మిషన్స్‌లోని 50 లాంచింగ్ ప్రయోగాల్లో చైతన్య భాగస్వామ్యమయ్యాడు. చైతన్య తండ్రి వెంకటేశ్వర రావు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలో ఉయ్యూరు శాఖలో డీఎంగా పనిచేస్తున్నారు.



హైదరాబాద్ ఉప్పల్ నుంచి భరత్



చంద్రయాన్-3 శాస్త్రవేత్తల బృందంలో ఉప్పల్ కు చెందిన దేవసాని భరత్ ఉన్నారు. ఇతను ఇస్రోలో శాస్త్రవేత్తగా ఆరేళ్లుగా చేస్తున్నారు. చంద్రయాన్-3లో టెలీ కమ్యూనికేషన్‌కు సంబంధించిన సిగ్నలింగ్ వ్యవస్థలో నలుగురు సభ్యుల బృందంలో భరత్ ఉన్నారు. దేవసాని భరత్ ఇంటర్ వరకు నగరంలోనే చదివారు. ఐఐటీలో అర్హత సాధించడంతో పలు ఐఐటీలు, ఎన్ఐటీలలో సీటు వచ్చింది. వాటిల్లో చేరకుండా ఐసాట్ రాసి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ)లో సీటు సాధించారు. ఇస్రోలో ఆరేండ్లుగా శాస్త్రవేత్తగా కొనసాగుతున్నారు.

కృష్ణ కుమ్మరి

జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లికి చెందిన కృష్ణ కుమ్మరి చంద్రయాన్ - 3 మిషన్‌లో 2 పేలోడ్స్ (ఏహెచ్‌వీసీ), (ఐఎల్ఎస్ఏ)కి డేటా ప్రాసెసింగ్ సాఫ్ట్‌వేర్ రాశారు. కూలి పనులు చేస్తూ జీవనం సాగించే ఉండవల్లికి చెందిన లక్ష్మీదేవి, మద్దిలేటి దంపతుల కృష్ణ కుమ్మరి. 10 తరగతి వరకు ఉండవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న కృష్ణ.. మూడేండ్ల పాటు తిరుపతిలో డిప్లొమా ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డీసీఎంఈ) పూర్తి చేశాడు. ఈ-సెట్ ర్యాంక్ సాధించి హైదరాబాదులో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చేశారు. కళాశాల ప్లేస్‌మెంట్‌లో భాగంగా టెరా డేటా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సంస్థలో మూడున్నర సంవత్సరాలు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు. ఉద్యోగం చేస్తూనే ఇస్రోలో ఐసీఆర్‌బీ (ఇస్రో సెంట్రలైజడ్ రిక్రూట్‌మెంట్ బోర్డు పరీక్ష) రాసి ఆల్ఇండియా 4వ ర్యాంకు సాధించారు. అనంతరం 2018 జనవరిలో సైంటిస్ట్ లెవల్ ఉద్యోగం (గ్రూప్ 'ఏ' గెజిడెట్ అధికారి) యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ (యూఆర్ఎస్‌సీ) / ఇస్రోలో ఓ యూనిట్ ల్యాబొరేటరీ ఫర్ ఎలక్ట్రో ఆప్టిక్స్ సిస్టమ్ (ఎల్ఈఓఎస్) బెంగళూరులో సాధించారు.



వల్లూరి ఉమామహేశ్వరరావు



ఖమ్మంకు చెందిన యువశాస్త్రవేత్త ఈ జర్నీలో ఆపరేషన్ మేనేజర్‌గా వ్యవహరించారు. ఖమ్మం శ్రీనగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ పీఆర్ డీఈ వల్లూరు కోటేశ్వరరావు, పద్మావత తనయుడు వల్లూరి ఉమామహేశ్వరరావు 2013 ఇస్రో శాస్త్రవేత్తగా చేరారు. పదేండ్లగా వివిధ ప్రయోగాల్లో పాలుపంచుకున్నారు. డిజైనింగ్ విభాగాల్లో 1500 మంది పైగా పనిచేస్తున్నారు. ఆపరే షన్ మేనేజర్లుగా 30 మందిని సెలెక్ట్ చేసుకున్నారు.. ఆ ముప్పై మందిలో ఉమామహేశ్వరరావు కూడా ఒకరు. చంద్రయాన్-3 మిషన్

మరో అమ్మ

ఇప్పుడు నువ్వు
నాకు మరో అమ్మవి..
ప్రేమ నీడను పంచే కొమ్మవి..
నా కథను మార్చి రాసిన బ్రహ్మవి..
అణువణువునా కరుణ నిండిన కాత్యాయనివి..
ఎక్కడా అచ్చు వేయబడని కావ్యానివి..

నా జీవితంలోకి ప్రేమ వరాన్ని తీసుకొచ్చిన
మా శుభ శృతి కి రెండు మాటలు..

నిజానికి నువ్వు నాకు అందని ఆకాశానివి..
ఏ మథనం జరగకుండానే పాలకడలి పొంగి,
అమృత కలశం అందినట్లు దొరికావ్..

చందమామని అందుకోబోయిన
నీ చేతివేళ్ల మరకలు
నింగి చుక్కలై మెరిసినపుడు,
నేనో తెల్లకాగితం..
నాలో చూడటానికి,
నా గురించి నీకు తెలియడానికి
ఇంకేం మిగల్లేదు..

నీ నవ్వుకై తపిస్తోన్న నన్ను
మేఘపు గోడల చాటున దాక్కుని చూస్తున్న
నీ మోము ఓ నెలవంక..

నా ఆరంభంలో..
నా ఓటమిలో..
నా చీకటిలో..

నా నవ్వు వెనుక కన్నీరై..
నా బాధ వెనుక సంతోషమై ఉన్న నీకు..
ప్రేమగా ఒక్కమాట..

నువ్వెంత దూరం నడుస్తావో
అంత దూరం నేనుంటా..
ఆకాశమై..
అనంతమై..
అన్నింటినీ మరిపించే నీ ఆరోప్రాణమై..


నీ ప్రేమలో నాకో కొత్త బ్రతుకు పరిమళాన్ని
పరిచయం చేసిన
నా ఇంటి పట్టు పువ్వు కు
ప్రేమారా పుట్టిన రోజు శుభాకాంక్షలు..

- అగ్నిశిఖ



రాయాలి

ఎంతకూ తగ్గని
ఈ అన్యాయాలపై
ఎంతైనా రాయాలి
ఆవిరైపోతున్న
ఆశల కోసం
అలుపెరగకుండా రాయాలి
విరామమెరుగని
ఈ దాడులపై
విపులంగా రాయాలి
నలిగిపోతున్న జీవితాల కోసం
సజీవంగా రాయాలి



బలైపోతున్న కుటుంబాల
కోసం
క్లుప్తంగా రాయాలి
నీరుగారి పోతున్న
ఆశయాల కోసం

నిశితంగా రాయాలి
పేదరికంపై
పెద్ద ఎత్తున రాయాలి
ఆకలి కేకల కోసం
అణువణువునా రాయాలి
నిరుద్యోగంపై
నిలువెత్తున రాయాలి
దుష్టులపై దీర్ఘంగా రాయాలి
దుర్మార్గ పాలనపై
దూర దృష్టితో రాయాలి
మార్పు కోసం రాయాలి
సమాజాన్ని
మార్చడానికై రాయాలి

- కీర్తి ఇనుగుర్తి